

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి ...
ఉత్తరాంధ్ర
విశాఖపట్నం, శ్రీకాకుళం
విజయనగరం
గురువారం 26-02-2026 పేజీలు: 21


# ప్రపంచ వేదికపై విశాఖ ప్రతిభ

➪ మేయర్స్ చాలెంజ్ గ్లోబల్ గ్రాంట్ గెలుచుకున్న విశాఖ ➪ 1 మిలియన్ అమెరికన్ డాలర్ల బ్లూమ్ బెర్గ్ ఫిలాంత్రూపీస్ ➪ వి - పుల్ జీవీఎంసీకి ఒక మోడల్‌గా నిలిచింది ➪ కమిషనర్ కేతన్ గార్గ్






2వ పేజీలో



# జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కలకలం

- ఆర్డీఎక్స్‌తో పేల్చేస్తామంటూ ఈ-మెయిల్...



6 లో

# విశాఖపట్నం రేంజ్‌లో గంజాయి నిర్మూలనకు ఉక్కుపాదం

➢ 20 నెలల్లో 55 టన్నులకుపైగా స్వాధీనం ➢ రూ.9.19 కోట్ల ఆస్తుల జప్తు ➢ భారీ స్థాయిలో గంజాయి ధ్వంసం ➢ ఆర్థిక మూలాలపై దెబ్బ ➢ కఠిన చట్టాలు, సాంకేతిక నిఘా ➢ పునరావాసం, ప్రత్యామ్నాయ పంటలు




2వ పేజీలో

# విశాఖలో హైరైజ్‌ల కొత్త దశ

2వ పేజీలో

• భూమి ఖర్చు • ప్రాజెక్టుల ఆర్థిక సమీకరణ • కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పు • వృద్ధి కారిడార్లలో నిర్మాణాల ఊపు • ఐటీ రంగం ప్రభావం • సవాళ్లు కూడా ఉన్నాయి • భవిష్యత్ దిశ





# డయేరియా బాధితులు ధైర్యంగా ఉండండి

- మరింత మెరుగైన వైద్యం అందించండి -

బాధితుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్న శ్రీకాకుళంజిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



3వ పేజీలో

# ప్రపంచ వేదికపై విశాఖ ప్రతిభ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ప్రతిష్టాత్మకమైన బ్లూమ్ బెర్గ్ ఫిలాంత్రూపైస్ నిర్వహించిన 2025--2026 మేయర్స్ చాలెంజ్‌లో ప్రపంచవ్యాప్తంగా ఎంపికైన 24 నగరాల్లో ఒకటిగా నిలిచిందని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ విజయంతో విశాఖ నగరానికి 1 మిలియన్ అమెరికన్ డాలర్ల గ్రాంట్‌తో పాటు సాంకేతిక, కార్యాచరణ సహాయం అందనుందని పేర్కొన్నారు. కమిషనర్ వివరించుతూ, "వైజాగ్--ప్రజాముఖి అర్బన్ లివింగ్ ల్యాబ్ (వి -పుల్ )" కార్యక్రమం జీవీఎంసీకి ఒక మోడల్‌గా నిలిచిందన్నారు. వరదలు, తుఫానులు, తీవ్ర ఉష్ణ తరంగాల ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రజలతో కలిసి వినూత్న పరిష్కారాలను ఆవిష్కరించిన ప్రత్యేక పౌర భాగస్వామ్య కార్యక్రమం ద్వారా విశాఖ అంతర్జాతీయ గుర్తింపు పొందిందన్నారు. ఈ కార్యక్రమం ప్రజాకేంద్రీకృత విధానం, వాతావరణ ప్రతిఘటన సామర్థ్యం, హైపర్–లోకల్ కమ్యూనిటీ భాగస్వామ్యంపై దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 630కు పైగా దరఖాస్తుల మధ్య విశాఖ ప్రత్యేక ప్రతిభ కనబరిచి ఈ విజయాన్ని సాధించిందన్నారు. ప్రారంభ దశలో టాప్–50 ఫైనలిస్టులలో స్థానం సంపాదించిన జీవీఎంసీకి 50,000 అమెరికన్ డాలర్ల సీడ్ ఫండింగ్, సాంకేతిక సహాయం లభించిందని తెలిపారు. ఆ సహాయంతో వార్డు స్థాయి కమ్యూనిటీ సమావేశాలు నిర్వహించి, హైపర్–లోకల్ సెన్సింగ్ వ్యవస్థలు, డేటా ఆధారిత నిర్ణయ సాధనాలను పరీక్షించినట్లు పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో వాతావరణ ప్రతిఘటన, విపత్తు సిద్ధత చర్యలను అమలు చేసి, పౌరులు--మునిసిపల్ విభాగాల మధ్య సమర్థవంతమైన ఫీడ్‌బ్యాక్ వ్యవస్థను నెలకొల్పినట్లు తెలిపారు. నగర పరిపాలనలో ప్రజల భాగస్వామ్యంతో తీసుకున్న వినూత్న చర్యలకు లభించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు గర్వకారణమన్నారు. "విశాఖ నగరాన్ని బ్లూమ్ బెర్గ్ ఫిలాంత్రూపీస్ మేయర్స్ చాలెంజ్ విజేతగా ఎంపిక చేయడం జీవీఎంసీకి గౌరవకరం. ప్రాంగణ స్థాయిలో పరీక్షించిన పరిష్కారాలతో నగరాలు మార్పుకు నాయకత్వం వహించగలవనే మా నమ్మకానికి ఇది బలాన్నిచ్చింది," అని కమిషనర్ పేర్కొన్నారు. ఈ 1 మిలియన్ అమెరికన్ డాలర్ల గ్రాంట్‌ను బాటమ్–అప్ విధానాన్ని బలోపేతం చేయడం, విపత్తు సిద్ధతను మెరుగుపరచడం, కార్యక్రమాన్ని మరిన్ని వార్డులకు విస్తరించేందుకు వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మైఖేల్ ఆర్ బ్లూమ్ బెర్గ్ , న్యూయార్క్ సిటీ మాజీ మేయర్ మరియు బ్లూమ్ బెర్గ్ ఫిలాంత్రూపీస్ స్థాపకుడు, సమస్యలను సృజనాత్మకంగా పరిష్కరించే నగర పాలక సంస్థలే అత్యంత సమర్థవంతమైనవని, మరిన్ని నగరాలు విజయం సాధించేందుకు మేయర్స్ చాలెంజ్‌ను ప్రారంభించామని పేర్కొన్నట్లుగా కమిషనర్ తెలిపారు. రాబోయే నెలల్లో జీవీఎంసీ ప్రత్యేక ఇన్నోవేషన్ అమలు బృందాన్ని ఏర్పాటు చేసి, పైలట్ కార్యక్రమాలను మరిన్ని వార్డులకు విస్తరించడానికి, అలాగే విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ రంగంతో భాగస్వామ్యాలను బలోపేతం చేయనుందని ఆయన తెలిపారు విశాఖపట్నం ఈ గ్లోబల్ వేదికను రియో డే జనెయిరో , భార్సెలోన , టోరోంటో , కెప్ టౌన్ , బుడపెస్ట్ , మీదిల్లన్ , బెల్ఫాస్ట్ వంటి ప్రముఖ అంతర్జాతీయ నగరాలతో పంచుకుంటోందని కమిషనర్ తెలిపారు.

# విశాఖపట్నం రేంజ్‌లో గంజాయి నిర్మూలనకు ఉక్కుపాదం

**అనకాపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** గంజాయి రహిత సమాజం లక్ష్యంగా విశాఖపట్నం రేంజ్ పోలీసులు చేపట్టిన కఠిన చర్యలు గణనీయ ఫలితాలు ఇస్తున్నాయి. రేంజ్ ఐజీ గోపినాథ్ జట్టి ఐపీఎస్, అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా లతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో గత 20 నెలల గంజాయి వ్యతిరేక పోరాటంపై సమగ్ర వివరాలు వెల్లడించారు.



### - భారీ స్థాయిలో గంజాయి ధ్వంసం

డీజీపీ ఆదేశాల మేరకు అనకాపల్లి జిల్లా పరవాడలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్ట్ వద్ద ఇన్సినరేషన్ పద్ధతిలో భారీ ఎత్తున స్వాధీనం చేసుకున్న మత్తు పదార్థాలను ధ్వంసం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా:లి 451 కేసులకు సంబంధించి 35,268.374 కిలోల గంజాయి, 132.157 లీటర్ల హషీష్ ఆయిల్ అనకాపల్లి జిల్లా:లి 332 కేసులకు సంబంధించి 17,068.24 కిలోల గంజాయి, 10.03 లీటర్ల హషీష్ ఆయిల్ మొత్తంగా 783 కేసులకు సంబంధించిన 52,336.614 కిలోల గంజాయి, 142.187 లీటర్ల హషీష్ ఆయిల్ ధ్వంసం చేసినట్లు తెలిపారు.

### - 20 నెలల ప్రగతి

జూన్ 2024 నుంచి జనవరి 2026 వరకు రేంజ్ వ్యాప్తంగా 976 కేసులు నమోదు చేసి 2,405 మందిని అరెస్టు చేశారు. 55,346.292 కిలోల గంజాయి, 56.275 కిలోల హషీష్ ఆయిల్ స్వాధీనం చేసుకోగా, 685 వాహనాలను సీజ్ చేశారు. 24 అంతర్రాష్ట్ర ముఠాలను గుర్తించి 129 మంది సభ్యులపై నిఘా ఉంచారు.

### - ఆర్థిక మూలాలపై దెబ్బ

ఎన్డిపిఎస్ చట్టం కింద 14 మంది ప్రధాన నిందితులకు చెందిన రూ.9,19,17,290 విలువైన ఆస్తులను గుర్తించి ఫ్రీజ్ చేశారు. అక్రమ ఆర్థిక వనరులపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని ఐజీ తెలిపారు.

### - కఠిన చట్టాలు, సాంకేతిక నిఘా

పిఐటి, ఎన్డిపిఎస్ చట్టం కింద 92 ప్రతిపాదనలు సిద్ధం చేసి 34 డిటెన్షన్ ఆర్డర్లు అమలు చేశారు. 1,599 మందిపై హిస్టరీ షీట్లు తెరిచారు. 33 ఆధునిక డ్రోన్లతో 129 హాట్‌స్పాట్‌లపై 1,360 సార్లు నిఘా పెట్టి నిందితులను పట్టుకున్నారు. ఖోజ్ , నిదాన్ , నాట్ గ్రిడ్ వంటి సాంకేతిక సాధనాలను వినియోగిస్తున్నారు.

### - పునరావాసం, ప్రత్యామ్నాయ పంటలు

6 డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా 401 మందికి కౌన్సెలింగ్ అందించగా, 244 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. గంజాయి సాగు మాన్పించి 29,840 ఎకరాల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుకు 1.59 కోట్ల మొక్కలు పంపిణీ చేశారు. యువత మత్తుకు బలి కాకూడదని, గంజాయి రహిత సమాజం కోసం ప్రతి పౌరుడు సహకరించాలని, సమాచారం కోసం 1972 లేదా 1933 నంబర్లను సంప్రదించవచ్చు. వివరాలు రహస్యంగా ఉంచుతాం అని ఐజీ గోపినాథ్ జట్టి తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆనందపురం పోలీస్ స్టేషన్ లో వాహనాలు బహిరంగ వేలం

**ఆనందపురం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా యజమానులు ఎవరూ క్లెయిమ్ చేయకుండా నిల్వలో ఉన్న వాహనాలను కోర్టు ఆదేశాల మేరకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. సీఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేలానికి మండల తహశీల్దార్ శ్రీనుబాబు, ఆనందపురం మరియు వేములవలస వీఆర్వోలు అప్పారావు, పుష్పలతల సమక్షంలో నిర్వహించారు. భీమిలి జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు అనుమతి అనంతరం మొత్తం ఎనిమిది ద్విచక్ర వాహనాలను పబ్లిక్ ఆక్షన్‌కు పెట్టారు. ముందస్తుగా పత్రికా ప్రకటన విడుదల చేయడంతో స్థానిక స్క్రాప్ వ్యాపారులు, స్పేర్ పార్ట్స్ డీలర్లు, సైకిల్ వ్యాపారులు, మెకానిక్లు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరై పోటీపడ్డారు.వేలంలో అత్యధిక ధర కోట్ చేసిన వారికి వాహనాలను అప్పగించి, నిర్ణయించిన మొత్తాన్ని చెల్లింపులు చేయించారు. కోర్టు ఆదేశాలు, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా మొత్తం ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హరీష్, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, రైటర్ ప్రసాద్, కేశవ తదితరులు పాల్గొన్నారు.



# విశాఖలో హైరైజ్‌ల కొత్త దశ



**విశాఖపట్నం, ఫిబ్రవరి 24, మేజర్‌న్యూస్:** విశాఖపట్నం నగరం వేగంగా మారుతోంది. ఐటీ, పరిశ్రమలు, విద్యా--ఆరోగ్య రంగాల విస్తరణతో జనాభా ఒత్తిడి పెరుగుతోంది. ఇదే సమయంలో నగర పరిధిలో భూమి ధరలు భారీగా పెరగడం, పెద్ద స్థలాల లభ్యత తగ్గిపోవడం రియల్ ఎస్టేట్ రంగాన్ని కొత్త దిశగా నడిపిస్తోంది. ఒకప్పుడు విస్తార స్థలాల్లో తక్కువ అంతస్తుల అపార్ట్‌మెంట్లు కనిపించగా, ఇప్పుడు ఆకాశాన్ని తాకే హైరైజ్ టవర్లు నగర ఆకృతిని మార్చేస్తున్నాయి.

### - భూమి ఖర్చు - ప్రాజెక్టుల ఆర్థిక సమీకరణ

ప్రధాన ప్రాంతాల్లో భూమి ధరలు గణనీయంగా పెరగడంతో లోరైజ్ ప్రాజెక్టులు ఆర్థికంగా కష్టసాధ్యమవుతున్నాయి. పరిమిత స్థలంలో ఎక్కువ గృహ యూనిట్లు నిర్మించడం ద్వారా భూమి వ్యయాన్ని విభజించడం హైరైజ్‌ల ద్వారా సాధ్యమవుతోంది. దీంతో డెవలపర్లు నిలువు నిర్మాణాలపై దృష్టి కేంద్రీకరిస్తున్నారు. క్రెడాయి విశాఖపట్నం చాప్టర్ అధ్యక్షులు ఇ అశోక్ కుమార్ అభిప్రాయం ప్రకారం, "నిలువు నిర్మాణం భూమి వినియోగాన్ని సమర్థవంతం చేయడమే కాకుండా ప్రాజెక్టుల సాధ్యసాధ్యతను పెంచుతుందని పట్టణ సాంద్రత పెరిగే కొద్దీ హైరైజ్‌లే దీర్ఘకాలిక పరిష్కారం" అని పేర్కొంటున్నారు.

### - కొనుగోలుదారుల అభిరుచుల్లో మార్పు

మారుతున్న జీవనశైలికి అనుగుణంగా గృహ కొనుగోలుదారుల అభిరుచుల్లో కూడా మార్పు వచ్చింది. భద్రతా వ్యవస్థలు, ప్రత్యేక పార్కింగ్, క్లబ్‌హౌస్‌లు, జిమ్, స్విమ్మింగ్‌పూల్, పిల్లల ఆట స్థలాలు వంటి భాగస్వామ్య సౌకర్యాలపై ఇప్పుడు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ సౌకర్యాలను సమగ్రంగా అందించడానికి హైరైజ్ ప్రాజెక్టులు అనుకూలంగా ఉంటున్నాయి.

### - వృద్ధి కారిడార్లలో నిర్మాణాల ఊపు

మధురవాడ--కాపులుప్పాడ, ఆనందపురం--కొమ్మాది, యెండాడ--రుషికొండ తీర ప్రాంతం, భోగాపురం వైపు విస్తరిస్తున్న ప్రాంతాల్లో కొత్త హైరైజ్ ప్రాజెక్టులు వేగంగా ప్రారంభమవుతున్నాయి. రహదారి విస్తరణలు, మెరుగైన కనెక్టివిటీ, సమీపంలో అభివృద్ధి చెందుతున్న ఐటీ--వ్యాపార కేంద్రాలు ఈ ప్రాంతాలకు ఆకర్షణగా మారాయి.

### - ఐటీ రంగం ప్రభావం

ఐటీ రంగం, స్టార్టప్ సంస్థలు, అనుబంధ సేవా రంగాల వృద్ధి గృహ డిమాండ్‌ను నిలబెడుతోంది. యువ ఉద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు ఆధునిక సౌకర్యాలతో కూడిన అపార్ట్‌మెంట్లను కోరుకుంటున్నారు. దీని వల్ల హైరైజ్‌లకు స్థిరమైన మార్కెట్ లభిస్తోంది.

### - సవాళ్లు కూడా ఉన్నాయి

అయితే నిలువు విస్తరణకు తగిన మౌలిక సదుపాయాల మద్దతు అత్యవసరం. నీటి సరఫరా, మురుగు నిర్వహణ, విద్యుత్, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో సమగ్ర ప్రణాళిక అవసరం. నియంత్రణ స్పష్టత, త్వరిత అనుమతులు, అగ్ని భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు కావాలి.

### - భవిష్యత్ దిశ

భూమి పరిమితులు, పెరుగుతున్న జనాభా, మారుతున్న మార్కెట్ అవసరాల దృష్ట్యా విశాఖపట్నం భవిష్యత్తు నిలువు వృద్ధిలోనే ఉందని రియల్ ఎస్టేట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రణాళికాబద్ధంగా, మౌలిక సదుపాయాలకు అనుగుణంగా అభివృద్ధి జరిగితే హైరైజ్‌లు నగరాన్ని ఆధునిక మహానగరంగా తీర్చిదిద్దగలవని నిపుణులు భావిస్తున్నారు. విశాఖలో రాబోయే రోజుల్లో ఆకాశహర్మ్యాల సంఖ్య పెరగడం ఖాయమనే సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# పాల సేకరణ నిల్వ కేంద్రాలపై విస్తృత తనిఖీలు..

**- విశాఖలో పలు ప్రాంతాలలో ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు - పాలలో కల్తీ ఉందని తెలిస్తే సెక్షన్ 51కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరిక - రాజమండ్రి ఘటనతో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ ?కేజీహెచ్ లో చికిత్స పొందుతున్న మరో బాలుడు మృతి - 6కు చేరిన కల్తీపాల మృతుల సంఖ్య..! - ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల హెచ్చరిక - కల్తీ పాల విక్రయాలపై సమాచారం ఉంటే ఫిర్యాదు చేయాలని సూచన - జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న తనిఖీలు**







**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

రాజమండ్రిలో కల్తీ పాల ఘటనల నేపథ్యంలో విశాఖలో ఫుడ్ సేఫ్టీ అధికారులు కల్తీని అరికట్టేందుకు, నిల్వ కేంద్రాల్లో నాణ్యతను తనిఖీ చేస్తూ 40కి పైగా ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. వివిధ పాల సేకరణ కేంద్రాలు, మధ్యవర్తులు సరఫరా చేసే పాలు, నిల్వ కేంద్రాలపై ఏకధాటిగా దాడులు చేస్తున్నారు. రాజమండ్రిలో కల్తీ పాలు సేవించి పలువురు మృతి చెందిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది, దీనితో విశాఖలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నగరంలో 85 శాతం మంది ప్యాకెట్ పాలు వాడుతున్నప్పటికీ, ఇంటింటికి సరఫరా చేసే పాలు, మధ్యవర్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. కమిషనర్ ఫుడ్ సేఫ్టీ ఆదేశాల మేరకు ఈ దాడులు కొనసాగుతున్నాయి. రిటైల్ లూజ్ పాలు ఎక్కడ అమ్ముతున్నారో ఆ కేంద్రాలపై దాడి చేస్తున్నారు. అక్కయ్యపాలెం , ఆశీలమెట్ట , సీతమ్మధార , మద్దిలపాలెం , శివాజీ పాలెం , ఎంవిపి కాలనీ ఇలా పలు కేంద్రాల్లో తనిఖీ నిర్వహించారు. విశాలాక్షి నగర్ మధురవాడ ఆరిలోవ , గాజువాక , కూర్మన్నపాలెం , పెందుర్తి రూరల్ ప్రాంతాల్లో కూడా తనిఖీలు కొనసాగుతున్నాయి. కెమికల్స్ ఏమైనా కలిపి పాలు అమ్ముతున్నారా లేదా అని పరిశీలిస్తున్నారు. క్వాలిటీగా పాలు అమ్మకాలు చేస్తున్నారా? లేదా? అని తనిఖీ చేస్తున్నారు. డైరీ ఫారంలో నుండి రిటైల్ షాప్ కి పాలు వస్తున్నాయని వ్యాపారులు తెలియజేస్తున్నారు. బ్యాచ్ నెంబర్ , మ్యానుఫ్యాక్చర్ డేట్ , ఎక్స్పైర్ డేట్ అన్ని ఉండేవిధంగా చూస్తున్నామని అధికారులు తెలియజేస్తున్నారు. బ్రాండ్ లోగో ఉండే విధంగా చూసుకోవాలని, ఏదైనా సమస్య వస్తే కస్టమర్ కేర్ నెంబర్ ఉండాలని అంటున్నారు. పాలు ప్యాకెట్లో పోషక విలువలు ఎంతెంత ఉండాలని అందులో వివరాలు తెలియజేయాలని తెలిపారు. హానికరమైన కెమికల్స్ ఉపయోగిస్తున్నారని పరిశీలిస్తున్నమని పేర్కొన్నారు. పాలలో కల్తీ ఉందని తెలిస్తే సెక్షన్ 51 కింద కేసు నమోదు చేస్తామని,రూ. 5 లక్షల వరకు జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. విశాఖలోని మద్దిలపాలెం రబ్బాని మిల్క్ లో లూజ్ పాల అమ్మకాలలో పాలలో నీళ్లు కలిపినట్టు గుర్తించినట్లు తెలుస్తుంది. మిగతా పరిశీలన కొరకు శాంపుల్స్ కలెక్ట్ చేసి ఫుడ్ సేఫ్టీ ఆఫీస్ కు తరలించినట్లు సమాచారం. మిగతా ప్రాంతాల్లో కూడా కొన్ని శాంపిల్స్ కలెక్ట్ చేశామని తెలిపారు. పూర్తిస్థాయి పరిశీలన జరిపి వారికి పైన కేసులు నమోదు చేస్తామని పేర్కొంటున్నారు.

## - విశాఖ కేజిహెచ్ లో మరొక బాలుడు మృతి..

రాజమండ్రిలో కల్తీపాల కల్లోలం కొనసాగుతోంది. బుధవారం ఉదయానికి అందిన సమాచారం ప్రకారం ఆరుగురు చనిపోయారు. తాజాగా రాజమహేంద్రవరానికి చెందిన ఓ బాలుడు మనోహర్ విశాఖ కేజీహెచ్ ఆస్పత్రిలో మంగళవారం రాత్రి మరణించాడు.మనోహర్‌కు మూత్రంలో ఇబ్బందులు, కిడ్నీ సంబంధిత సమస్య తలెత్తడంతో కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి వైద్యులు కాకినాడ ఆస్పత్రికి రిఫర్ చేశారు.అక్కడి నుంచి ఈ నెల 18న కేజీహెచ్‌కు తీసుకువచ్చారు. ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి బాలుడికి యూరిన్ రాకపోవడం, కిడ్నీ సమస్య తీవ్రం కావడంతో డయాలసిస్ చేస్తూ వచ్చారు. మంగళవారం ఉదయం నుంచి పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారడంతో వెంటిలేటర్ అమర్చారు.రాత్రి 8 గంటల సమయంలో మనోహర్ మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు.రాజమండ్రి ఆస్పత్రుల్లో ఇంతకుముందే ఐదుగురు చనిపోయారు. మనోహర్ మృతితో ఆ సంఖ్య ఆరుకి చేరింది. ఇంతటి కల్లోలానికి కారణమని భావిస్తున్న అడ్డాల గణేష్ ను పోలీసులు అరెస్ట్ చేశారు.

## - ప్రాణాలు తీస్తున్న కల్తీ పాలు..

మన రోజువారీ జీవితంలో పాలు కీలక భాగం. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ పాలు అవసరం. ఉదయం కాఫీ, టీ, పిల్లల ఆహారం అన్నీ పాలపై ఆధారపడే పరిస్థితి. అలాంటి ఆహారాన్ని లాభం కోసం విషంగా మార్చడం అమానుష చర్యగా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేస్తుందని నమ్మిన పాలు ప్రాణాపాయానికి దారితీస్తే అది మరింత భయానక పరిస్థితి. నిపుణుల ప్రకారం పాలను చిక్కగా కనిపించేలా చేయడానికి లేదా ఎక్కువకాలం నిల్వ ఉంచేందుకు కొన్ని ప్రమాదకర రసాయనాలు కలుపుతున్నట్లు అనుమానిస్తున్నారు. యూరియా , డిటర్జెంట్లు , లిక్విడ్ సోప్ వంటి పదార్థాలు కలిపితే పాలు నురగతో కనిపిస్తాయి. ఇవి శరీరంలోకి వెళ్లినప్పుడు ముఖ్యంగా కిడ్నీలపై తీవ్రమైన ప్రభావం చూపుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. రాజమహేంద్రవరం ఘటనలో బాధితులకు ముందుగా అస్వస్థత, మూత్ర సమస్యలు తలెత్తి, తర్వాత పరిస్థితి విషమించిందని అధికారులు చెబుతున్నారు కొంతమంది వ్యాపారులు పాలు చెడిపోకుండా ఉండేందుకు ఫార్మాలిన్ వంటి రసాయనాలు కలుపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది సాధారణంగా శవాలను కుళ్లిపోకుండా ఉంచేందుకు ఉపయోగించే పదార్థం. శరీరంలోకి వెళ్లితే క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. అదేవిధంగా సింథటిక్ మిల్క్ తయారు చేసి విక్రయిస్తున్న ఘటనలు గతంలో కూడా వెలుగుచూశాయి. యూరియా, కాస్టిక్ సోడా , రిఫైన్డ్ ఆయిల్ వంటి పదార్థాలతో తయారయ్యే ఈ పాలు గుండె, రక్తపోటు సమస్యలకు కారణమవుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి కల్తీని కొన్ని సరళమైన పద్ధతులతో ఇంట్లోనే గుర్తించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. గచ్చుపై ఒక చుక్క పాలను వేసినప్పుడు అది నెమ్మదిగా కదులుతూ వెనుక తెల్లటి గీత కనిపిస్తే పాలు స్వచ్ఛమైనవని అర్థం. వేగంగా జారిపోతే అనుమానం కలగాలి. గ్లాసులో పాలు, నీరు కలిపి బాగా కదిపితే ఎక్కువసేపు నురుగు ఉంటే డిటర్జెంట్ కలిసిన అవకాశముంది. యూరియా అనుమానం ఉంటే పాల్లో కొద్దిగా పప్పు పొడి వేసి పరీక్షించవచ్చని చెబుతున్నారు.అలాగే సింథటిక్ పాలు చేతిలో రుద్దితే జిగటగా అనిపిస్తాయి. ఈ ఘటన నేపథ్యంలో పాల నాణ్యతపై కఠిన తనిఖీలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. ఆరోగ్యం కంటే లాభం ముఖ్యం కాదని గుర్తించి ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడుతున్నారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి, అనుమానం వచ్చినప్పుడు వెంటనే సమాచారం ఇవ్వడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను తగ్గించవచ్చని అధికారులు తెలియజేస్తున్నారు.

# డయేరియా బాధితులు ధైర్యంగా ఉండండి

**- మరింత మెరుగైన వైద్యం అందించండి**

**- బాధితుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** డయేరియా బాధితులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెమ్స్ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న డయేరియా బాధితులను బుధవారం ఆయన సందర్శించారు. వీరిని కలెక్టర్ స్వయంగా వెళ్లి వారికి అందిస్తున్న వైద్యం గూర్చి వైద్యులతో చర్చించారు. పేషెంట్స్ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా కల్పించారు. అన్ని హాస్పిటల్స్ ల్లో చికిత్స తీసుకుంటున్న వారిలో బుధవారం 13 మందిని డిస్చార్జ్ చేశారు. కలెక్టర్ తో పాటు జెమ్స్ వైద్యులు డాక్టర్ హేమంత్, ఆర్ఎంఓ ప్రవీణ్, తదితర వైద్యులు పాల్గొన్నారు.

# నూకాలమ్మ తల్లి ఉత్సవాలకు విచ్చేయండి

**- విశాఖ ఎంపీని ఆహ్వానించిన ఉత్సవకమిటీ**



**భీమిలి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** భీమిలి పట్టణ ప్రజల ఆరాధ్యదైవం, గ్రామదేవత శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ తల్లి ఉత్సవాలు మార్చి నెలలో ఘనంగా జరుపుతున్నామని తమరు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులు విశాఖ పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి భరత్ ని ఆహ్వానించారు.విశాఖ ఎమ్ వి పి లో ఉన్న కార్యాలయంలో బుధవారం ఎంపీ భరత్ ని ఉత్సవ కమిటీ సభ్యులు గంటా నూకరాజు, మారోజు సత్యప్రసాద్(గొల్లబాబు), శిల్లా కరుణాకర్ రెడ్డి, గాడు యశ్వంత్, ఉసిరికల బంగార్రాజు (తాతాజీ) లు కలిసి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు సంబందించిన పోస్టర్ ను ఎంపీ చేతులమీదుగా విడుదల చేసి ఉత్సవాల గురించి వివరించారు. మార్చి 17 నుండి 20 వ తారీకు వరకు అంగరంగ వైభోగంగా ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. నేలవేషాలతో భారీ స్థాయిలో ఊరేగింపు, స్టేజ్ కార్యక్రమాలు, భాణాసంచా ఉంటాయని అన్నారు. నాలుగురోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో రోజుకు కొన్ని వేలమంది భక్తులు కుటుంబంతో వచ్చి పాల్గొంటారని అన్నారు. ఉగాది పర్వదినం కూడా ఈ ఉత్సవాల్లో భాగం కావడం వలన అమ్మవారి దర్శనం కోసం భారీ సంఖ్యలో భక్తులు వస్తారని అన్నారు. దీనికి కావలసిన అన్నీ ఏర్పాట్లు దేవాదాయ శాఖ పోలీస్ శాఖతో మమేకమై చేస్తున్నప్పటికి అన్ని శాఖల అధికారుల సహాయ సహాకారాలు చాలా అవసరమని తమరు ఆయొక్క శాఖలకు ఆదేశాలు జారీ చేసి ఎటువంటి అంతరాయం లేకుండా చేయాలని ఉత్సవ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేసారు.ఈ కార్యక్రమంలో శ్రీ నూకాలమ్మ తల్లి భక్తులు మారోజు సంజీవ్ కుమార్, రాకోతు నర్సింగరావు, ఎచ్చెర్ల హరి, కంచెర్ల కామేష్, రాంబుక్త ప్రభాకర్ నాయుడు, చిన్నిరాజు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రధాని నక్కపల్లి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**– హెలిపాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్**



**అనకాపల్లి ప్రతినిధి/నక్కపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మార్చి నెలలో భారత ప్రధానమంత్రి జిల్లాలో పర్యటన సందర్భంగా నక్కపల్లి మండలం కాగిత విలేజీ వద్ద హెలిపాడ్ స్థలాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పరిశీలించారు. హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రాంతం, భద్రతా ఏర్పాట్లు, రహదారి సౌకర్యాలు, తాత్కాలిక మౌలిక వసతుల సిద్ధతపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ హెలిపాడ్ పరిసర ప్రాంతాల్లో భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, పోలీసు శాఖతో సమన్వయం బలోపేతం చేయాలని ఆదేశించారు. వీఐపీ రూట్‌లో రహదారుల మరమ్మతులు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు సమగ్రంగా ఏర్పాటు చేయాలని సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, శానిటేషన్, వైద్య శిబిరం వంటి ప్రాథమిక సదుపాయాలు ఎటువంటి అంతరాయం లేకుండా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అలాగే ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాలు నిర్వహించి ప్రతి అంశాన్ని ముందుగానే సమీక్షించుకోవాలని పేర్కొన్నారు. పర్యటన విజయవంతం కావడానికి ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, అడ్డురోడ్డు ఆర్డీవో వి.వి. రమణతో పాటు పోలీసు, రెవెన్యూ, ఆర్ ఎండ్ బి, విద్యుత్, గ్రామపంచాయతీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వడ్డాది వెంకటేశ్వర స్వామి 153వ వార్షిక కల్యాణ మహోత్సవాలు కు భారీ ఏర్పాట్లు



**బుచ్చయ్యపేట, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మండలంలో వడ్డాది వెంకటేశ్వర స్వామి 153వ వార్షిక కల్యాణ మహోత్సవాలు వడ్డాది నాలుగు రోడ్ల కూడలి లో ఈ నెల 27, 28, మార్చి 1, 2 తేదీలలో నాలుగు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సంబంధిత పోస్టర్లను బుధవారం గ్రామ పెద్దలు ఆవిష్కరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా సీసీ కెమెరాలతో పాటు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా ప్రజల సహకరించాలన్నారు. యువకులు అనవసరంగా గొడవలకు దిగి పోలీసు కేసుల్లో ఇరుక్కోవద్దన్నారు. మూడవ తేదీ చంద్రగ్రహణం సందర్భంగా నాగవల్లి రోజున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఉపసర్పంచ్ దాడి సూర్య నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ దొండా నారాయణమూర్తి, పి.ఎ.సి.ఎస్ అధ్యక్షుడు దొండా నరేశ్, టిడిపి నేత దొండా గిరిబాబు, స్టేట్ గ్రంథాలయ పరిషత్ మెంబర్ సిరిగిరిశెట్టి శ్రీరామ మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

## ఉపమాక వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న

**: జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా – ఉత్సవాల భద్రతపై క్షేత్రస్థాయి సమీక్ష**



**నక్కపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** నక్కపల్లి మండలం లోఉపమాక గ్రామంలో ఫిబ్రవరి 26 నుండి మార్చి 4వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరగనున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ ఏర్పాట్లను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా పరిశీలించారు. బుధవారం ఎస్పీ తుహిన్ సిన్హా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నతాధికారులతో కలిసి బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఫిబ్రవరి 27న జరిగే కళ్యాణ మహోత్సవానికి సుమారు 1.6 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున, క్యూ లైన్ల నిర్వహణలో ఎటువంటి లోటుపాట్లు ఉండకూడదని ఆదేశించారు. మహిళా భక్తుల కోసం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. మార్చి 3న రాజయ్యపేట సముద్ర తీరంలో జరిగే చక్రస్నానం సమయం లో భక్తుల రక్షణ కోసం గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, ప్రమాదాలు జరగకుండా ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల సమయంలో ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగించేలా అశ్లీల నృత్య ప్రదర్శనలకు తావులేకుండా చూడాలని, కేవలం సాంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలకే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ ఎం.దేవ ప్రసాద్, ఎస్.బి. డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, ఎస్.బి ఇన్స్పెక్టర్ బాల సూర్యరావు, నక్కపల్లి ఇన్స్పెక్టర్ మురళి, ఎస్సై సన్నీ బాబు మరియు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి నారా లోకేష్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

**: విశాఖ రేంజ్ ఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి ఐపీఎస్**



**అచ్చుతాపురం రాంబిల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** రాంబిల్లి మండలం, లాలంకోడూరు పంచాయతీ పరిధిలోని సీతపాలెం వద్ద బ్లూ జెట్ ఫార్మా కంపెనీ ఈనెల 28వ తేదీన ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న గౌరవ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ నారా లోకేష్ గారి పర్యటన నిమిత్తం భద్రతా ఏర్పాట్లను పోలీసు యంత్రాంగం ముమ్మరం చేసింది. బుధవారం నాడు విశాఖపట్నం రేంజ్ ఐజీ శ్రీ గోపీనాథ్ జట్టి ఐపీఎస్ గారు, జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ గారితో కలిసి పర్యటన ప్రాంతాన్ని సందర్శించి, భద్రతా బందోబస్తుపై స్థానిక పోలీసు అధికారులతో క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. మంత్రి గారి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యున్నత స్థాయి భద్రతను ఏర్పాటు చేయాలని ఐజీ గారు ఆదేశించారు. రూట్ మ్యాప్ పరిశీలన: సభా ప్రాంగణం, హెలిప్యాడ్ మరియు కంపెనీ పరిసర ప్రాంతాలను పరిశీలించి, ట్రాఫిక్ మళ్లింపు మరియు బందోబస్తు పాయింట్లపై దిశానిర్దేశం చేశారు. వివిఐపి పర్యటన దృష్ట్యా వివిధ విభాగాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీ ఎం.దేవ ప్రసాద్, ఎస్.బి డీఎస్పీ శ్రీ జి.ఆర్.ఆర్. మోహన్, పరవాడ డీఎస్పీ శ్రీ వి.విష్ణు స్వరూప్, నర్సీపట్నం డీఎస్పీ శ్రీ పి. శ్రీనివాసరావు, రాంబిల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింగరావు, అచ్యుతాపురం ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, పరవాడ ఇన్స్పెక్టర్ మల్లికార్జునరావు మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. మంత్రి గారి పర్యటనను విజయవంతం చేసేలా పౌర ఇబ్బందులు లేకుండా భద్రతను పర్యవేక్షిస్తున్నట్లు ఐజీ గారు ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఘనంగా అవతార్ మెహర్ బాబా 132వ జయంతి వేడుకలు

**– ఆధ్యాత్మికతోనే లోక శాంతి సాధ్యం – అవతార్ మెహర్ బాబా మార్గంతో లోకశాంతి – మాజీ ఎంపీపీ గంగుపాం జలజ**



**అనకాపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మికత, ప్రేమ, సేవలతో లోకశాంతిని పొందవచ్చని భగవాన్ అవతార్ మెహర్ బాబా సూచించారని అనకాపల్లి కేంద్రం నిర్వాహకులు, మాజీ ఎంపీపీ గంగుపాం జలజ అన్నారు. అనకాపల్లి కొత్తూరు జంక్షనులో ఉన్న భగవాన్ అవతార్ మెహర్ బాబా భవనంలో బుధవారం ఆయన 132వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ప్రేమతత్వం అలవర్చుకోవాలన్నారు. పగలు, ద్వేషాలు, ప్రతీకారాలతో ఇతరుల కంటే మనమే ముందుగా అనారోగ్యం పాలవుతాన్నామన్నారు. చిత్తశుద్ధితో చేసిన ప్రతీ కార్యక్రమానికు అందరి సహకారం లభిస్తుందన్నారు. తుమ్మపాల కేంద్రం నిర్వాహకులు దంతులూరి మెహర్ బేబీ మాట్లాడుతూ బాబా చూపిన మార్గంతో శాంతి, సౌభాగ్యాలు, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఎవరూ ఎప్పుడూ ఎవరికీ కీడు చేయవద్దని బాబా చెప్పిన మాటలను ఆచరిద్దామన్నారు. కొత్తూరు, తుమ్మపాల, అనకాపల్లి కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమం జరిగింది.




జిరాయితి భూములు ఉన్న వారికే

# పిఎం కిసాన్ నిధులు

## డేటాపై వ్యవసాయ సహాయకులతో చర్చిస్తున్న ఏవో నీలిమ



**పూసపాటిరేగ, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఇప్పటివరకు ప్రభుత్వ భూములు ద్వారా పిఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లోకి జమ అయ్యేది. ఇకనుంచి పీఎం కిసాన్ నిధులు జరాయితీ భూములు ఉన్న రైతులకే వారి ఖాతాల్లోకి జమ కానున్నాయి. ఇప్పటివరకు మండలంలో 1731 మంది రైతులకు జిరాయితీ భూములతో పాటు ప్రభుత్వ భూముల కూడా పీఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాల్లోకి జమ కాగా, తాజాగా కిరాయితి భూములు ఉన్నవారికి సీఎం కేసీఆర్ నిధులు రానున్నాయని వ్యవసాయ శాఖకు ఆదేశాలు రావడంతో మండల వ్యవసాయ అధికారి నీలిమ వ్యవసాయ సహాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి విధివిధానాలను కార్యాలయంలో బుధవారం చర్చించారు. పీఎం కిసాన్ నిధులు అందుకుంటున్న రైతులు చనిపోయిన, అదేవిధంగా ప్రభుత్వ భూములు ద్వారా పీఎం కిసాన్ రైతులు ఎంతమంది అందుకుంటున్నారు అన్నదానపై వ్యవసాయ శాఖ అధికారి సిబ్బంది కసరత్తును నిర్వహిస్తోంది. రైతుల అర్హుల వివరాలను వెబ్ సైట్‌లో డేటాను నిక్షిప్తం చేసే కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారి సిబ్బంది వేగవంతం చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు.

# డీలర్లు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలి

## సిఎస్.డి.టి. స్వర్ణ లత డీలర్లకు హెచ్చరిక



**తెర్లాం ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** నిత్యావసర సరుకుల పంపిణీ సక్రమంగా నిర్వహించాలి అని సి.ఎస్.డి.టి. స్వర్ణ లత డీలర్లను హెచ్చరించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చౌకధరల దుకాణాల డీలర్లుతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతీ నెల 20 డిపోల ను తనిఖీలను చేస్తానని రికార్డులు సరిగ్గా ఉండాలన్నారు. సరుకుల వివరాలు వ్యత్యాసాలు ఉంటే కేసులు తప్పవు అని హెచ్చరించారు. షాపులో మీ యొక్క ఆర్థరైజేషన్ వ్రేలాడ తీసి ఉంచాలన్నారు. స్టాక్ బోర్డు లో సరకుల వివరాలు పొందుపరచి ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక వ్రాసి బోర్డ్ షాప్ లో విధిగా ఉండాలన్నారు. మీ గ్రామంనుంచి ఎలాంటి ఫిర్యాదులు వస్తే క్షమించేది లేదన్నారు. గౌడౌన్ నుంచి సరుకులు తీసుకు వెళ్లేందుకు తూకం సరిచూసుకుని తీసుకు వెళ్లాలని సూచించారు. సంభందిత అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు రికార్డులు చూపించి సంతకాలు చేయించుకోవాలని ఆమె వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమెతో పాటు డీలర్ల ప్రెసిడెంట్ తెంటు సూర్య నారాయణ వైస్ ప్రెసిడెంట్ బి.శేఖర్, కోశాధికారి చౌకడిపో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# పటిష్టమైన బందోబస్తు మధ్య ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు



**చీపురుపల్లి ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లు పటిష్టమైన భద్రత మధ్య ఉండాలని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈనెల 28న చీపురుపల్లి మండలం రావివలస పంచాయతీ పరిధిలోని పైలపేట గ్రామంలో పర్యటించనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డితో పాటు జిల్లా ఉన్నతాధికారులతో రాష్ట్ర హోం శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వంగలపూడి అనిత బుధవారం చీపురుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ప్రత్యేకించి హెలిప్యాడ్ ఏర్పాట్లు, రహదారి పనులపై ఆమె కలెక్టర్‌ని అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సభకు ఎంతమంది హాజరవు తున్నట్లు అడిగి తెలుసుకున్నారు. స్థానిక నాయకులు చెప్పిన సమాచారం మేరకు సుమారు 3500 మంది సభ ప్రాంగణానికి చేరుకుంటారని కలెక్టర్ ఆమెకి వివరించారు. గురువారం నాటికి హెలిప్యాడ్ పనులు పూర్తి కావడంతో పాటు చీపురుపల్లి ప్రధాన రహదారి నుండి రావివలస జంక్షన్ కలుపుతూ నూతన రహదారి నిర్మాణం చేపట్టామని గురువారం సాయంత్రానికి ఆ పని కూడా పూర్తవుతుందని కలెక్టర్ ఆమెకు వివరించారు. సభా ప్రాంగణానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొంటున్న అధికారులకు, ప్రజా ప్రతినిధులకు భోజన ఏర్పాట్లపై కూడా సమీక్ష జరిపారు. ముఖ్యమంత్రి సభ ప్రాంగణానికి చేరుకొని తిరిగి వెళ్లేంతవరకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి రామమల్లిక్ నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# 129 మంది స్వర్ణ గ్రామ సచివాలయాల కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

## - యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో అత్యల్ప శాతం సర్వే - రాష్ట్రస్థాయిలో విజయనగరం జిల్లా వెనుకబడటానికి వీరే కారణం




**విజయనగరం, మేజర్ న్యూస్ :** జిల్లాలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే (యుఎఫ్ ఎస్) లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన 129 మంది స్వర్ణ గ్రామ సచివాలయాల కార్యదర్శులకు జిల్లా స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు అధికారి ఎం రోజారాణి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. ఇందులో 75 మంది సర్వేయర్లు, సర్వే సహాయకులు, 32 మంది వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు, 22 మంది ఎంఎస్ఎస్, మహిళా ఆరోగ్య సెక్రటరీలు ఉన్నారు. ఈనెల 24వ తేదీన పరిశీలించిన నివేదిక ప్రకారం జిల్లా స్థాయిలో వీరు అశ్రద్ధ వహించినట్లు నిర్ధారించారు. ఈ మేరకు సచివాలయాల వారీగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో అత్యల్పంగా ఉన్న సచివాలయాల సంబంధిత స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఫంక్షనర్ అసిస్టెంట్స్ విధి నిర్వహణలో లోపం ఉన్నందున సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీసులను జారీ చేశారు. రాతపూర్వక వివరణతో కూడిన సంజాయిషీని ఈనెల 27వతేదీ సాయంత్రం అయిదు గంటలలోగా జిల్లా కలెక్టర్ కార్యాలయం పేషీకి ప్రత్యక్షంగా హాజరై సమర్పించాలని ఆదేశించారు. సచివాలయ ఫంక్షనర్ అసిస్టెంట్స్ వారికి కేటాయించిన హౌస్ హోల్డ్‌లో అత్యల్ప శాతం సర్వే చేయడం వల్ల రాష్ట్ర స్థాయిలో విజయనగరం జిల్లా వెనుకబడటానికి 129 మంది సెక్రటరీలే కారణమని షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో అత్యల్ప శాతం సర్వే చేసిన స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు ఫంక్షనర్ అసిస్టెంట్స్ వారి విధి నిర్వహణలో లోపం ఉన్నందున విధుల నిర్లక్ష్యంగా పరిగణిస్తూ మరోసారి తప్పు పునరావృతమైతే ఛార్జ్ మెమో ఇచ్చి, దాన్ని సంబంధిత ఉద్యోగి ఎస్ ఆర్ లో కూడా నమోదు చేసేందుకు జిల్లా కలెక్టర్ ద్వారా సిఫార్సు చేస్తామని షోకాజ్ నోటీసులో హెచ్చరించారు.

# రూ.3.5 లక్షలు పెరిగిన శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి ఆదాయం



**చీపురుపల్లి ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి చీపురుపల్లి గ్రామ దేవత శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి జాతర ఆదాయం గత ఏడాది కంటే రూ.3.5 లక్షలు అదనంగా వచ్చింది. జాతర సందర్భంగా పూజా, దర్శన టిక్కెట్లు, హుండీలు, కానుకలు, విరాళాలు ద్వారా అమ్మవారికి ఈ ఏడాది జాతర ఆదాయం రూ.28,09,996 వచ్చినట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ నానాజీ బాబు తెలిపారు. అమ్మవారి దర్శనం కోసం రూ.10, 20, 50, 100 టిక్కెట్లు క్యూ లైన్లు ఏర్పాటు చేయగా వాటి ద్వారా రూ.11,00,210 వచ్చిందని, హుండీ ఆదాయం రూ.15,48,388 వచ్చినట్టు తెలిపారు. రూ.1,60,878 విరాళాలు రూపంలో భక్తులు అమ్మవారికి అందజేశారని చెప్పారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అమ్మవారి ఆదాయం రూ.3,43,718 మేరకు పెరిగిందని ఈవో నానాజీబాబు స్పష్టం చేశారు.

# పల్లిగండ్రేడులో వైభవంగా ఎల్లమ్మ జాతర





**గుర్ల,ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** మండలంలో పల్లి గండ్రేడు గ్రామం లోబుధవారం ఎల్లమ్మ తల్లి జాతర వైభోపేతంగా జరిగింది.సాయంత్రం నాలుగు గంటల నుండి ఏడు గంటల వరకు జాతర జరుగుతుంది. అక్కడికి వచ్చిన భక్తులు ఎల్లమ్మ తల్లిని పసుపు, కుంకుమలతో పూజించి మొక్కుల తీర్చుకుంటారు. అమ్మవారి సినిమాను తిరువీధులో తిరుగుతూ జాతర దగ్గరకు చేరుకుంటుంది. ప్రతీ ఏడాది జరుగుతున్న ఈ జాతరకు చుట్టుపక్కల ప్రాంతాలతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనీ తిలకించారు.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. జాతరలో తొక్కిసలాట జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఎల్లమ్మ తల్లిని ఈ ప్రాంత ప్రజలు పూజిస్తున్నారు. ప్రతీ సంవత్సరం జరుగుతున్న ఎల్లమ్మ జాతరకు పూజించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.ఈ జాతరలో ఎస్ఐ నారాయణరావు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టారు,కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పూజారి తదితరులు అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.

# జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు కలకలం

- ఆర్డీఎక్స్‌తో పేల్చేస్తామంటూ ఈ-మెయిల్...
- రెండోసారి హెచ్చరికతో భయాందోళనలో కోర్టు సిబ్బంది..!
- క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని సీపీ ఆదేశం

**(క్రైం బ్యూరో : మేజర్ న్యూస్)**

విశాఖ జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు ఈ--మెయిల్ రావడంతో మంగళవారం ఉదయం కలకలం రేపింది. కోర్టు ప్రాంగణంలో ఆర్డీఎక్స్ బాంబు పెట్టి పేల్చేస్తామని తెలియజేస్తూ గుర్తు తెలియని వ్యక్తులు పంపిన మెయిల్ అధికారులను అప్రమత్తం చేసింది!! సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి కోర్టు పరిసరాలను కట్టుదిట్టంగా ముట్టడి చేసి విస్తృత తనిఖీలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ నిర్వీర్య సిబ్బంది కోర్టు హాళు,, రికార్డు గదులు, వాహన నిలుపుదొడ్లు, ప్రవేశ ద్వారాలు తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, కేసుల కోసం వచ్చిన పక్షాలు తాత్కాలికంగా బయటకు తరలించబడ్డారు. గంటల పాటు కొనసాగిన తనిఖీల్లో ఎటువంటి అనుమానాస్పద వస్తువు లభించకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. రెండు నెలల్లో రెండోసారి ఇదే తరహా బెదిరింపు రెండు నెలల క్రితం కూడా రావడం గమనార్హం. అప్పటికీ విస్తృతంగా తనిఖీలు నిర్వహించినప్పటికీ ఎటువంటి పేలుడు పదార్థాలు కనిపించలేదు. వరుసగా ఇలాంటి మెయిళ్లు రావడంతో కోర్టు వర్గాల్లో ఆందోళన నెలకొంది. ప్రతి సారి కార్యకలాపాలు అంతరాయం కలగడం వల్ల న్యాయపరమైన వ్యవహారాలు ఆలస్యమవుతున్నాయని న్యాయవాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భయాందోళనలో లాయర్లు, సిబ్బంది "ప్రతిసారి బెదిరింపు మెయిల్ వస్తోంది. నిజం కాదని తెలిసినా భయం కలుగుతోంది. కోర్టు వంటి సున్నితమైన ప్రదేశంపై ఇలా బెదిరింపులు రావడం ఆందోళనకరం" అని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు!! సిబ్బంది కూడా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని కోరుతున్నారు. గాలింపులో పోలీసులు బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తుల జాడ కోసం సాంకేతిక ఆధారాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మెయిల్ మూలాన్ని గుర్తించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. గతంలో వచ్చిన మెయిల్‌తో దీనికి సంబంధం ఉందా అన్న కోణంలోనూ పరిశీలిస్తున్నారు. అప్రమత్తంగా పోలీసులు ప్రతి బెదిరింపు సందేశాన్ని అత్యంత ప్రాముఖ్యంగా తీసుకుంటామని, భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని పోలీసు కమిషనర్ శంఖబత్ర బాగ్చి తెలిపారు. కోర్టు పరిసరాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను పెంచడంతో పాటు అదనపు భద్రతా సిబ్బందిని మోహరించారు. పూర్తిస్థాయి విచారణ కోరిన న్యాయవాదులు ఇలాంటి బెదిరింపులు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. కోర్టు కార్యకలాపాలు నిరభ్యంతరంగా కొనసాగేందుకు శాశ్వత భద్రతా చర్యలు అవసరమని అభిప్రాయపడ్డారు. వరుస బెదిరింపులతో న్యాయవర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.







## స్టీల్ కార్మికుల ఫిబ్రవరి జీతాలు చెల్లించాలి

- లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతం చేస్తాం : సిఐటియు హెచ్చరిక
- పూర్తి వేతనాల కోసం సంతకాల సేకరణ ప్రారంభం




**పెద గంట్యాడ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మేజర్ న్యూస్: స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి పెంపులో యాజమాన్యం, ప్రభుత్వ వైఫల్యాలను కార్మికులపై నెట్టివేయడం అన్యాయమని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె. అయోధ్య రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలనే ప్రధాన డిమాండ్‌తో స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్మృత్యాంజలి పార్కు వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మనము కష్టపడి పని చేసిన కాలానికి పూర్తి జీతం పొందడం మన హక్కు. ఆ హక్కును కాలరాస్తే ఎందుకు సహించాలి? ఎంతకాలం భరించాలి?" అని ప్రశ్నించారు. ఉత్పత్తికి అవసరమైన ముడిసరుకు సమకూర్చడంలో యాజమాన్యం విఫలమైందని, ఆ వైఫల్యాన్ని కార్మికులపై నెట్టడం దుర్మార్గమని విమర్శించారు. గత మూడు నెలలుగా జీతాల విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిపై రీజనల్ లేబర్ కమిషనర్ జోక్యం చేసుకున్నప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఫిబ్రవరి నెల పూర్తి వేతనాలు చెల్లించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్మికులపై ద్వంద ప్రమాణాలు పాటిస్తూ వివక్ష చూపుతున్న కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖపై నిరసన తెలియజేయడం ప్రతి కార్మికుడి బాధ్యత అని అన్నారు. స్టీల్ సిఐటియు అధ్యక్షుడు యు. రామస్వామి మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ విశాఖ స్టీల్ ప్లాంట్ లో జీతాలను ఉత్పత్తికి ముడిపెట్టడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఢిల్లీ లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. అలాగే సిపిఎం ఎంపీ ద్వారా కేంద్ర ఉక్కు మంత్రికి లేఖ రాయించిన విషయాన్ని గుర్తుచేశారు. 2024 సెప్టెంబర్ నుంచి హెచ్‌ఆర్ఏ నిలిపివేయడం, ఉక్కునగరంలో విద్యుత్ చార్జీలు పెరగడం, పలు సౌకర్యాలు నిలిపివేయడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పత్తిని జీతాలతో ముడిపెట్టే సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేసి, బకాయిలు సహా పూర్తి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు ఎం. రామారావు, స్టీల్ సిఐటియు నాయకులు పి. శ్రీనివాసరాజు, పుల్లారావు, ఆర్. వెంకట్రావు తదితరులతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## మానవత్వాన్నీ చాటిన పెందుర్తి పోలీసులు



**పెందుర్తి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపురం గ్రామంలో సుమారు 55 సంవత్సరాల వయస్సు గల కన్నడ భాష మాట్లాడే ఒక నిరాధార వ్యక్తి ఎటువంటి సంరక్షణ లేకుండా తిరుగుతున్న విషయాన్ని స్థానిక సచివాలయ మహిళా పోలీస్ గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని పెందుర్తి పోలీస్ స్టేషన్ సిఐ కె.వి. సతీష్ కుమార్‌కు సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ లెక్కల చంద్రశేఖర్ మరియు మహిళా పోలీసు సిబ్బంది సహకారంతో ఆ వ్యక్తిని సురక్షితంగా తరలించారు. అనంతరం పెందుర్తిలోని లాయల్ ఓల్డ్ ఏజ్ హోమ్ వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఎటువంటి ఆధారం లేకుండా తిరుగుతున్న ఆ వ్యక్తికి తక్షణ సహాయం అందించడం ద్వారా పోలీసులు మానవత్వాన్ని చాటారని రాంపురం గ్రామ ప్రజలు అభినందించారు. ఇన్‌స్పెక్టర్ సతీష్ చురుకైన స్పందనతో ఒక నిరాధారుడికి ప్రాణాధారం లభించిందని స్థానికులు పేర్కొన్నారు. ఆ వ్యక్తి పూర్తి వివరాలు, స్వస్థలం మరియు బంధువుల ఆచూకీ తెలుసుకునేందుకు పెందుర్తి పోలీసులు చర్యలు చేపట్టారు. సమాచారం లభించిన వెంటనే సంబంధిత కుటుంబ సభ్యులకు తెలియజేస్తామని తెలిపారు. సమాజంలో ఎవరైనా నిరాధారులు, వృద్ధులు సంరక్షణ లేకుండా కనిపించినపుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని పెందుర్తి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థులకు మాదకద్రవ్యాల కొత్త చట్టాలపై అవగాహన

- డ్రగ్స్ దుష్పరిణామాలు, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై పోలీసుల చైతన్య కార్యక్రమం



**పద్మనాభం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** యువతను నేరాల నుండి దూరంగా ఉంచి చట్టాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పద్మనాభం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో రెడ్డిపల్లి హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ అలవాటు జీవితాన్ని ఎలా దెబ్బతీస్తుందో ఉదాహరణలతో తెలియజేశారు. అలాగే ఇటీవల అమల్లోకి వచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ నియమాలను పాటించాల్సిన అవసరం, హ్యూమన్ ట్రాఫికింగ్ ప్రమాదాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాల కార్మిక వ్యవస్థపై చట్టపరమైన చర్యలు వంటి అంశాలను వివరించారు. పోక్సో చట్టం, ఈవ్ టీజింగ్, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ నేరాల నుంచి రక్షణ చర్యలు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అంశాలపై కూడా విద్యార్థులకు సూచనలు ఇచ్చారు. అనుమానాస్పద పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.విద్యార్థులు చురుకుగా పాల్గొని సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు తరచుగా నిర్వహించి యువతలో చైతన్యం పెంపొందిస్తామని పోలీసులు తెలిపారు.

# డయేరియా ప్రాంతాల్లో మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణ దాస్, సిదిరి అప్పలరాజు

**శ్రీకాకుళం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్** :మంచి ప్రభుత్వం అని స్టిక్కర్ డోర్ కు అంటించడం కాదు ప్రజల హృదయాల్లో ఉండాలి.మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు.20 నెలలుగా టీడీపీ పాలన లో ప్రజారోగ్యం నిర్లక్ష్యం చేశారు.ప్రభుత్వ నిర్ణయాలు ప్రజలకు శాపం లా మారాయి.ప్రతి జిల్లాకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఇవ్వాలనుకున్నాం.ప్రైవేటీకరణతో ఒక ప్రభుత్వ ఆలోచనలు తొక్కేసారు.ప్రజలు డయేరియా తో పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ కు వివరించిన నేతలు చనిపోపోయిన వారికి కుటుంబ సభ్యులకు 25 లక్షలు రూపాయలు ఇవ్వాలి డేరియా తో చికిత్స పొందుతున్న వారి ఖర్చు ప్రభుత్వమే భరించాలి  కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం కి ప్రాధాన్యత లేదు బలగ ప్రాంతంలో డయేరియా డిసెంబర్ లో ఇలానే వచ్చింది100 మందికి పైగా డయేరియా  పేషెంట్ లు ఉన్నారు నలుగురు చనిపోతే.. ఒక్కరే చనిపోయారని చెప్తున్నారు మంచి ప్రభుత్వం అని స్టిక్కర్లు అంటించుకుంటారు తప్ప ప్రజా సమస్యలు పట్టించుకోరు అతిసారంతో నలుగురు చనిపోతే ఒకరు లేదా ఇద్దరే చనిపోయారంటున్నారు వాంతులు, విరోచనాలతో ప్రజలు చనిపోతుంటే పోస్టుమార్టం అంటున్నారు కుటుంబాలను ఆదుకుందాం అనే బాధ్యత ప్రభుత్వానికి లేదు బాధ్యత లేకుండా రాజధాని పేరు తో డబ్బంతా ఒకే దగ్గర పెడుతున్నారుఅన్ని రంగాలను నిర్లక్షం చేస్తున్నారు రాష్ట్రంలో వెనకబడిన వర్గాలు ఏడుస్తున్నారు.రైతులను దళారీలు దోచేస్తున్నా అడిగేవాడే లేడు యూరియా బస్తా కోసం రైతు  వెళ్తే యూరియా బస్తా లేదుఇంగ్లీషు మీడియం చదువుకుంటాననే విద్యార్థికి విద్య లేదు ధాన్యం కు కనీస మద్దతు ధర లేదు ధాన్యం రెండు కేజీ లు ఎక్కువ తీసుకుంటున్న పట్టించుకోలేదు నదుల్లో సిల్ట్ క్లియర్  చేయాల్సిన ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో తీస్తున్నారు దోపిడి, నిర్లక్షం తో పాలన చేస్తున్నారు మున్సిపాలిటీ నీ ప్రైవేట్ ఏజెన్సీ ల తయారు చేశారు మున్సిపాలిటీ డబ్బంతా దొంగల జేబుల్లోకి వెళుతుంది ప్రభుత్వం వైఫల్యం చెందిందని అన్ని ప్రాంతాల ప్రజల్లో వచ్చింది ఇచ్చిన హామీల కోసం 1000 కోట్లయిన శ్రీకాకుళం లో ఖర్చు చేశారాప్రజాస్వామ్యంలో మిమ్మలిని వెంటపెట్టే రోజు దగ్గరలోనే ఉంది మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ఏమన్నారు అంటే, తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజా ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసింది. ఇది మాటల్లో నేను చెప్పనక్కర్లేదు, ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు మీరు చూసుంటారు ప్రతి జిల్లాకు ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని ఇద్దాం అని అంటే.. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాన్ని ప్రైవేట్ వ్యక్తులకు చేతుల్లో పెట్టేద్దాం అనే ఒక ప్రభుత్వ ఆటిట్యూడ్, ప్రభుత్వం తాలూకా ఆలోచన ధోరణి ఏంటనేది తద్వారా మీకు అర్థమవుతుంది. ప్రపంచంలో ఎక్కడైనా ప్రభుత్వాలకు ప్రాథమిక బాధ్యత ప్రజారోగ్యం మీద ఉంటుంది. కానీ ఈనాడు ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న టిడిపి ప్రభుత్వానికి ప్రజారోగ్యం అనేది అత్యంత ప్రాధాన్యత లేని అంశం. ఇలాంటి సంఘటన ఇక్కడే జరిగిందని కాదు, రాజమండ్రిలో కూడా జరిగింది, మాజీ మంత్రి డాక్టర్ అప్పలరాజు అక్కడికి వెళ్లి వచ్చారు, డిసెంబర్ లో పట్టణంలోని బలగ ప్రాంతంలో జరిగింది. ఇదే ప్రాంతంలో సుమారుగా 100 మంది డయేరియా రోగులు ఉంటే.. ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి ఎవడి బాధలు వాళ్ళు పడుతున్నారు, కానీ వాళ్ల డోర్ కి మంచి ప్రభుత్వం అంటూ స్టిక్కర్ అంటించడానికి ఒకరిని పంపిస్తున్నారు. ముగ్గురు, నలుగురు చనిపోతే, ప్రభుత్వం తాలూకా ఆలోచన ఏంటంటే ఒక్కడే చనిపోయాడు, మిగతా వారందరూ వేరే కారణాలతో చనిపోయారని చెప్తున్నారుఆ. కానీ చనిపోయిన వ్యక్తి తాలూక భార్యను అడిగితే చెబుతోంది గడిచిన నాలుగు రోజులుగా వాంతులు విరోచనాలతో గుమ్మం దాటుతూనే చనిపోయాడని. ప్రభుత్వ యంత్రాంగానికి ఏమని ఆదేశాలు ఇచ్చారు ? పోస్టుమార్టం చేస్తా అంటున్నారు, వందమంది డయేరియాతో ఈ ప్రాంతం నుంచి ఆసుపత్రిలో ఉంటే, చనిపోయింది నలుగురు అయితే, ఇంట్లో వాళ్ళు వీధిలో వాళ్ళు అందరూ చనిపోయిన వ్యక్తులు వాంతులు విరోచనాలతో చనిపోయారని చెప్తుంటే, పోస్టుమార్టం రిపోర్ట్ లో మీరు ఏం చెప్తే అదే కదా రాస్తారు డాక్టర్లు, రిపోర్ట్ లో ఏం వస్తాదో కూడా మాకు కూడా తెలుసు, ఎంత దిగజారిపోయిందో ప్రభుత్వం చూడండి. ఇంత మంది చనిపోయారని వార్తను ప్రజలకు తెలియకుండా ఉంచుతామనే తాపత్రయంతో ప్రభుత్వం ఉంది, ఆ కుటుంబాలను ఆదుకుందాం ముమ్మందు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూద్దాం అనే బాధ్యత ప్రభుత్వానికి లేకపోవడం ప్రత్యక్షంగా



ఈరోజు జరిగిన ఘటన చూస్తున్నాం. ప్రజల తాలూకా అభిప్రాయాలను విన్నాం. ఈ ప్రభుత్వం పూర్తిగా బాధ్యత లేకుండా వ్యవహరిస్తోంది. ఎంతసేపు రాజధాని అనే పేరుతో డబ్బంతా అక్కడ పెట్టి మిగతా రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేస్తూ అన్ని రంగాలను వదిలేసింది. ఈరోజు శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే రోగులకు ఇవ్వడానికి మందు బిళ్ళలు లేవు. మందు బిళ్ళ ఇచ్చే దిక్కు లేకుండా పోయింది శ్రీకాకుళంలో ఉన్నది మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్. రైతులకు ఇవ్వడానికి యూరియా బస్తాలు లేవు, పిల్లలకు చదువుకోవడానికి ఇంగ్లీష్ మీడియం లేదు,  పేషెంట్లు చేరుతామంటే పని చేయడానికి ప్రభుత్వాసుపత్రులు లేవు. రాష్ట్రాన్ని ఎటు తీసుకెళ్తున్నారు .మూడు లక్షల 30 కోట్ల బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో మధ్యతరగతి, దిగు మధ్యతరగతి చెందిన ప్రతి ఒక్కరు బోరుని ఏడుస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ధాన్యంకి ప్రకటించిన కనీస ధర రూ.1800 ఉంటే రూ.1500 లకు కూడా అమ్ముకోలేని దిక్కులేని పరిస్థితిలో రైతాంగం ఉంది. ధాన్యం పట్టాల్సిన బరువు కంటే రెండు కేజీలు ఎక్కువ తీసుకున్నా అడిగే నాథుడే లేడు. లంచాలు ఇస్తే చాలు ప్రజలను ఎలా దోచుకున్న పర్వాలేదనే అభిప్రాయం తో ఉంది ఈ ప్రభుత్వం. కడుపు మండిపోతోంది. నదిలో  ఎక్కడికక్కడ మేజర్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్ ఉన్నాయి, వాటి పరిధిలో 10,15 గ్రామాలకు త్రాగు నీటిని సప్లై చేయడానికి, ఆ ప్రాంతంలో ఇసుక బెడ్స్ ను సిల్ట్ క్లియర్ చేయాల్సిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతాల్లో తీస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి లేదా లోకేష్ సిఫారసు చేసిన వాళ్ళకి ఇచ్చేస్తున్నారు. గార ప్రాంతంలో ఉండే త్రాగునీటి స్కీమ్ లో గత పది రోజుల నుంచి ఎర్రటి నీరు వస్తుంది, రాబోయే రోజుల్లో ఆ ప్రాంతంలో కూడా డయేరియా కేసులు నమోదు కాబోతున్నాయి, యదేచిగా అనుమతులు లేకుండా ఇసుకే దోచుకునే కార్యక్రమం అక్కడ జరుగుతుంది. ఏమిటి దోపిడీ.. ఏమిటి నిర్లక్ష్యం.. ఏమిటి అన్యాయం.. 80 సంవత్సరాల ప్రజాస్వామ్యం తర్వాత ఎంతో అనుభవం ఉందని చెప్పుకుంటున్న మీ పాలన ఏంటి? మున్సిపాలిటీని ప్రైవేట్ వ్యవస్థగా మార్చేశారు, ఎవరిని అడిగినా ఇది ప్రైవేటు ఏజెన్సీ నా అనేలా తయారు చేశారు. ఎవరు టెండర్లు వేయకూడదు, వాళ్ళు చెప్పిన వాళ్లే టెండర్లు వేయాలి, ఇట్లాగే ఉండేదా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉండేటప్పుడు? ఇలాగేనా వైద్యం ఉండేది? ఇలాగేనా విద్యా వ్యవస్థ ఉండేది? ఇలాగేనే రైతాంగానికి సమస్యలు ఉండేవి? దీనికి మంచి ప్రభుత్వమని స్టిక్కర్ తగిలిస్తారా మీరు? బలవంతంగా మంచి ప్రభుత్వం అని స్టిక్కర్ డోర్లకు తగిలించడం కాదు ప్రజల గుండెల్లో ఉండాలి, బుధవారం అన్ని ప్రాంతాల్లో ఈ ప్రభుత్వం వైఫల్యం చెందిందన్న భావన ఏర్పడింది. ఉద్యోగులందరినీ పంపించి గడిచిన పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేయించగలిగారు. కనీసం ఒక్క డిమాండ్ అయినా పరిష్కరించగలిగారా, గ్రామాల్లో పట్టణాల్లో ఉండే కింద స్థాయి పరిపాలన వ్యవస్థని గాలికి వదిలేసారు. సమస్యలేవీ మీ దృష్టికి రావడం లేదా? రెండేళ్లు ఈ ప్రభుత్వ కాలం అయిపోయింది, మీకు మిగులు ఉన్నది మరో మూడేళ్లు మాత్రమే, ఎన్నో హామీలు ఇచ్చారు,  పట్టుమని 1000 కోట్లు రూపాయలతో శ్రీకాకుళంలో మీరు ఖర్చు పెట్టగలిగారా. ప్రభుత్వానికి సంబంధించి ప్రజల ఆస్తిని నిర్మాణం చేశారా?వెనుకబడి ప్రాంతాలకు చెందిన ప్రజల తాలూకు హక్కులను, రాజ్యాంగ హక్కులను తొక్కేస్తున్నారు. ఇది ఎల్లకాలం జరగదు. ప్రజల చేతిలో అధికారం ఉంది. రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన అధికారం. ఆ అధికారంతో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని వెంటబెట్టి ఇంటికి పంపించే రోజు రాబోతుందని విషయం ముందే మీరు గమనించాలి. అని మాజీ మంత్రి ధర్మాన అన్నారు.




# అవతర్ మెహర్ బాబా జన్మదిన వేడుకలలో కృష్ణ చైతన్య



**నరసన్నపేట ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్**:నరసన్నపేట  పట్టణం ఆదివారంపేట లో అవతార్ మెహర్ బాబా జన్మదిన వేడుకలకు హాజరైన యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య అవతార్ మెహర్ బాబా చిత్రపటానికి పూల దండలు వేసి పూజలు నిర్వహించారు. ఎంపీపీ ఆరంగి మురళిధర్ , రాష్ట్ర పొందర కూరకుల విభాగం అధ్యక్షులు రాజపు అప్పన్న జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు ఖ జన గుప్తా నియోజకవర్గ పంచాయతీ రాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్ మోహన్ , నియోజకవర్గ చేతివృత్తుల విభాగం అధ్యక్షులు సారేపల్లి గోవింద, నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు సురంగి నర్సింగరావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్లేపల్లి లక్ష్మణరావు , మండల యూత్ అధ్యక్షులు బుద్దల రాజశేఖర్, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు మండల ఉప అధ్యక్షులు నేతింటి రాజేశ్వరరావు , గుడ్ల రమేష్,  తదితరులు పాల్గొన్నారు.

# మరింత మెరుగైన వైద్యం అందించండి



**- డయేరియా బాధితులు ధైర్యంగా ఉండండి- బాధితుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం,ఫిబ్రవరి,25 మేజర్ న్యూస్:** డయేరియా బాధితులకు మరింత మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ జెమ్స్ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న డయేరియా బాధితులను బుధవారం ఆయన సందర్శించారు. వీరిని కలెక్టర్ స్వయంగా వెళ్లి వారికి అందిస్తున్న వైద్యం గూర్చి వైద్యులతో చర్చించారు. పేషెంట్స్ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని చెప్పారు. ధైర్యంగా ఉండాలని బాధితులకు భరోసా కల్పించారు. అన్ని హాస్పిటల్స్ లో చికిత్స తీసుకుంటున్న వారిలో బుధవారం 13 మందిని డిస్చార్జ్ చేశారు. కలెక్టర్ తో పాటు జెమ్స్ వైద్యులు డాక్టర్ హేమంత్, ఆర్ఎంఒ ప్రవీణ్, తదితర వైద్యులు పాల్గొన్నారు.




## నీతి ఆయోగ్ అధికార ప్రతినిధి ఆయుషి అగర్వాల్ జిల్లా పర్యటన



**పార్వతీపురం (మేజర్ న్యూస్) :** నీతి ఆయోగ్ అధికార ప్రతినిధి ఆయుషి అగర్వాల్ మన్యం జిల్లాలో పర్యటించారు. కలెక్టర్ ను ఆయన ఛాంబరులో కలిసి భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలపై సమగ్రంగా చర్చించారు. 2047 నాటికి గ్రామాలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించిన 'విలేజ్ ప్లాన్ 2047' అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు. మన్యం జిల్లాకు అనుకూలమైన భౌగోళిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయం, ఉద్యానవనం అనుబంధ రంగాలను బలోపేతం చేయాలని చర్చించారు. రైతులకు స్థిరమైన ఆదాయ వనరులు కల్పించే దిశగా సమగ్ర కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. ఆయుషి అగర్వాల్ మాట్లాడుతూ–వ్యవసాయం మరియు సేవా రంగాల్లో ఆధునిక సాంకేతికత, అంతర్జాతీయ ప్రమాణాలు తీసుకురావడానికి నీతి ఆయోగ్ తరఫున 'నాలెడ్జ్ పార్ట్‌నర్స్' మద్దతు అందించాలని సూచించారు.

## చైన్ స్నాచింగ్ దొంగతనాలకు పాల్పడిన

# నిందితుడిని పట్టుకున్న పార్వతీపురం మన్యం జిల్లా పోలీసులు

### నిందుతుడు నుండి సుమారు 29 లక్షల విలువ గల 192 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ



**సీతానగరం/పార్వతీపురం రూరల్ ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** మోటార్ సైకిల్ పై తిరుగుతూ ఒంటరి మరియు వృద్ధాప్య మహిళలను లక్ష్యంగా చేసుకొని మెడలో బంగారు ఆభరణాలు లాగి ఎవరికి దొరక కుండా బైక్ పై తప్పించుకు తిరిగే నిందితుడ్ని, సాంకేతిక నైపుణ్యం (సి సి ఫుటేజ్, సిడిఆర్) ఆధారంతో పార్వతీపురం రూరల్ సర్కిల్ పోలీసులు ,ఎస్బీ, ఐటి కోర్, క్రైమ్ బృందాలు చాకచక్యంగా పట్టుకొని అతని వద్ద నుండి సుమారు 29 లక్షల విలువ గల 192 గ్రాముల బంగారాన్ని స్వాదీనం చేసుకున్నామని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి తెలియజేసారు. ఈ క్రమంలో ఎస్ఐ సీతానగరం వారికి రాబడిన సమాచారం మేరకు బుధవారం ఉదయం 07.30 గంటల సమయంలో సీతానగరం ఎస్సై అతని సిబ్బంది మండలంలోని గుచ్చిమి గ్రామం జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా సదరు నిందుతుడు కొయ్యపు గిరి రాజశేఖర్ పార్వతీపురం వైపు నుంచి బొబ్బిలి వైపు వస్తుండగా అతను వస్తున్న మోటార్ సైకిల్‌ను ఆపి దాని నెంబరు ఫోటోలో ఉన్న వ్యక్తిగా గుర్తించి పరిశీలించగా అతను వద్ద ఉన్న బ్యాగ్లో పైన తెలిపిన కేసులలో చోరీసొత్తు దొరికింది. అవి సీతానగరం పోలీస్ స్టేషన్ కేసులలో చోరీసొత్తు అయి ఉంది. అంతటి ఎస్ఐ సదరు వ్యక్తిని పట్టుకొని విచారించగా మొత్తం సీతానగరం మండలంలో 3 చైన్ స్నాచింగ్‌లను, బలిజపేట పోలీస్ స్టేషన్ పరిధిలో 1 చైన్ స్నాచింగ్, వీరగట్టం పోలీస్ స్టేషన్ పరిధిలో 4 చైన్ స్నాచింగ్, గరుగుబిల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 చైన్ స్నాచింగ్, చినమేరంగి పోలీస్ స్టేషన్ పరిధిలో 2 చైన్ స్నాచింగ్, పాలకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 2 చైన్ స్నాచింగ్ ను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. అంతట అతను వద్ద ఉన్న బంగారు వస్తువులు మరియు మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకుని ఎస్సై మధ్యవర్తుల సమక్షంలో గుచ్చిమి గ్రామం దగ్గర రాజశేఖర్ ను అదుపులోకి తీసుకోని అరెస్ట్ చేయడమైనది. ముద్దాయిని చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేసి,చోరి కాబడిన ఆస్తిని రికవరీ చేసిన పిర్యాదులకు న్యాయం చేసిన పార్వతీపురం రూరల్ సర్కిల్ పోలీసులను ,ఎస్బీ, ఐటీ కోర్ . క్రైమ్ బృందాలను జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తో పాటుగా అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు, పార్వతీపురం ఏఎస్పీ మనీషా రెడ్డి,ఐపిఎస్, ఎస్బీ సిఐ రమణమూర్తి, పార్వతీపురం రూరల్ సిఐ రంగనాథం, ఏఆర్ ఆర్ఐలు నాయుడు,రాంబాబు, బలిజిపేట ఎస్సై సింహాచలం, పార్వతీపురం రూరల్ ఎస్సై రాజేష్, సీతానగరం ఎస్సై హేమలత, క్రైమ్ సిబ్బంది, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇకపై గ్రామ స్థాయిలోనే 'రెవెన్యూ క్లినిక్'



**పార్వతీపురం (మేజర్ న్యూస్) :** జిల్లావ్యాప్తంగా గ్రామ స్థాయిలో 'రెవెన్యూ క్లినిక్స్' ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇకపై ప్రతి గురువారం వీఆర్ఓలు ఆయా గ్రామాల్లో రెవెన్యూ క్లినిక్ నిర్వహించి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రజల భూ సంబంధిత మరియు ఇతర రెవెన్యూ సమస్యలను త్వరితగతిన, పారదర్శకంగా పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. వేరే గ్రామాలకు ఇంచార్జిగా వ్యవహరిస్తే శుక్రవారం రెవెన్యూ క్లినిక్ నిర్వహించి, ఆ సమాచారాన్ని ముందుగానే గ్రామ ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రాలు లేదా కలెక్టరేట్ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, తమ గ్రామంలోనే పరిష్కారం పొందే అవకాశం కల్పించబడుతుందని పేర్కొన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏప్రిల్ నెల నుంచి రెవెన్యూ సమస్యలపై ఒక్క ఫిర్యాదు కూడా అందకూడదనే లక్ష్యంతో అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత , సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్. దిలీప్ చక్రవర్తి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల ఆదాయ వనరులు పెంపొందించుకోవాలి

**పంచాయతీలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కార్యదర్శులదే**

**మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎంఎల్ఎన్ ప్రసాద్**



**సీతానగరం, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీలను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం ఎల్ ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం నాడు గ్రామ పంచాయతీ కార్యదర్శులకు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీల పరిధిలో ఆదాయం సమకూర్చుకోవడంపై శిక్షణా కార్యక్రమమును నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి. సీతారాం ఇండస్ట్రియల్ ప్రోగ్రాం ఆఫీసర్ రావణ బ్రహ్మ హాజరై ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక కుటుంబం ఒక ఎంటర్ప్రెనూర్ పథకం లో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీ నుండి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను గుర్తించి వివరాలను ఆన్లైన్లో పొందుపరచాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ గ్రామ అభివృద్ధిపై శ్రద్ధ పెట్టాలని.గ్రామ పంచాయతీల పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రాల ద్వారా ఆదాయమును సమకూర్చుకోవాలని అలాగే హౌస్ టాక్స్ జననమరణాల రిజిస్ట్రేషన్ ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈశిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కేకే వర్మతోపాటు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ విధానాలు చాలా స్ఫూర్తిదాయకంగా ఉన్నాయి

**– ఆర్.వై.యస్.యస్.సీనియర్ టీం లీడర్ విజయ రాఘవ – జట్టు ఎగ్జిక్యూటివ్ ట్రస్ట్ డాక్టర్ డొల్లు పారినాయుడు**





**గరుగుబిల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతు సాధికార సంస్థ సీనియర్ టీం లీడర్ (ఎస్టిఎల్) విజయరాఘవ పార్వతీపురం మన్యం జిల్లాలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. రైతు సాధికార సంస్థ తరఫున అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధా నాలు విజయరాఘవ పరిశీలించారు. రైతు సంక్షేమం కోసం ప్రకృతి వ్యవసాయ మార్గంలో పలు పంటల నమూనాలను పరిశీలించి, ఇవి రైతుల ఆహార భద్రతను, కుటుంబ భద్రతను ఇచ్చే విధంగా ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి ప్రకృతి వ్యవసాయ గ్రామంగా (బయో విలేజ్ గా) ఎంపికైన కొండ బారిడితో పాటు ధూళికుప్ప, మండ, దురిబిలి తదితర గ్రామా లను సందర్శించి అక్కడ ప్రజలను కలిసి, వారి విధానాలను అధ్య యనం చేశారు.దురబిలి గ్రామము లో ఆరిక నరసమ్మ వేసిన ఎటిఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ మరియు దూళికుప్ప గ్రామములో కొండగొర్రి పద్మ వేసిన అర ఎకర అన్నపూర్ణ మోడల్, ఎటిఎం మోడల్ లలో వారు పండించే పంటలు, వారు ఆర్థికంగా ఎదుగుదలకు వినియోగించుకున్న వ్యాపార అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పాఠశాలలో అమలు అవుతున్న బడితోట కార్యక్రమాలను వీక్షించి విద్యార్థు లకు గేయాల ద్వారా కథల ద్వారా రైతు సాధికార సంస్థ అందిస్తున్న విషయాలు ఎలా చేరుతున్నాయో చూసి మెచ్చుకున్నారు. బడి తోటల పచ్చదనాన్ని చూసి ఎంతగానో సంతోషించారు. చిన్ననాటి నుండి విద్యార్థులకు ప్రకృతి వ్యవసాయం అందించే ఈ విధానాన్ని ఎంతో కొనియాడారు.ఈకార్యక్రమంలో సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ డొల్లు పారినాయుడుతో పాటు అడిషనల్ డీపీఎం ప్రవీణ్ కుమార్, కన్సల్టెంట్ లు వాసు దేవరావు, శివాజీ, ఉమా మహేశ్వరి, విరాజిత, సన్యాసిరావు, నూకమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కురిసింది వాన.... చల్లబడింది మన్యం



**సీతంపేట మేజర్ న్యూస్ :** ఎన్నాళ్ళకు ఎన్నాళ్ళు సీతంపేట ఏజెన్సీలో లో దాదాపు అరగంట పాటు ఒక్కసారిగా వర్షం కురిసింది. ఇప్పటికీ ఎండలు మండిపోతున్నాయి. ఈ వర్షం తో ఒక్కసారిగా మన్యం చల్లబడింది. అయితే మామిడిపువ్వు ఈ వర్షానికి రాలిపోతుందని గిరిజనం వాపోతున్నారు.వేసవిలో వేసిన వరి పంటకు కొంత ఊరడింపు. వేసవిలో త్రాగు నీరు బోర్లు కు భూగర్భ జలాలు పెరిగి తాహోర్తికి ఉపశమనం కలుగుతుంది. మొత్తం మీద ఈ వర్షం అన్నివిధాలా మేలని చెప్పొచ్చు.

## వీరసాగరంలో వివాహం, గృహప్రవేశ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శంబంగి హాజరు



**బాడంగి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** మండలంలోని వీరసాగరం గ్రామంలో జరిగిన వివాహం, గృహప్రవేశ వేడుకలకు బుధవారం మాజీ ఎమ్మెల్యే శంబంగి చిన్న అప్పలనాయుడు హాజరై నూతన దంపతులకు, గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో సామాజిక వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగానిర్వహించబడ్డాయి. గ్రామానికి చెందిన పెదకాపు రవికిరణ్–రామలక్ష్మి దంపతుల ఆహ్వానం మేరకు జరిగిన వివాహ మహోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ఐశ్వర్య సంపదలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. అనంతరం లచ్చుపతుల భాస్కర్‌రావు, సింహాచలం ఆహ్వానం మేరకు జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని, కొత్త ఇంటిలో ఆనందం, అభివృద్ధి, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే రాకతో గ్రామంలో ఉత్సాహ భరిత వాతావరణం నెలకొని, వేడుకలకు మరింత ప్రత్యేకత చేకూరింది.

## రసాయనిక ఎరువుల వినియోగం వల్ల రైతులకు అపార నష్టం

**– మండల వ్యవసాయాధికారి అమరా శివ**




**రామభద్రపురం, ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** పంటల సాగులో రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగించడం వల్ల అపార నష్టం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి అమరా శివ తెలిపారు. మండల పరిధిలోని సోంపురం గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యూరియా అధికంగా వాడడం వల్ల పత్రహరితం పెరిగి తెగుళ్లు, పురుగులు అధికంగా ఆశిస్తాయన్నారు. అంతే కాకుండా భూసారం దెబ్బతిని పంటల దిగుబడి కూడా తగ్గుతాయన్నారు. రైతులు ఆర్థికంగా నష్టపోతారని హెచ్చరించారు. ప్రతి రైతు నానో యూరియాపై అవగాహన పెంపొందించు కోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. మొక్కజొన్న పంటలో ఎకరాకు 220 కేజీల యూరియా, 50 కిలోల డీఏపి, 30 కిలోల పొటాష్ వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అలా కాకుండా రైతులు ఇష్టానుసారం రసాయనిక ఎరువులు వినియోగించడం వల్ల భూసారం దెబ్బతింటుందని తెలిపారు.

## ఎల్లమాంబ జాతరకు 'కోట్ల'ఆర్థిక సహకారం



**పూసపాటిరేగ, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందు వరసలో ఉన్న వ్యక్తి కోట్ల రఘు గుర్తిండిపోతారు. ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్య ఇస్తూనే మరోవైపు దేవాలయాల నిర్మాణాలకు, జాతర్లు నిర్వహించే వారికి తన సొంత సొమ్మును వెచ్చించి నిరంతరం ఆర్థిక సాయాన్ని అందిస్తూనే ఉన్నారు. తాజాగా కొవ్వాడ అగ్రహారం పంచాయతీలో ఎల్లమాంబ జాతరోత్సవం జరుగు తుండగా జాతర నిర్వహణలో అన్నదాన కార్యక్రమానికి గాను తన వంతు ఆర్థిక సాయంగా రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. శ్రీ మాత ఎల్లమాంబ సర్వీసు అధ్యక్షుడు చల్ప గోపాలకృష్ణకు ఈ ఆర్థిక సహాయాన్ని అందించగా ఈ కార్యక్రమంలో ఎల్లమాంబ జాతర నిర్వాహకులు కూడా పాల్గొన్నారు.

### బాడంగి–ముగడ–బొబ్బిలి ఆర్‌అండ్‌బి రహదారి దుస్థితి...

# మరమ్మతులకు నిధులు కేటాయించాలి

## అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే బేబీ నాయన



**బాడంగి, ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** బాడంగి నుండి ముగడ గ్రామం మీదుగా బొబ్బిలి నియోజకవర్గ కేంద్రానికి వెళ్లే సుమారు 12 కిలోమీటర్ల ఆర్‌అండ్‌బి ప్రధాన రహదారి ప్రస్తుతం దారుణ స్థితికి చేరుకుంది. ఒకప్పుడు ప్రజల రాకపోకలకు కీలకంగా ఉన్న ఈ రహదారి, కాలక్రమేణా గుంతలమయంగా మారి ప్రమాదకరంగా తయారైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న సమయంలో పూసపాటి అశోక్ గజపతిరాజుకు, ప్రస్తుత బొబ్బిలి బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సిఫార్సు మేరకు ప్రత్యేక చొరవతో కేంద్ర నిధులు మంజూరు చేయించగా, బాడంగి నుండి జె.రంగ రాయపురం సమీపంలోని కునుకువాని వలస వంతెన వరకు ఈ రహదారి నిర్మించబడింది. ఈ రహదారి ద్వారా బాడంగి, బొబ్బిలి, తెర్లాం, మెరకముడిదాం, దత్తిరాజేరు తదితర మండలాల ప్రజలకు రాకపోకలు సులభమయ్యాయి. అప్పట్లో ఈ రహదారి నిర్మాణానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. అయితే ప్రస్తుతం రహదారి పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి అనర్హంగా మారింది. ముఖ్యంగా విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లడంలో ఇబ్బందులు పడుతున్నారు.

అలాగే ప్రజలు నిత్యావసరాల కోసం, వైద్య అవసరాల నిమిత్తం, శుభ కార్యాలకు వెళ్లడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించడంలో, ఉద్యోగులు విధులకు వెళ్లి రావడంలో కూడా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీ నాయన అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించారు. తన నియోజకవర్గంలో దెబ్బతిన్న పలు రహదారులతో పాటు బాడంగి––ముగడ––బొబ్బిలి ప్రధాన రహదారిని అత్యవసరంగా మరమ్మతు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. ప్రయాణానికి ముప్పుగా మారిన ఈ రహదారికి తక్షణమే నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టాలని, ప్రజలకు సురక్షిత రాకపోకల సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే స్థానిక ప్రజలు ఈ రహదారి మరమ్మతుల కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## ప్రతి అర్హత కుటుంబానికి 100 రోజులు ఉపాధి హామీ పని కల్పించాలి



**బాడంగి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనులను వేగవంతం చేసి, ప్రతి అర్హ కుటుంబానికి ఉపాధి కల్పించే దిశగా కృషి చేయాలని ఏపీవో కె.సాయిరాం స్పష్టం చేశారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి, పనుల ప్రగతిపై కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, మండలంలోని అన్ని గ్రామ పంచాతీలతో పాటు ఆవాస ప్రాంతాల్లో కూడా ఉపాధి పనులు విస్తృతంగా కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా 100 రోజుల ఉపాధి లక్ష్య సాధనపై ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పని ప్రదేశాల్లో శ్రామికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, నీడ సౌకర్యం, ప్రాథమిక చికిత్స వంటి కనీస వసతులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు శ్రామికులతో ఎల్లప్పుడూ సమీపంలో ఉండి పనులను సమర్ధ వంతంగా నిర్వహించేలా చూడాలని, తద్వారా ప్రతి శ్రామికుడికి రోజుకు రూ.300 వరకు వేతనం వచ్చేలా పనులు కల్పించాలని ఆదేశించారు. పనుల అమలులో నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో జూనియర్ ఇంజనీర్ హరినారాయణ, టీఏఎస్, సీసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులు స్వాధీనం చేసుకొని బాధితులకు పంపిణీ చేయాలి

**– బినామీ పేర్లతో ఏడున్నరకోట్లు సంపాదించిన సంస్థ – 32 లక్షల మంది లబ్దిదారులను మోసం చేసిన వైనం**

**– 8 రాష్ట్రాల్లో అగ్రిగోల్డ్ బాధితులు – అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాల**



**రామభద్రపురం, ఫిబ్రవరి 24 (మేజర్ న్యూస్) :** భారతదేశ చరిత్రలోనే కోట్లాది రూపాయలను వసూళుచేసి 8 రాష్ట్రాల్లో ఏజెంట్ల ద్వారా బాధితులను మోసం చేసిన అగ్రిగోల్డ్ కంపెనీ ఆసు లను ప్రభుత్వం స్వాధీనం చేసుకో వాలని అగ్రిగోల్డ్ కష్టమర్లు, ఏజెంట్ల సంక్షేమ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు ముప్పాల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని ఆరికతోట గ్రామంలో ఉన్న అగ్రిగోల్డ్ భూములను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 8 రాష్ట్రాల్లో 32 లక్షల మంది పేద ప్రజల నుంచి ఏడున్నర కోట్ల రూపాయలు డిపాజిట్లుగా సేకరించి ఎర్రచందనం, సుభాబుల్, రియల్ ఎస్టేట్, థర్మల్ ప్లాంట్లు, ఆయిల్ మిల్స్ వంటి 285 రకాల కంపెనీలను స్థాపిస్తామని చెప్పి ఈ అగ్రిగోల్డ్ మోసాలకు పాల్పడిందని తెలిపారు. ముందుగా ఈ అమాయక ప్రజలకు సుమారు 700 కోట్ల రూపాయల బాండ్లు ఇచ్చి మొదటి విడతగా రూ.5 లక్షలు ఒక్కొక్కరికి ఇస్తామని ఆశ చూపి మోసం చేశారని తెలిపారు. ఈ మోసాలను గుర్తించిన బాధితులు అగ్రిగోల్డ్ 2015, జూన్ 4న కేసులు పెట్టడంతో ఈ సంస్థ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుక న్నారు. అప్పటి నుంచి బాధితులు పోరాటాలు చేస్తున్నా ఇప్పటికీ ఫలితం లేకపోయిందని తెలిపారు. సుమారు 600 మంది డిపాజిటర్లు, ఏజెంట్లు ఆత్మహత్య చేసుకున్నారని, అయినప్పటికీ ప్రభుత్వాలు స్పందించకపోవడం దారుణమని ఆరోపించారు. 1995లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలో 142 మంది లబ్దిదారులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించారు. ఆ తరువాత పట్టించుకోకపోవడంతో బాధితుల ఇబ్బందులు వర్ణణాతీతమని అన్నారు. కోర్టులను అడ్డుపెట్టుకొని అగ్రిగోల్డ్ సంస్థ ఇన్నాళు బాధితులను మోసం చేసిందని తెలిపారు. ఈ అగ్రిగోల్డ్ సంస్థపై రాష్ట్రవ్యాప్తంగా 400 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం దీనిపై నియమించిన సీఐడీకి ఎక్కువ మంది అధికారులను నియమించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆస్తులను స్వాధీనం చేసుకొని ఆ ఆస్తులను విక్రయించి బాధితులకు పంపిణీ చేయాలని ఆయన కోరారు. ఆరికతోట గ్రామంలో ఈ అగ్రిగోల్డ్కు సుమారు రూ.20 కోట్లు ఆస్తులు ఉన్నాయని ఆయన తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో దీనిపై ప్రభుత్వం ఒక ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ అగ్రిగోల్డ్ మోసాలపై మం త్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు స్పందించాలని కోరారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే మార్చి 2 నుంచి రిలే నిరాహారదీక్షలు, 5 నుంచి నిరవధిక నిరాహారదీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అగ్రిగోల్డ్ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఈ.వి.నాయుడు, అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి వి. తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అరేలమ్మ, పార్వతిపురం మన్యం సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్విఎస్.కుమార్ పాల్గొన్నారు.

# అకాల వర్షం. అపార నష్టం?

## – నేలకొరిగిన మొక్కజొన్న







**దత్తిరాజేరు (మేజర్ న్యూస్) :** మండలంలో బుధవారం సాయింత్రం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. పలు గ్రామాలలో మొక్కజొన్న పంట నేలకొరిగింది. మండలంలో పోరలి సచివాలయం పరిధిలో సుమారు 60 ఎకరాల వరకు మొక్కజొన్న నేలమట్టం అయింది. ప్రస్తుతం మొక్కజొన్న కంకి దశలో ఉండడం పంట నేలమట్టం అవడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాలలో ఎండబెట్టిన అపరాల పంట తడిసిసి మద్దయ్యాయి. ఈదురుగాలి ప్రభావంతో మరడాం పంచాయతీ పరిధిలో మర్రి వలస గ్రామంలో తాటి చెట్టు పడడంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పంట నష్టాన్ని అంచనా వేసి తక్షణ పరిహారం అందించాలని రైతుల కోరుతున్నారు.

# టీబీ వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలి

## – వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ టీబీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్



**రామభద్రపురం, ఫిబ్రవరి 25(మేజర్ న్యూస్) :** టీబీ వ్యాధిపై ప్రజలను అప్రమత్తం చేయాలని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ టీబీ కన్సల్టెంట్ డాక్టర్ ప్రశాంత్ కోరారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం టీబీ వ్యాధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ లెవెల్లో టీబీ కంట్రోలకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో అని ఆరా తీశారు. టీబీ వ్యాధి గ్రస్థులకు మందులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. నిక్షయ పోషణ కింద టీబీ వ్యాధిగ్రస్థులకు ఆర్థిక సహాయం, ఇతర కార్యక్రమాలపై ఆరా తీశారు. అలాగే స్థానిక పీహెచ్సీలో ల్యాబ్, ఓపి, మెడిసిన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 16 మంది టీబీ వ్యాధిగ్రస్థులు ఉన్నారని, వారికి ప్రతినెలా సక్రమంగా మ ందులు, ఇతర కార్యక్రమాలు అందిస్తున్నామని పీహెచ్సీ వైద్యాధికారి లక్ష్మీ తెలిపారు. అలాగే టీబీ ట్రీట్మెంట్ ఫీల్డ్ లెవెల్లో ఏవిధంగా అందుతోందో అడిగి తెలుసుకున్నారు. ఈ టీబీ వ్యాధిని కంట్రోల్ చేయడానికి అవసరమైన సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ టీం ఏపీవో రవీంద్ర, డీపీఎస్ నాగరాజు, డాక్టర్ దిలీప్ కుమార్, ఎస్టీఎల్ఎస్ బలరాం నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలి

## ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ పి.చంద్రశేఖర్



**నెల్లిమర్ల, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్యనందించాలని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి చంద్రశేఖర్ కోరారు. నెల్లిమర్ల పట్టణంలోని మహారాజా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(మిమ్స్)ను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా ప్రొఫెసర్లు, అసోసియేట్ లు, అసిస్టెంట్లు, ట్యూటర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. నిరంతర విద్యారంగ అభివృద్ధి నూతన వైద్య శాస్త్ర, ప్రాక్టీసు మార్గదర్శకాలు, పరిశోధన పద్ధతులు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వినియోగం వంటి అంశాల్లో శిక్షణ తీసుకోవడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వైద్యరంగంలో నిరంతరం జరుగుతున్న మార్పులను అందిపుచ్చుకోవడానికి పరిశోధనలు అవసరమన్నారు. ప్రతి వైద్య కళాశాలలో పరిశోధనా సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. వైద్య విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి ఆధునిక పరిజ్ఞానాన్ని అనుసంధానం చేయడం వల్ల వైద్యసేవలో ఖచ్చితత్వం పెరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వైద్యవిద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని దీనిలో భాగంగా అమరావతిలో 27 ఎకరాలలో హెల్త్ యూనివర్సిటీ నూతన కార్యాలయ భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టారని చెప్పారు. వైద్యులు రోగుల పట్ల కరుణతో మెలగాలని సమాజానికి సేవ చేసేవిధంగా తమ వృత్తిని కొనసాగించాలని సూచించారు. కళాశాలలో బోధనా ప్రమాణాలను పెంచడంతో పాటు, విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. మిమ్స్లో పూర్తి స్థాయిలో అధ్యాపకులు సిబ్బందిని నియమించడంపై ఆయన సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం మిమ్స్ న్యూస్ లెటర్ ని ఆవిష్కరించారు. దీని ద్వారా కళాశాల సమాచారం అధ్యాపకులు, విద్యార్థులకు తెలిజేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో మిమ్స్ డైరెక్టర్ వేణుగోపాల్, ఈసి మెంబర్ జెసి నాయుడు, మిమ్స్ డీన్ లక్ష్మీ కుమార్, మెడికల్ డైరెక్టర్ రఘురాం, మెడికల్ సూపరింటెండెంట్ కెసిపి నాయక్ పాల్గొన్నారు.

# ఘనంగా గోల్డ్ స్టార్ట్ జంక్షన్ శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయ 22వ వార్షికోత్సవ వేడుకలు



**లక్కవరపుకోట ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** మండలంలోని లి గోల్డ్ స్టార్ జంక్షన్ లో వెలసియున్న శ్రీ షిరిడి సాయిబాబా22వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సాయి బాబాకి ప్రత్యేక పూజలు నిర్వహించడం తో పాటు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ పూజ కార్యక్రమం అలాగే అన్న సమారాధనలో ఎల్.కోట ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు పాల్గొన్నారు ఆయనే స్వయంగా భక్తులకు ప్రసాద పంపిని చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బెహరా సంతోష్ కిరణ్ కుమార్, స్థానిక నాయకులు బెహరా వరహాలు బాబు బొజాంకి ఏర్రు నాయుడు, ఆదిరెడ్డి అర్జున్, గ్రామ నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

# సీఎం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్



**చీపురుపల్లి, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి చీపురుపల్లి మండలం రావివలస సమీపంలో పైలపేట వద్ద పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 28న రానున్న నేపథ్యంలో బుధవారం సభా స్థలాన్ని పరిశీలించి, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించి కలెక్టర్ పలు సూచనలు చేసారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లు జరుగుతున్న స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్ ప్రాంగణంలో వేదిక నిర్మాణం, కూర్చోవడానికి ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు, పార్కింగ్ స్థలాలు, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లను సమీక్షించారు. భద్రతా పరమైన చర్యలపై పోలీస్ అధికారులతో చర్చించి, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. వేదిక వద్ద వైద్య శిబిరం, అగ్నిమాపక సదుపాయాలు, విద్యుత్ సరఫరా వంటి అంశాలలో పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని కలెక్టర్ తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో లో జేసీ సేధు మాధవన్, చీపురుపల్లి ఆర్డీవో ప్రమీల గాంధీ, డిఆర్డిఎ పిడి శ్రీనివాస్ పణి, రెవెన్యూ, పోలీసు, మండల అధికారులు, కూటమి పార్టీల నాయకులు కిమిడి రామ మల్లిక్ నాయుడు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత నేత్ర వైద్య శిబిరం



**చీపురుపల్లి ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** మానవీయత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బి వి గోవిందరాజులు, గుడివాడ నారాయణమూర్తి, గ్రామ పెద్దలు సహకారంతో గరివిడి మండలం వెదుళ్ళవలస గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 146 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ఉచిత ఆపరేషన్ కొరకు 42 మంది, కళ్లద్దాల కొరకు 64 మందిని ఎంపిక చేశారు. కంటి శాస్త్ర చికిత్స కోసం 42 మందిని విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించినట్టు గోవిందరాజులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వాటర్ సప్లై అధికారులు అప్రమత్తం



**విజయనగరం కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** శ్రీకాకుళం నగరంలో డయేరియా కేసులు నమోదైన నేపథ్యంలో విజయనగరం నగర పాలక సంస్థ వాటర్ సప్లై అధికారులు అప్రమత్తమయ్యారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పిఎస్ వివి ప్రసాద్ పర్యవేక్షణలో వాటర్ సప్లై డిప్యూటీ ఇంజనీర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ సిబ్బంది పైపులైన్లు లీకులకు మరమ్మతులు చేపడుతున్నారు. నగరంలో అనేక చోట్ల మురుగు నీటి కాలువల్లో మంచినీటి సరఫరా పైపులైన్లు ఉన్నాయి. చాలా చోట్ల లీకులు కూడా ఉన్నాయి. వీటిని గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. నగరంలో 88 వేల ఇళ్లు ఉండగా, 3.04 మంది జనాభా ఉన్నారు. 28, 333 మంచినీటి కుళాయి కనెక్షన్లు ఉన్నాయి . రోజుకు 40 ఎంఎల్డి మంచినీరు అవసరం కాగా ప్రస్తుతం రోజు విడిచి రోజు 26 ఎం ఎల్డి మంచినీటిని సరఫరా చేస్తున్నారు.

# నేటి నుండి జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం

**– సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలి – మన్యం జిల్లా ఐటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ పైల**

**సీతానగరం ఫిబ్రవరి 25 (మేజర్ న్యూస్) :** జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని జనసేన పార్టీ మన్యం జిల్లా ఐటీ కోఆర్డినేటర్ పైల సత్యనారాయణ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు వీరమహిళలతో వర్చువల్ మీటింగ్ ద్వారా పిలుపునిచ్చారు. జనసేన సభ్యత్వ నమోదు కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 5వ విడత క్రియాశీల సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం చేసుకుని పార్టీ సిద్ధాం తాలు, ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోందని, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, కార్యకర్తల భాగస్వామ్యాన్ని క్రమబద్ధీకరించేం దుకు సరికొత్త సభ్యత్వ విధానాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పార్టీలో మూడు రకాల సభ్యత్వ వర్గాలను నిర్ణయించిందన్నారు. జనసేన పార్టీ తన శ్రేణులను మూడు విభాగాలుగా విభజించిందని, మొదటి వారిని ఉద్యమిగా పిలుస్తారన్నారు. వీరు పార్టీపై నమ్మకం, అభిమానంతో ప్రాథమిక సభ్యత్వం తీసుకున్న వారు అయి ఉంటారని చెప్పారు. రెండవ కేటగిరీకి చెందిన వారిని సాధక్ అని పిలుస్తారని, వీరు కేవలం సభ్యులుగానే కాకుండా, పార్టీ సభ్యత్వ నమోదును వేగవంతం చేస్తూ పార్టీ ఆశయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లే క్రియాశీలక పాత్ర పోషిస్తారన్నారు. ఇక మూడవ కేటగిరీలోకి ప్రధాతలు వస్తారని, వీరు పార్టీకి వివిధ రూపాల్లో ఆర్థికంగా లేదా మేధోపరంగా అండగా నిలుస్తూ, నాయకత్వ బాధ్యతలు చేపట్టి పార్టీ బలోపేతానికి కృషి చేయడంలో కీలక పాత్ర పోషిస్తారని చెప్పారు. సభ్యత్వ నమోదుతో అన్ని వర్గాల వారిని, అన్ని రంగాల వారిని కలుసుకొని పార్టీకి దగ్గర చేసే గొప్ప అవకాశమన్నారు. ఈ నెల 26 నుంచి ప్రారంభమయ్యే సభ్యత్వ నమోదును నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో చేపడతామని, దీనికి జన సైనికులు సిద్ధం కావాలన్నారు. ఆసక్తిగల గల పార్టీ శ్రేణులకు నూతనముగా ఎవరికన్నా క్రియ వాలంటీర్ లింక్ కావాలి అంటే నేరుగా నియోజకవర్గ పిఓసి ఆదాడ మోహనరావుకు గాని నేరుగా నన్ను సంప్రదించినచో వాలంటీర్ లింక్ వచ్చేలా చేస్తాం అని చెప్పటం జరిగింది. ఈ సమావేశంలో పలువు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల "పల్లెనిద్ర"

**- పంచాయతీల అభివృద్ధి లక్ష్యంగా ప్రత్యేక అధికారుల పర్యటన - ఎంపీడీవో జి పైడితల్లి, తహసిల్దార్ పాము బాల, ఏవో జ్యోత్స్న - రావుపల్లి సర్పంచ్ బొంతాడ మహేష్**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** గ్రామ పంచాయతీల అభి వృద్ధి లక్ష్యంగా గ్రామ పంచాయతీ లకు నియమించిన ప్రత్యేక అధికా రులు వారికి కేటాయించిన గ్రామ పంచాయతీల్లో మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంను నిర్వహించా రు.గ్రామ పంచాయ తీల అభివృద్దే లక్ష్యంగా గ్రామ పంచా యతీలకు కేటాయించిన ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్న అనంత ‸రం రాత్రి పల్లెనిద్ర చేశారు.ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీ లకు నియమించిన ప్రత్యేక అధికా రులు మంగళవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు.

గరుగుబిల్లి, పెద్దూరు గ్రామాల ప్రత్యేక అధికారి జి పైడితల్లి,రావుపల్లి ప్రత్యేక అధికారి పాము బాల, గిజబ, తోటపల్లి గ్రామ ప్రత్యేక అధికారి గోపి గౌరీశంకర్రావు, కొంకడివరం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి పెడిరెడ్ల అప్పలనాయుడు, ఉల్లిభద్ర ప్రత్యేక అధికారి బడే శ్రీనివాస నాయుడు,దళాయివలస ప్రత్యేక అధికారి మామిడి ఈశ్వరమ్మ, కొత్తూరు ప్రత్యేక అధికారి డి.తేజేశ్వరరావు, సంతోష పురం ప్రత్యేక అధికారి రౌతు లక్ష్మి, ఆధ్వర్యంలో గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవడంతో పాటు సమావేశం నిర్వహించారు. అదే విధంగా శివ్వాం ప్రత్యేక అధి కారి తుమ్మనపల్లి జ్యోత్స్న, గొట్టివలస పంచాయతీ ప్రత్యేక అధికారి తూముల చంద్రశేఖర్, సుంకి ప్రత్యేక అధికారి వంగపండు అఖిల్ నాయుడులు గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలు సుకున్నారు.రావుపల్లిలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు(మహేష్) ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు బంటు అప్పారావు,రంభ శశిభూషణరావు, తిరుపతి భాస్కరరావు,సూరు శ్రీనివాసరావు, నీరస రవికుమార్, అడ్డూరి లలితకుమారి,పువ్వల శిరీష, బొంతల వైకుంఠరావు,ఆర్ రాంజీ, పి.వెంకటలక్ష్మి,ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు నల్ల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు సంత భవనాలు ఏర్పాటు చేయాలి

**ఎస్టి ట్రైబల్ హాస్టల్స్‌లో అదనంగా భచవనాలు ఏర్పాటు చేయాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్**



**సీతానగరం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :** పార్వతీపురం మన్యంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల వసతి సమస్యలు పరిష్క రించడంలో కూటమి ప్రభుత్వం, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తు న్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు హెచ్. సింహాచలం బి. అని వమర్శించారు. మండలం వెంకటాపురం ముఖ్య కార్యకర్తల సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణంలో హాస్టల్స్ సరిపడే భవనాలు లేక రూములు తీసుకుంటూ ఉండే పరిస్థితి, పార్వతీపురం జిల్లాలో ఉంది అన్నారు. ఎస్సీ, బీసీ హాస్టల్స్ సొంత భవనాలు లేవని, ఎస్టీ హాస్టల్స్‌లో అదనంగా భవనాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రధానంగా ఎస్సీ టు హాస్టల్ లో 60 మంది విద్యార్థులు ఉంటున్నారు స్నానం కి ఒకే గది ఉండడంవల్ల అర్ధరాత్రి మూడు గంటల సమయాన నిద్ర లేచి ఇబ్బందులు పడి స్నానాలు చేసే పరిస్థితి ఉందని ఈ మేరకు అక్కడ ఉన్నటువంటి వార్డెన్ అడిగితే మాకు బాత్రూం సరిపోతున్నాయి అని చెప్పేసి అనే పరిస్థితి ఉన్నది వేరే బిల్డింగ్ చూడండి అంటే అధికారులు చూసి మేము ఎక్కడికి వెళ్తామని చెప్పేసి అనే పరిస్థితి అక్కడైతే ఉన్నది, అక్కడ ఉంటున్నటువంటి విద్యార్థులు అక్కడ సమస్య గురించి మాట్లాడితే తిట్టడం మాట్లాడినీయకుండా అణిచివేసే పరిస్థితి ఆ ఎస్సీ టు కాలేజ్ హాస్టల్‌లో ఉంది, ఉన్నత అధికారులు సందర్శించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు, ఎస్టి ట్రైబల్ కాలేజీ హాస్టల్స్ లో బాత్రూం సదుపాయాలు లేవని, కొన్ని సందర్భాల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ రైల్వే ట్రాక్ వైపుకి బయటికి వెళ్లాల్సిన పరిస్థితి ఉందని అన్నారు, అధికారులు తమ దృష్టికి తీసుకొని వీలైనంత త్వరగా బాత్రూములు సమస్యలు పరిష్కారం చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సహాయ కార్యదర్శి టి.అఖిల్, ఏ.గంగారావు, జి.సురేష్ పాల్గొన్నారు.

# నువ్వు పంట సాగుతో మంచి లాభాలు

**- మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్న**
**- రాయిందొరవలసలో నువ్వు సాగుపి మెలుకువలపై శిక్షణ**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** ప్రస్తుత రబీ సీజన్‌లో నువ్వు పంట సాగుతో మంచి లాభాలు అని మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న అన్నారు.మండల పరిధిలోని రాయిందొరవలస గ్రామంలో బుధవారం నువ్వు పంట సాగులో మెలకువలపై రైతులకు శిక్షణా కార్యక్రమమును నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రస్తుతం నువ్వులు పంట పండిస్తున్న రైతులకు తగు సూచనలు సలహాలను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న మాట్లాడుతూ నువ్వు పంట సాగు చేస్తున్న రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు మేరకు పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు.అదే విధముగా భూసార పరీక్ష ఫలితాలు ఆధారంగా రైతులు ఎరువులు వేయాలని తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి వరి తదితర పంటలు పండిస్తున్న రైతులు పురుగు మందులను డ్రోన్ ద్వారా పిచికారి చేసేందుకు అవసరమైన డ్రోన్ లను సిద్ధం చేసామని వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బందితోపాటు రైతులు పాల్గొన్నారు.

# హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

**– మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి**



**గరుగుబిల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** బిసి బాలుర వసతి గృహంలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశిం చిన మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సి ఉందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి పైడితల్లి అన్నారు.మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహమును బుధవారం ఎంపీడీవో పైడితల్లి పరిశీలిం చారు. ఈ సందర్భంగా మెనూ ప్రకారం విద్యార్థులకు వండిన వంటలను పరిశీలించిన అనంతరం వంటలను రుచి చూశారు. అనంతరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.పైడితల్లి మాట్లాడుతూ బీసీ బాలుర వసతి గృహంలో చదువుతున్న విద్యా ర్థులు చక్కగా చదువుకుని మంచి పేరు తీసు కురావాలని పేర్కొన్నారు. వసతిగృహం పరిసరాల్లో పచ్చదనం ఫరిడవిల్లేలా ప్రాంగణంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని హాస్టల్ వార్డెన్ నేరడు బిల్లి శ్రీనువాసరావుకు సూచించారు. వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఈ పరిశీలనలో బీసీ బాలుర వసతి గృహం వార్డెన్ నేరడుబిల్లి శ్రీనువాస రావు పాల్గొన్నారు.

# ఆదాయ వనరులు అభివృద్ధి చేయాలి



**పాలకొండ (మేజర్ న్యూస్) :** ఆదాయ వనరులను పంచాయతీలు సొంతంగా అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ దమలపాటి వెంకట రమణ నాయుడు అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో డిజిటల్ సహాయ కులు, కార్యదర్శులకు బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే అందుబాటులో ఉన్న వనరులను గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని అధికారులకు సూచించారు. పన్నులు చెల్లిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

# యువత రాజకీయ రంగంలో ప్రవేశించాలి!

**– డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ పిలుపు**




**అరకులోయ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** యువత రాజకీయ రంగంలో ప్రవేశించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ పిలుపునిచ్చారు.యువత రాజకీయాల్లోకి రావడం ద్వారా నవ భారత నిర్మాణం సులభతరం అవుతుందని ఆయన పేర్కొన్నారు. యువతలో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విస్తృత స్థాయిలో కృషి చేస్తుందన్నారు.కేంద్ర యువజన సర్వీసులు,క్రీడల మంత్రిత్వశాఖ పరిధిలోని మై భారత్ అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వికాసిత్ భారత్ యూత్ పార్లమెంట్– 2026 అనే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో యూత్ పార్లమెంట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం ఈ ప్రాంతంలోని యువతీ, యువకులకు ఎంతగానో ఉపకరిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల పట్టాసి. చలపతిరావు మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద జిల్లాల్లో ఒకటైన అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం గిరి పుత్రులు అదృష్టంగా భావించాలన్నారు.అరుదుగా నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలను గిరి యువత సద్వినియోగపరుచుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియాకు చెందిన జర్నలిజం స్కూల్ చైర్మన్ ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ మై భారత్ జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్న యూత్ పార్లమెంట్ ను యువత ఉపయోగించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి విజేతలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక అవుతారని ఆయన చెప్పారు.రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన వారంతా జాతీయ పోటీల్లో పాల్గొని అనంతరం యూత్ పార్లమెంటుకు హాజరవుతారని ఆయన వివరించారు. న్యాయవాది,సామాజికవేత్త బి.రామకృష్ణ మాట్లాడుతూ పార్లమెంటరీ వ్యవహారాలపై అవగాహన పెంపొందుతుందని,ఆత్మ విశ్వాసంతో ఈ పోటీలో పాల్గొనాలని యువతకు పిలుపునిచ్చారు.స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ప్రోగ్రాం ఆఫీసర్స్ వై.విజయలక్ష్మి,పి.నాగబాబు, ఎం.అనితకుమారి కార్యక్రమం నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారు.ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఎన్. నాగేశ్వరరావు,బి.రామకృష్ణ, ఎల్.ఎం.ఎస్.గణేష్,ఎస్. వెంకట రమణ,పి.నాగబాబు వ్యవహరించగా,ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ,చింతపల్లి, మర్రిపాలెం,పాడేరు తదితర ప్రాంతాలకు చెందిన యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డబ్బులు కొట్టు - నచ్చిన ప్లేస్ పట్టు

**– వైద్య శాఖలో అక్రమ డెప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలి – ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్**



**హుకుంపేట, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఉమ్మడి అల్లూరి జిల్లా వైద్యాశాఖలో ఇప్పటివరకు చేసిన అక్రమ డెప్యూటేషన్లు రద్దు చేయాలని, సీజనల్ వ్యాదులు ప్రబలకుండా గ్రామిన ప్రాంతాలకు సేవలు విస్తరించాలని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర డిమాండ్ చేసారు. ప్రతి ప్రాధమిక ఆరోగ్య కేంద్రానికి ఇద్దరేసి వైద్యాదికారులను నియమించిందని, పాడేరు డి ఎమ్‌డచ్ వో కృష్ణమూర్తి నాయక్ బాద్యతలు చేపట్టిన కొద్ది రోజులకే తన చేతివాటంతో వైద్యాధికారులు మొదలు, కిందిస్థాయి సిబ్బంది వరకు డెప్యూటేషన్లు కింద వారికి నచ్చిన చోటికి పంపించివేశారని మీడియాకు తెలిపారు.ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసులకు వైద్య సేవలు అందకుండా చేసిన, కృష్ణమూర్తి నాయక్ ను ఆ పదవి నుండి తప్పించి, అతనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాధారణంగానే ప్రతీ డిపార్టమెంట్ లో ఆరోగ్య కారణాల రిత్యానో, ఇతర ప్రత్యేక కారణాల రిత్యానో కొంతమంది డెప్యూటేషన్లు కింద వెళ్తారని, కాని, ఎఎస్సార్ జిల్లా వైద్యశాలలో మాత్రం "డబ్బులు కొట్టు -- నచ్చిన ప్లేస్ పట్టు" అంటూ డిఎండహెచ్వో కృష్ణమూర్తి నాయక్ చేతులు తడిపితేచాలు అవసరం ఉన్నలేకున్నా తాము కోరుకున్న చోటికి ఎక్కడికైనా వెళ్ళవచ్చని నిరుపించారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. విశాఖపట్నం కెజిహెచ్ ట్రైబల్ సెల్లో డాక్టర్ ఉంటుండగానే అదనంగా అనంతగిరి మండలం లొంగుపర్తి, పెదబయలు మండలం గోమంగి, కొయ్యూరు మండలం డౌనూరు ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులను, పాడేరు డిఎండహెచ్వో కార్యాలయపు అదనపు వైద్యాధికారిని జిల్లా ఉన్నతాధికారులకు తెలియకుండా డిప్యుటేషన్లపై పంపించరన్నారు. అలాగే గ్రామ సచివాలయ ఎ.ఎన్.ఎం.లు, ఎం.పి.హెచ్.ఇ.వోలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నిషియన్లు (ాలు), ఆరోగ్య పర్యవేక్షకులు (హెల్త్ సుపర్వైజర్లు)లను వారు కోరినచోటికి పంపించారన్నారు. అలాగే, ఇటివలే కోర్టు ఆదేశాలతో ఎజెన్సికి వచ్చిన 18 మంది హెల్త్ అసిస్టంట్లను జిల్లా ఉన్నత అధికారులకు తెలియజేయకుండా మైదాన ప్రాంతాలకు పంపించి ఎజెన్సిలో వైద్య వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నరన్నారు. జి మాడుగుల మండలం గెమ్మెలి పి.హెచ్.సి లో ముగ్గురు హెల్త్ అసిస్టెంట్లు ప్రభుత్వం పంపిస్తే, డిఎండహెచ్వో అదే రోజు తిప్పి పంపించివేశారని మండిపడ్డారు. సాధారణగా ఒక ప్రభుత్వ ఉద్యోగిని డిప్యుటేషన్ పై పంపించేతప్పుడు అక్కడ పని నష్టం (వర్క్ లాస్) కాకుండా జాగ్రత్తలు తిసుకుంటారని, కాని, పాడేరు డిఎండహెచ్వో మాత్రం అవేమి పట్టించుకోరన్నారు. ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలో సిబ్బంది పరిస్థి (స్టాఫ్ పోసిషన్) ఎలాఉందో ఆ ఆసుపత్రిలో పనిచేస్తున్న మెడికల్ అఫిసర్లను అడగకుండానే నేరుగా డిఎండహెచ్వో ఆఫీసులో డిప్యుటేషన్ ఆర్డర్స్ రెడీ అవుతుందని, వారిని రిలీవ్ చేయని మెడికల్ అఫిసర్లపై డిఎండహెచ్వో తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ?పాడేరు డిఎండహెచ్వో అక్రమ డిప్యుటేషన్లు, అవినీతి వ్యవహారలపై, అలాగే తన మిత్రుడు లక్ష్మీపురం పీహెచ్ (ఎటపాక) మెడికల్ ఆఫీసర్ మురళికృష్ణలు కలిసి ఆ శాఖలో పనిచేస్తున్న మహిళా సిబ్బందిని, వారి బంధువులను వేదింపులకు గురిచేస్తున్న ఫోన్ కాల్కి కార్డులను ఎఎస్సార్, పోలవరం జిల్లాల కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్ కి అందజేసామన్నారు. అయితే లక్ష్మీపురం మెడికల్ ఆఫీసర్ మురళికృష్ణ తన వేదింపులు ఆపకపోగా, మరింత పెచ్చురిల్లుతుందన్నారు. వీరిపై కలెక్టర్ స్థాయిలో చర్యలు చేపట్టకపోతే, ఆ పై అధికారుల దృష్టికి తిసుకేల్లడంతోపాటు ప్రత్యక్ష ఉద్యమానికి సిద్దమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆదివాసి జెఏసి మీడియా ప్రతినిది మనుగురి బాబుజీ పాల్గొన్నారు.

## వమ్మవరం లో సిసి రోడ్డు పనులు ప్రారంభం



**రావికమతం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** రావికమతం మండలం వమ్మవరం లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎంపీటీసీ బంటు శ్రీను బుధవారం ప్రారంభించారు. పల్లె వెలుగు -2 కార్యక్రమంలో భాగంగా వమ్మవరం అంగన్వాడి కేంద్రం నుంచి మహాకార పాలెం రోడ్డు వరకు 680 మీటర్లు పొడవు ఉన్న రోడ్డు సీసీ రోడ్డుగా అభివృద్ధికి 25 లక్షల రూపాయలు నిధులు మంజూరు అయ్యాయి. ఈ నిదురితో చేపట్టి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇ మట్టి రోడ్డు వలన వర్షాకాలంలో గ్రామస్తులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే ఇబ్బందిగా ఉందని ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు దృష్టికి తీసుకెళ్లమన్నారు. దీనికి స్పందించిన ఆయన ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేయించారని తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకారాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్రాజుకు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షుడు కోమటి శంకర్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏ.ఎం.ఏ.ఎల్.కళాశాలలో ఏయూ బాలుర సెంటినరీ ఖో ఖో పోటీలు




ఆంధ్ర విశ్వవిద్యాలయం 100 సంవత్సరాల పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెంటినరీ ఉత్సవాలలో భాగంగా ఏయూ ఖో ఖో పురుషుల పోటీలు 26వ తేదీన ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో జరగనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ గల్లా జయబాబు తెలిపారు. ఈ పోటీలలో సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనవచ్చునని, పోటీలకు ముఖ్యఅతిథిలుగా ప్రొఫెసర్ ఎన్.విజయ మోహన్, డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ప్రొఫెసర్ ఎ. పల్లవి, హెడ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ వారు హాజరవుతున్నారని అన్నారు. అంతేకాక ఈ పోటీల ప్రారంభోత్సవానికి కళాశాల అధ్యక్షులు శ్రీధరాల కృష్ణ పేర్రాజు, కరస్పాండెంట్ పెంటకోట వెంకట రామారావు( శ్రీను), జి.బి. మెంబర్స్, స్టాఫ్ హాజరవుతున్నారని తెలిపారు.

## క్రికెట్ సీజన్ ప్రయాణాలపై ఎయిర్ బిఎన్ బి డేటా వెల్లడి

**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** భారతదేశం యొక్క రాబోయే క్రికెట్ సీజన్ దేశీయ ప్రయాణాలలో చెప్పుకోతగ్గ వృద్ధికి దారితీస్తోంది. ప్రముఖ ఆన్ లైన్ ట్రావెల్ మార్కెటింగ్ ఏజెన్సీ ఎయిర్ బిఎన్ బి డేటా వెల్లడించే దాని ప్రకారం క్రికెట్ మ్యాచ్ లు జరిగే నగరాల్లో, ముఖ్యంగా మెట్రో హబ్‌లకు మించి డిమాండ్ అంతటా శోధనలు మరియు బుకింగ్‌లలో సంవత్సరానికి గణనీయమైన వృద్ధిని చూపుతోందని ఎయిర్ బీ ఎన్ బీ కంట్రీ హెడ్ అమన్‌ప్రీత్ సింగ్ బజాజ్ చెప్పారు. మెట్రోలకు మించి డిమాండ్ మారుతుంది ఫిబ్రవరి మరియు మే మధ్య కాలంలో భారీ టోర్నమెంట్లు జరుగుతున్నందున, రాంచీ, తిరువనంతపురం, జైపూర్, లక్నో వంటి అభివృద్ధి చెందుతున్న క్రికెట్ కేంద్రాలలో యాత్రికుల డిమాండ్ పెరుగుతోందన్నారు. ఇది ప్రధాన క్రీడా క్షణాలు భారతదేశ పర్యాటక పటాన్ని ఎలా పునర్నిర్మిస్తున్నాయో సూచిస్తుందన్నారు. ఎయిర్ బీ ఎన్ బీ అంతర్గత డేటా ప్రకారం, క్రికెట్ సీజన్‌లో అనేక మ్యాచ్ హోస్టింగ్ నగరాల కోసం భారతీయ యాత్రికుల శోధనలు గత సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే గణనీయంగా పెరిగాయన్నారు.

## ఉగాది కల్లా గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

**మునగపాక, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ప్రధానమంత్రి ఆవాస యోజన పథకంలో మంజూరైన గృహ నిర్మాణ లబ్ధిదారులు ఉగాది కల్లా పూర్తిచేసి, పేమెంట్లు పొందవలెనని ఎంపీడీవో ఎం ఉషారాణి, హౌసింగ్ ఏఈ కే మురళీకృష్ణ తెలిపారు, హౌసింగ్ ఏఈ కే మురళి మాట్లాడుతూ మండలంలో 1093 హౌసింగ్ లోన్లు మంజూరు అవ్వగా 714 మంది పూర్తి చేసి, ఇంకా మిగిలి ఉన్న 179 ఉన్నారని అన్నారు బేస్ మెంట్ల వరకు 179, నింటల్ వరకు 12, రూమ్ లెవెల్ 34, స్లాబు ప్లాస్టింగు=5 మంది బాలన్స్ ఉన్నారని త్వరగా పూర్తిచేసి, పేమెంట్ పొంది, ఉగాది కల్లా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఏ ఈ కె మురళీకృష్ణ తెలిపారు, పిఎంఏవై =1,80,000/ లోను ఉండేదని, ఇప్పుడు ప్రభుత్వం ఎస్సీ బీసీలకు 50,000, ఎస్టిలకు, 75000, లోన్ పెంచిందని, దీనిని లబ్ధిదారులు గుర్తించి పూర్తి చేస్తారని, ఎంపీడీవో ఏం ఉషారాణి, హౌసింగ్ ఏఈ కె మురళీకృష్ణ తెలిపారు



## చర్మ సంరక్షణ పై గీతం ఆసుపత్రి ప్రత్యేక శిబిరం



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** గీతం ఆసుపత్రి (జిమ్‌సర్) డెర్మటాలజి విభాగం ఆధ్వర్యంలో బుధవారం చర్మ సంరక్షణ పై నిర్వహించిన ప్రత్యేక వైద్య శిభిరానికి అనుహ్య స్పందన లభించింది. వివిధ వయస్సులకు చెందిన4 దాదాపు 400 మంది ఈ శిభిరానికి హజరయ్యారు. ఆరోగ్యవంతమైన చర్మ సౌందర్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలతో పాటు వివిధ రకాల చర్మ వ్యాధులపై వైద్య నిపుణులు అవగాహన కలిగించారు. గీతం డెర్మటాలజి విభాగంలో అందిస్తున్న లేజర్ చికిత్సలు, మైక్రోనీడిలింగ్ రేడియో ఫ్రీక్వెన్సీ పరీక్షలతో పాటు అవాంఛిత రోమాలను తొలగించడం, వివిధ రకాల మచ్చలు మరియు మచ్చల చర్మాన్ని బాగు చేయడం వంటి చికిత్సలను అందించారు. చర్మాన్ని సంరక్షించుకునే పద్దతులను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్య నిపుణులను జిమ్‌సర్ ప్రోవైస్ ఛాన్సలర్ డాక్టర్ బి.గీతాంజలి అభినందించారు.

## ఏయూ పురుషుల బాక్సింగ్ జట్టు ఎంపిక



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆంధ్రవిశ్వవిద్యాలయం పురుషుల బాక్సింగ్ జట్టు ఎంపిక జరిగింది. కురుక్షేత్ర యూనివర్శిటిలో మార్చి 2 నుంచి 7వరకు ఆల్ ఇండియా యూనివర్శిటి బాక్సింగ్ పోటీలు జరుగుతాయని ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆచార్య ఎన్. విజయమోహన్ తెలిపారు. ఈసందర్భంగా బాక్సింగ్ పురుషుల యూనివర్శిటి జట్టును అభినందించారు. ఏయూ వ్యాయామ విద్యావిభాగం హెడ్ ఆచార్య ఎ. పల్లవి మాట్లాడుతూ బాక్సింగ్ పురుషుల జట్టు పతకాలు సాదించి వర్శిటికి మంచి పేరు తేవాలన్నారు. బాక్సింగ్ కోచ్ బీమలింగేశ్వరరావు, ఫాకల్టీ ఉదయ్, బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## నేడు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**అరకులోయ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** అరకులోయ మండలం, పద్మాపురం మేజర్ పంచాయతీ, ఎండపల్లివలస ఈస్ట్ కోస్ట్ రైల్వే హెల్త్ యూనిట్ ప్రాంగణంలో ఈనెల 26వ తేదీ గురువారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్టు విశాఖ మహానగరం, ఆరిలోవ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ పిఆర్‌ఓ ఆనంద్ కుమార్ తెలిపారు. విశాఖ మహానగరం నుంచి ఆయన ఫోనులో విలేకరులతో బుధవారం మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఉచితంగా వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో విశాఖ మహానగరంలోని ఆరిలోవ మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని నిర్వహించ తలపెట్టిందన్నారు. ఈ ఉచిత శిబిరంలో రక్తపోటు,ఎలక్ట్ కార్డియో గ్రామ్,పాప్ స్మియర్ పరీక్షలు మహిళలకు మాత్రమే నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తూర్పు తీర రైల్వే ప్రిన్సిపాల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ వి.కన్నన్ హాజరవుతున్నారని, కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వెంకట సాంబశివరావు రోగులను పరీక్షిస్తారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఈ ఉచిత శిబిరాన్ని గిరిజన ప్రాంతవాసులు సద్వినియోగపరచుకోవాలని పిఆర్‌ఓ ఆనంద్ కుమార్ కోరారు.

# అంగరంగ వైభవంగా వాసుపల్లి వారి పెళ్లి సందడి

- ఒక్కటైనా వాసుపల్లి సాకేత్, శ్రావణిల జంట
- రాజకీయాలకతీతంగా తరలివచ్చిన నేతలు
- జిల్లా కలెక్టర్, కమిషనర్ తో సహా పలువురి ప్రముఖులు హాజరు..
- పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు
- మంచి మనసుతో ఆశీర్వాదం
- ఉత్సాహ వాతావరణంలో ఇందిరా ప్రియదర్శిని స్టేడియం



అతిరథ మహారధులు తరలివచ్చారు. నాయకుల నుంచి కార్యకర్తల వరకు అభిమానుల నుంచి ప్రజలు వరకు తరలివచ్చి తమ అభిమానాన్ని చూపించి, నూతన వధూవరులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. తమ ప్రియతమ నాయకుడు, పేదల పెన్నిధి, అందరికీ ఆప్తులు, నిస్వార్థ సేవకుడు , విశాఖ దక్షిణ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ రెండో కుమారుడు వివాహ రిసెప్షన్ కన్నుల పండువుగా జరిగింది. ఈ పండుగకు వెలంపేట లో గల జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వేదిక అయింది. మంగళవారం రిసెప్షన్ కాగా బుధవారం ఉదయం 10.11 నిమిషాల ముహూర్తాన ఆ జంట ఒకటయ్యారు. స్పీకర్ తో సహా రాజకీయాలకు అతీతంగా పలువురు ఎంపీలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ఉన్నతాధికారులు, అధికారులు వివాహ వేడుకలకు హాజరయ్యారు తదితర పెద్దలతో సహా జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ తదితర ప్రముఖులు హాజరై దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు. ముందుగా జరిగిన రిసెప్షన్ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పలు రకాల ఉత్తరాది, దక్షిణ వంటకాలతో ఏర్పాటు చేసిన విందు అందరిని కనువిందు చేసింది. వాసుపల్లి గణేష్ కుమార్ స్వయంగా తన కుమారుడి వివాహానికి హాజరు కావాలంటూ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, మీడియా ప్రతినిధులకు, మీడియా సంస్థలకు ఆహ్వానాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు వివిఐపీలు, వీఐపీలు, పలు రాజకీయ పార్టీల నాయకులు, వైసిపి శ్రేణులు పాల్గొనడం జరిగింది. వచ్చిన ప్రతి ఒక్కరూ పెద్ద మనసుతో నూతన వధూవరులను మనసారా ఆశీర్వదించడం జరిగింది. దీంతో వేదిక వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఉత్సాహ వాతావరణంలో ఈ కార్యక్రమం ఆద్యంతం జరిగింది. తన కుమారుని రిసెప్షన్, వివాహ వేడుకలకు కు హాజరై మంచి మనసుతో ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సైన్స్ బోధనపై గీతంలో పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ



**విశాఖ ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** దేశం గర్వించ తగ్గ శాస్త్రవేత్తలు తయారు కావాలంటే విద్యార్ధి దశలోనే అందుకు తగ్గ స్ఫూర్తి, ప్రేరణ అవసరమని భావించి భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగంలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ టెక్నాలజి కమ్యూనికేషన్ (ఎన్‌సిఎస్‌టిసి) విశాఖలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ద్వారా నగరంలోని పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక వర్క్‌షాప్ ద్వారా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. విద్యార్థులలో నూతన ఆలోచనలను రేకెత్తించే విధంగా సైన్స్ ప్రయోగాలను ప్రభుత్వ పాఠశాలలలో ఆసక్తి కరంగా చేసి చూపించడానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం "లెట్ అజ్ డు సైన్స" పేరిట ఈ ప్రాజెక్టును అమలు చేస్తోంది. భౌతిక, జీవ శాస్త్రాలతో పాటు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ వంటి అంశాలలో ఆసక్తి కరమైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల జాబితాను రూపొందించి ఉపాధ్యాయులకు తరగతి గదిలో చిన్న, చిన్న శాస్త్ర ప్రయోగాలను విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేలా ఎలా బోధించాలో శిక్షణ ఇచ్చారు. నగరంలోని డైట్‌తో పాటు రామకృష్ణ పాఠశాల, కంద్రీయ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భారతి పాఠశాల, శ్రీధర్శన్ పాఠశాల, డాక్టర్ సి.ఆర్.రెడ్డి కళాశాల నుంచి 70 ఉపాధ్యాయులకు భౌతిక శాస్త్రంలో, మరో 60 మంది ఉపాధ్యాయులకు జీవ శాస్త్రంలో శిక్షణ అందించినట్లు ప్రాజెక్టు బృందానికి నేతృత్వం వహించిన గీతం భౌతిక శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ బి.స్పందన తెలిపారు. విద్యా శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి.విజయ భాస్కర్, సమగ్ర శిక్షా కోఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావులతో పాటు గీతం స్కూల్ ఆఫ్ సైన్స్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లు పాల్గొని ఉపాధ్యాయులకు భౌతిక, జీవ శాస్త్రాలలో నూతన అంశాలపై అవగాహన కలిగించారు.

# సెంట్రల్ జైలు లో శిక్షణా తరగతులు ప్రారంభం






**ఆరిలోవ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** భారత ప్రభుత్వానికి చెందిన బ్యూరో అఫ్ పోలీస్ రీసెర్చ్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో "కారాగార పరిపాలనలో నాయకత్వం" అనే అంశంపై మూడు (03) రోజుల శిక్షణ ఈనెల 25 నుండి 27 వరకు విశాఖపట్నంలోని కేంద్రకారాగారము లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం కోర్స్ డైరెక్టర్ గా శ్రీ యం. మహేష్ బాబు, పర్యవేక్షణాధికారి , కేంద్రకారాగారము, విశాఖపట్నం వారి మార్గదర్శకత్వంలో నిర్వహించబడుతుందని తెలిపారు. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్. ఎం . వి . ఆర్. రాజు , ప్రిన్సిపల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంధ్ర యూనివర్సిటీ డాక్టర్ హ్యాపీ పాల్, అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ మెంట్, ఐ.ఐ.ఎం. విశాఖపట్నం మరియు డాక్టర్. ఎం .వి . అనురాధ, అసోసియేట్ ప్రొఫెసర్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్ మెంట్, ఐ.ఐ.ఎం, విశాఖపట్నం వారు వనరులగా ఉపన్యాసలు ఇచ్చి నాయకత్వం మరియు పరిపాలనా నైపుణ్యాలపై విలువైన సూచనలు చేశారు. ఈ శిక్షణ కార్యక్రమం కారాగార అధికారులలో నాయకత్వ నైపుణ్యాలను బలోపేతం చేయడం మరియు సవరణాత్మక పరిపాలనలో వృత్తి నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా నిర్వహించబడుతోంది. రాష్ట్రంలోని వివిధ జైళ్లతో పాటు ఇతర రాష్ట్రాల జైళ్ల అధికారులూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రఖ్యాత వనరుల వ్యక్తులు మరియు నిపుణులు నాయకత్వం, జైలు సంస్కరణలు, పరిపాలనా విధానాలు మరియు సవరణాత్మక వ్యూహాలపై ఉపన్యాసాలు మరియు పరస్పర చర్చలను నిర్వహిస్తున్నారు.

# ఘనంగా అవతార్ మెహర్ బాబా 132వ జయంతి వేడుకలు

## - ఆధ్యాత్మికతోనే లోక శాంతి సాధ్యం - అవతార్ మెహర్ బాబా మార్గంతో లోకశాంతి - మాజీ ఎంపీపీ గంగుపాం జలజ



**అనకాపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆధ్యాత్మికత, ప్రేమ, సేవలతో లోకశాంతిని పొందవచ్చని భగవాన్ అవతార్ మెహర్ బాబా సూచించారని అనకాపల్లి కేంద్రం నిర్వహాకులు, మాజీ ఎంపీపీ గంగుపాం జలజ అన్నారు. అనకాపల్లి కొత్తూరు జంక్షనులో ఉన్న భగవాన్ అవతార్ మెహర్ బాబా భవనంలో బుధవారం ఆయన 132వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరిలో ప్రేమతత్వం అలవర్చుకోవాలన్నారు. పగలు, ద్వేషాలు, ప్రతీకారాలతో ఇతరుల కంటే మనమే ముందుగా అనారోగ్యం పాలవుతాన్నామన్నారు. చిత్తశుద్ధితో చేసిన ప్రతీ కార్యక్రమానికు అందరి సహాకారం లభిస్తుందన్నారు. తుమ్మపాల కేంద్రం నిర్వహాకులు దంతులూరి మెహర్ బేబీ మాట్లాడుతూ బాబా చూపిన మార్గంతో శాంతి, సౌభాగ్యాలు, ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. ఎవరూ ఎప్పుడూ ఎవరికీ కీడు చేయవద్దని బాబా చెప్పిన మాటలను ఆచరిద్దామన్నారు. కొత్తూరు, తుమ్మపాల, అనకాపల్లి కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ కార్యక్రమం జరిగింది.

# అనాధలకు అండగా నిలిచిన ఐసిడిఎస్ అధికారి మేరీ సువార్త



**నర్సీపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** బుధవారం ఉదయం ఐసిడిఎస్ కార్యాలయానికి వచ్చిన సమాచారం మేరకు ఐసిడిఎస్ అధికారి మేరీ సువార్త స్పందించి అనాధలను అక్కున చేర్చుకొని వారిని విశాఖపట్నంలో గల శక్తి సదన్ లో జాయిన్ చేయడం జరిగిందని డిస్టిక్ మిషన్ కోఆర్డినేటర్ అనకాపల్లి జిల్లా అధికారి మేరీ సువార్త తెలిపారు. బుధవారం ఉదయం వచ్చిన సమాచారం మేరకు తల్లి కుమార్తె గత రెండు సంవత్సరాలుగా ఎటువంటి ఇల్లు గాని వసతులు గాని లేకుండా ప్లాట్ఫారంపై నివసిస్తున్నారని సమాచారం అందడంతో ఐసిడిఎస్ అధికారి మేరీ సువార్త తక్షణమే స్పందించి వృద్ధులు ఇద్దరికీ కౌన్సిలింగ్ ఇచ్చి పోలీస్ సోషల్ వర్కర్స్ సహాయం తీసుకొని తల్లి కుమార్తెకు శరణాలయంలో జాయిన్ చేసినట్లు తెలిపారు. వీరిలో కేసు వర్కర్ సరస్వతి. సోషల్ వర్కర్ మంగా. సెక్యూరిటీ వెంకటేశ్వరరావు. పోలీసు లక్ష్మి సహాయంగా నిలిచారు.

# జనన, మరణ నమోదులో పలు నియమాలు

## - జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** జనన-మరణాల నమోదు చట్టం 1969 యొక్క సెక్షన్ 30 ద్వారా ప్రదతమైన అధికారాలను వినియోగించి కేంద్ర ప్రభుత్వం అనుమతితో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 1999 నాటి ఆంధ్రప్రదేశ్ జనన - మరణాల నమోదు నియమాలను రద్దుచేసి 2025 జనన మరియు మరణాల నమోదు నియమాలు. ఆంధ్రప్రదేశ్ గజిట్ నోటిఫికేషన్ ప్రచురణ ద్వారా ఈ నెల 17నుండి పలు నియమాలు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జనన, మరణాల నమోదు నిమిత్తం అమల్లోకి వచ్చిందని, కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ,జనన మరణ ప్రిన్సిపల్ రిజిస్టర్ డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం పొందుపరిచిన నియమాలు కానీ ,జరిగిన జననం/ మరణములు, పుట్టిన /మరణించిన తేదీ నుండి 21 రోజులలో ఉచితంగా నమోదు చేస్తారని, ఇంటి వద్ద కానీ, ఆసుపత్రిలో గాని జరిగిన జనన మరణములు పుట్టిన/ మరణించిన తేదీ నుండి 21 రోజుల నుండి 30 రోజుల్లోపు రూ.25/- ఆలస్య రుసుం చెల్లించి నమోదు చేసుకోవాలని, 30 రోజుల నుండి ఒక సంవత్సరంలోపు రూ. 250/- ఆలస్య రుసుము చెల్లించి నమోదు చేసుకోవచ్చని, ఒక సంవత్సరము తర్వాత రూ. 500/- ఆలస్యం రుసుము చెల్లించి నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. పుట్టిన బిడ్డ జననం నమోదు చేసిన తర్వాత ఒక సంవత్సరంలోపు ఉచితంగా శిశువు పేరును నమోదు చేసుకునే అవకాశం ఉందని, ఒక సంవత్సరం నుండి 15 సంవత్సరాలలోపు రూ. 250/- ఆలస్య రుసుము చెల్లించి శిశువు పేరును నమోదు చేసుకోవచ్చన్నారు. జనన మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయుటకు లేదా లభ్యత లేని ధ్రువపత్రాలు కొరకు జననం మరణం శోధన చేసేందుకు ఒక సంవత్సరమునకు రూ. 50/- చెల్లించి నాన్ అవైలబిలిటీ సర్టిఫికేట్ పొందవచ్చునని, అదనపు సంవత్సరం శోధన చేయుటకు రూ. 25/- రూపాయలు చెల్లించి నాన్ అవైలబిలిటీ సర్టిఫికెట్ పొందవచ్చునని తెలిపారు. ప్రతి జనన లేదా మరణముకు సంబంధించిన ధ్రువపత్రం పొందుటకు జీవీఎంసీ సౌకర్యం కౌంటర్ లో రూ. 50/- చెల్లించి రసీదు తో పాటు సంబంధిత డాక్యుమెంట్లను కూడా జత పరిచి జనన మరణ ధ్రువీకరణ పత్రం పొందవచ్చునని ప్రధాన వైద్యాధికారి తెలిపారు.

# కింజరాపు రామ్మోహన్ నాయుడు సమక్షంలో విశాఖపట్నంలో ప్రత్యేకమైన స్టోర్‌ను ఆవిష్కరించిన లైమ్‌లైట్ డైమండ్స్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** భారతదేశంలో అతిపెద్ద మరియు అత్యంత విశ్వసనీయ ల్యాబ్ గ్రోన్ డైమండ్ ఆభరణాల బ్రాండ్ అయిన లైమ్‌లైట్ ల్యాబ్ గ్రోన్ డైమండ్స్ ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో తన మొదటి ప్రత్యేక స్టోర్‌ను ప్రారంభించింది. ఈ స్టోర్‌ను సంస్థ సహ వ్యవస్థాపకుడు నిరవ్ భట్ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రాంతీయ భాగస్వాములు బి. శ్రీదేవి మరియు బి. విటల్ ప్రసాద్, అలాగే సంస్థ నాయకత్వ బృంద సభ్యులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవానికి గౌరవనీయులైన కేంద్ర పౌర విమానయాన మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కూడా హాజరయ్యారు. సంపత్ ప్లాజా, రామా టాకీస్ మెయిన్ రోడ్ ఎదుట ఏర్పాటు చేసిన ఈ స్టోర్ సంస్థ విస్తరణలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 45కి పైగా నగరాల్లో 50కు పైగా ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్లు మరియు 40కు పైగా షాప్-ఇన్-షాప్ ఫార్మాట్లతో లైమ్‌లైట్ బలమైన రిటైల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. విశాఖపట్నం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో ప్రవేశించడం ద్వారా దక్షిణ భారతదేశంలో తన వృద్ధి వ్యూహాన్ని మరింత బలోపేతం చేస్తోంది. ఈ ఆధునిక రిటైల్ స్టోర్ నాణ్యత, పారదర్శకత మరియు బాధ్యతాయుతమైన విలాసానికి ప్రతీకగా నిలుస్తుంది. టైప్ కేటగిరీకి చెందిన అంతర్జాతీయ ప్రమాణాలతో గుర్తింపు పొందిన ల్యాబ్ గ్రోన్ డైమండ్స్‌తో రూపొందించిన విస్తృత శ్రేణి ఆభరణాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. క్లాసిక్ సోలిటైర్లు, సొగసైన నెక్లెస్‌లు, ఆధునిక చెవిపోగులు, బ్రేస్‌లెట్లు మరియు రోజువారీ ధరించదగిన డిజైన్లు వినియోగదారులను ఆకట్టుకుంటాయి.

# పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చెయ్యాలి

## : జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



**నక్కపల్లి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** నక్కపల్లి మండలం చిన్న బోదుగల్లం గ్రామం కాలనీలో ఉపశమనం మరియు పునరావాసం ( ఆర్ ఙ ఆర్ ) క్రింద మూలపర్ర, పాటిమీద గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కేటాయించిన ప్లాట్లలో జరుగుచున్న ఇళ్ల నిర్మాణ పనులను జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ తో కలిసి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తనిఖీ చేసారు. బుధవారం నక్కపల్లి లో కలెక్టర్ మాట్లాడుతూ ఉపశమనం మరియు పునరావాస కాలనీలో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణయించిన నిర్ణీత సమయంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించాలని ఎ పి ఐ ఐ సి, రెవెన్యూ అధికారులనుఆదేశించారు .ఈ కార్యక్రమం లో అడ్డు రోడ్డు ఆర్డీఓ వి.వి.రమణ, తహసీల్దార్ శ్రీను, ఎ.పి.ఐ.ఐ.సి. జెడ్.ఎమ్. నరసింహారావు,సర్వేయర్ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేలుడు డేటా వృద్ధిని పరిష్కరించడానికి డబ్ల్యు డి ఏ ఐ మెరుగైన పోర్ట్‌ఫోలియోను విస్తరిస్తుంది

**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** వెస్ట్రన్ డిజిటల్ (నాస్డాక్: డబ్ల్యు డి సి) ఇటీవల ప్రపంచంలోనే అత్యధిక 40టి బి అల్ట్రా ఎస్ ఎం ఆర్ తో సహా కొత్త కస్టమర్-కేంద్రీకృత నిల్వ రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించింది. ఈ పి ఎం ఆర్ హెచ్ డి డి, ప్రస్తుతం హైపర్‌స్కేల్ అర్హతలో ఉంది మరియు 2026 రెండవ అర్ధభాగంలో వాల్యూమ్ ఉత్పత్తిని ప్లాన్ చేసింది. 2ఇ బ్యాండ్‌విడ్త్‌ను అందించే హై బ్యాండ్‌విడ్త్ డ్రైవ్ టెక్నాలజీ, 2ఇ ఐ/ఓ పనితీరును అనుమతించే డ్యూయల్ పివోట్ డిజైన్ మరియు 20% తక్కువ శక్తిని ఉపయోగించి పవర్ తో పాటి మెరుగైన హెచ్ డి డి లు వంటి అద్భుతమైన ఆవిష్కరణలను కూడా కంపెనీ ఆవిష్కరించింది. ఇవన్నీ ఏ ఐ పనిభారాల ద్వారా నడిచే పేలుడు డేటా వృద్ధిని పరిష్కరిస్తాయి.పరిశ్రమలలో ఏ ఐ స్వీకరణ వేగవంతం కావడంతో, స్కేలబుల్, ఖర్చు-సమర్థవంతమైన నిల్వ యొక్క డిమాండ్ పెరుగుతూనే ఉంది. డబ్ల్యు డి యొక్క తాజా ఆవిష్కరణలు సామర్థ్యం, పనితీరు, విద్యుత్ సామర్థ్యం మరియు సరళీకృత విస్తరణను ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలకు అంతరాయం కలిగించకుండా పరిష్కరిస్తాయి.

# ఎయులో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలి

**– ముఖ్యమంత్రి జోక్యంతో ప్రశాంత వాతావరణం పునరుద్ధరించాలని డిమాండ్ – వామపక్ష పార్టీలు – 27న కలెక్టరేట్ వద్ద నిరసనకు పిలుపు**

**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆంధ్రా యూనివర్సిటీలో మత వైషమ్యాలను ప్రేరేపించే ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను తక్షణమే అరికట్టాలని వామపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విద్యార్థుల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు అవకాశం ఇవ్వకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జోక్యం చేసుకుని కఠిన చర్యలు తీసుకోవాలని కోరాయి. ఈ అంశంపై ఈనెల 27న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టనున్నట్లు ప్రకటించాయి. పిఠాపురం కాలనీలోని సిపిఎం జిల్లా కార్యాలయం (ఏచూరి భవన్)లో బుధవారం జరిగిన వామపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.రెహ్మాన్, సిపిఐఎంఎల్ (న్యూడెమోక్రసీ), సిఐఎంఎల్ (ప్రజాపోరు), ఎస్‌యుసిఐ నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో మాట్లాడిన నేతలు, ఎయులో మత విద్వేషాలు సృష్టించి విద్యార్థులు, ఆచార్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి అనుబంధ సంఘాల కార్యకర్తలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో లౌకిక విలువలు, మత సామరస్యాన్ని కాపాడాల్సిన





బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, కమ్యూనిస్టులపై విమర్శలు చేయడం ద్వారా రాజకీయ రంగు పులుముతున్నారని అభిప్రాయపడ్డారు. బయట నుంచి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి ప్రవేశించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలపై చర్యలు తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో ఏయు విద్యార్థినులపై అసభ్యకర పోస్టులు, ఫోటోలు, వీడియోలను ప్రచారం చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే శక్తులకు ప్రవేశం లేకుండా యాజమాన్యం కఠిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీలో జెండాలను ధ్వంసం చేసిన ఘటనలపై పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి, ఎయులో ప్రశాంతతను పునరుద్ధరించాలని కోరారు.రౌండ్ టేబుల్ సమావేశ తీర్మానాలు ఎయులో ఆర్‌ఎస్‌ఎస్ మత కార్యకలాపాలు భవిష్యత్‌లో జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. విద్యార్థులపై దాడులకు పాల్పడిన ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి అనుబంధ సంఘాల కార్యకర్తలను తక్షణమే అరెస్టు చేయాలి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకుని మత కార్యకలాపాలకు అవకాశం లేకుండా చూడాలి. ఎయు ప్రశాంతతను పునరుద్ధరించేందుకు కఠిన భద్రతా ఏర్పాట్లు చేయాలి. 2026 యూజీసీ నిబంధనలు అమలు చేసి, సమానత్వ కమిటీలు ఏర్పాటు చేయాలి. ఈ సమావేశంలో సిపిఎం, సిపిఐ తదితర వామపక్ష పార్టీల జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలి



**పెదబయలు, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మండలంలోని డిఆర్డిపోల పరిధిలో ఉన్నా రేషన్ లబ్ధిదారులకు సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని సేల్స్ మేన్ లకు తహశీల్దార్ త్రినాధ రావు ఆదేశించారు. బుధవారం కార్యాలయంలో నెలవారి సమీక్ష సమావేశం నిర్వహించారు మండలం లో గల 39 రేషన్ షాపులు సేల్స్ మేన్స్, డీలర్స్, ఎస్ ఎస్ జి గ్రూప్ సభ్యుల వారితో తహశీల్దార్ సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు 26వ తేదీ నుండి 65 సంవత్సరం వయస్సు గల కార్డు దారులకు ఇంటి వద్ద రేషన్ సరఫరా చేయాలని తహశీల్దార్ సూచించారు. మార్చి నెల కోటా బియ్యం ఒకటవ తేదీ నుండి పంపిణీ చేయాలని తహశీల్దార్ ఆదేశించారు ఈ సమావేశంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ వి పూర్ణయ్య పాల్గొన్నారు .

## అయినాడ – రేవిడి రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన గంటా

**పద్మనాభం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** రూ.3.65 కోట్లతో 11 కిలోమీటర్ల పొడవున అభివృద్ధి చేయనున్న అయినాడ – రేవిడి రోడ్డు పనులకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయినాడ – రేవిడి రోడ్డు వల్ల అయినాడ, బొత్స పేట, బిఆర్ తాళ్లవలస, కోరాడ, మజ్జిపేట, వెంకటాపురం, రేవిడి తదితర ప్రాంత ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెల్లువలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న అనంత పద్మనాభ స్వామి ఆలయం ఘాట్ రోడ్డు నిర్మాణాన్ని, నీళ్ల కుండీలు – రెడ్డిపల్లి రోడ్డు పనులను పూర్తి చేశామని తెలియజేశారు. పాండ్రంగి బ్రిడ్జి పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిపాదించామన్నారు.

**– రేవిడి పబ్లిక్ హెల్త్ యూనిట్ ప్రారంభం**

రేవిడిలో రూ. 50 లక్షలతో నిర్మించిన బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ ను గంటా ప్రారంభించారు. దీని వల్ల రేవిడి పరిసర ప్రాంత ప్రజలకు తక్షణ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాలకు పెద్దపేట వేస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వర రావు, ఇంజనీర్లు జగదీష్, నాయుడు



ఎస్. ఈశ్వరి, డాక్టర్ లీలా ప్రసాద్, విజయ్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురుమిన రామస్వామి నాయుడు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మండల టిడిపి అధ్యక్షులు కోరాడ రమణ, కసిరెడ్డి దామోదరరావు, కాళ్ల నగేష్ కుమార్, కురుమిన లీలావతి, ఆవాల గంగరాజు, మొకర అప్పలనాయుడు, కాళ్ల సత్యనారాయణ, రామరాజు, మజ్జి నందీష్, పొట్నూరు రాము, వాళ్ల నందిని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రం సందర్శించిన జిల్లా వైద్య అధికారి డా. నరేంద్ర సింగ్



**భీమిలి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** నూతనంగా నియమితులైన జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి (డి. సి. హెచ్. ఎస్ ) డా. నరేంద్ర సింగ్ భీమిలి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ప్రజల ఆరోగ్య సేవలు మరింత మెరుగుపడేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు మెరుగైన సేవలు అందించి కాన్పుల సంఖ్య పెంచాలని, అలాగే సాధారణ శస్త్రచికిత్సలను మరింతగా నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. అదనంగా ఎఫ్. ఆర్. ఎస్ హాజరు మరియు (ఏ. బి. డి. ఎం )అమలు విషయాలపై కూడా సిబ్బందికి అవసరమైన సూచనలు తెల్పారు.

## ఏడాదిగా పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్

**– నాన్ బెలబుల్ వారెంట్ ముద్దాయి పట్టివేత**

**– మహారాణిపేటలో పోలీసుల పనితీరుకు సిపి అభినందనలు**



**విశాఖ క్రైం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మహారాణిపేట పోలీసుల చాకచక్యంతో ఏడాదిగా పరారీలో ఉన్న నాన్ బెలబుల్ వారెంట్ ముద్దాయి టేకు బర్ణ బాబును బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడిపై 2016లో క్రైమ్ నంబర్ 146 కింద కేసు నమోదు కాగా, అనంతరం కోర్టు జారీ చేసిన నాన్ బెలబుల్ వారెంట్‌కు స్పందించకుండా గత ఏడాది కాలంగా తప్పించుకుని తిరుగుతున్నాడు. గోప్య సమాచారం మేరకు మహారాణిపేట పోలీసులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా శంఖబ్రత బాగ్చీ, పోలీస్ కమిషనర్, అలాగే డీసీపీ మహారాణిపేట పోలీసు సిబ్బంది ని అభినందించారు. పరారీలో ఉన్న వారిని గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం ద్వారా ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నారని ప్రశంసించారు. అరెస్టు చర్యలో హెడ్ కానిస్టేబుల్ శ్రీను, కానిస్టేబుల్ నాగేంద్ర కీలక పాత్ర పోషించారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించారు.

## మినిమమ్ టైమ్ స్కెల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి..




**డుంబ్రిగుడ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** 25మినిమమ్ టైమ్ స్కెల్ ఉపాధ్యాయులు 1998లో డిఎస్సీలో సెలక్ట్ అయ్యారు.అయితే కొన్ని కారణాలు వల్ల కొన్ని సంవత్సరాలు నిరీక్షణ తర్వాత జగన్ ప్రభుత్వంలో వారికి అవకాశం కల్పించి ఎమ్టీఎస్ పేరుతో వారికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అయితే తమకు ఎటువంటి ఉద్యోగ భద్రత కల్పించలేదని,ఎటువంటి ఉద్యోగ బెనిఫిట్స్ లేవని ఆవేదన వ్యక్తం చేస్తూ విజయనగరం జిల్లా జోనల్ ఆర్టీసీ చైర్మన్ ఎస్. దొన్ను దొరకు ఎమ్టీఎస్ ఉపాధ్యాయులు వినతిపత్రం సమర్పించారు.అలాగే అతి తక్కువ వేతనాలతో మైదాన ప్రాంతాల నుండి గిరిజన మారుమూల ప్రాంతాల్లో నియమించారని, అదే విధంగా ఇప్పటికే చాలా మంది పదవీ విరమణ చేసారని, కొంతమంది చనిపోయారని, ఎటువంటి రవాణా సదుపాయం గాని, అలవెన్సు ఇవ్వకుండా ఉద్యోగాలు చేస్తున్నామని వారి సమస్యలు ఆర్టీసీ చైర్మన్కి విన్నవించారు.అదే విధంగా ఉద్యోగం రెగ్యులర్ చేయాలని, పదవీ విరమణ వయసు 62 కి పెంచాలని,పదవీ విరమణ తర్వాత కనీసం పెన్షన్ ఇవ్వాలని,వారు కోరుతూఉమ్మడి జిల్లా ఎమ్టీ ఎస్ అధ్యక్షులు సిరికి సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు నాగేశ్వరావు వినతిపత్రం సమర్పించారు. అందుకు చైర్మన్ స్పందిస్తూ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకొని వెళ్తానని హామీ ఇచ్చారు.

## మెగాస్టార్ చిరంజీవి, నయనతార, వెంకటేష్ నటించిన మన శంకర వరప్రసాద్ గారు

**– వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ఫిబ్రవరి 28న సాయంత్రం 5:30 గంటలకు.. – మీ జీ తెలుగులో, జీ5లోనూ అందుబాటులో!**




**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మన శంకర వరప్రసాద్ గారు మళ్లీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనుంది. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ హై-ఆక్షన్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేట్రికల్ రన్‌లో భారీ వసూళ్లు సాధించి, విస్తృత ప్రశంసలు అందుకుంది. మన శంకర వరప్రసాద్ గారు గ్రాండ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఫిబ్రవరి 28, శనివారం సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి! ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్బస్టర్గా నిలిచిన మన శంకర వరప్రసాద్ గారు ఫిబ్రవరి 11 నుంచి డిజిటల్ ప్లాట్‌ఫాం జీ5(జుజు5) వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మితా కొణిదెల సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి శంకర వరప్రసాద్ పాత్రలో కనిపించగా, నయనతార, వెంకటేష్ దగ్గుబాటి, కెథరిన్ ట్రెసా, సచిన్ ఖేడేకర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. భీమ్స్ సెసిరోలియో సంగీతం, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్‌తో ఈ సినిమా మరింత ఆకర్షణీయంగా మారింది. హృదయస్పర్శక కుటుంబ భావాలు, నవ్వులు పూయించే కామెడీ, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆత్మీయ ప్రదర్శనలతో అన్ని వయసుల ప్రేక్షకులకు పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీగా నిలిచింది. డిజిటల్ వేదికపై కూడా సెన్సేషన్ సృష్టించిన ఈ చిత్రం జీ5లో సంచలనాత్మకంగా 500 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను సాధించి ప్రేక్షకాదరణను మరింతగా చాటుకుంది. మెగా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ మన శంకర వరప్రసాద్ గారు సినిమాని జీ5, జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూసేయండి.

## భీమిలీలో బెల్ట్ షాపులపై టాస్క్‌ఫోర్స్ ఉక్కుపాదం

**– జేవీ అగ్రహారంలో 32 మద్యం సీసాలు స్వాధీనం , ఒకరు అరెస్ట్**



**భీమిలీ, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** భీమిలీ పరిధిలో అక్రమ మద్యం విక్రయాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. జేవీ అగ్రహారం ప్రాంతంలో బెల్ట్ షాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 32 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, గోప్య సమాచారం మేరకు ప్రత్యేక దాడులు నిర్వహించిన టాస్క్‌ఫోర్స్ బృందం జేవీ అగ్రహారంలో తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా అనుమతి లేకుండా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించి సీసాలను సీజ్ చేశారు. సంబంధిత వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. అక్రమ మద్యం విక్రయాలు సామాజిక సమస్యలకు దారితీస్తాయని, బెల్ట్ షాపులపై ఇలాంటి దాడులు కొనసాగుతాయని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## 42 మందికి హెచ్ఐవి రక్త పరీక్షలు




**ఆనందపురం, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మరియు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్, మొబైల్ ఐసీటీసీ ఆధ్వర్యంలో బోని,మద్ది గ్రామాల్లో హెచ్ఐవి/ఎయిడ్స్ పరీక్షలు నిర్వహించారు. టార్గెట్ ప్రజలను గుర్తించి మొబైల్ ఐసీటీసీ వాహనం ద్వారా గ్రామాల వద్దనే రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా మొబైల్ ఐసీటీసీ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు గర్భం దాల్చిన వెంటనే హెచ్ఐవి పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లి నుంచి శిశువుకు వ్యాధి సంక్రమణను నివారించవచ్చని తెలిపారు. అవసరమైన వారిని గుర్తించి మొత్తం 42 మందికి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్.టి. కె. కిషోర్ కుమార్, లింక్ వర్కర్ ఎం. జ్యోతి, ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎమ్ ఎస్కే భాజ్య, ఎంఎల్‌హెచ్‌వి అనురాధ, జస్వంత్, ఆశా వర్కర్లు వెంకటలక్ష్మి, కొండమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలుయువత దూరంగా ఉండాలి

**- ట్రాఫిక్ ఎస్సై తిరుపతిరావు**




**భీమిలి, ఫిబ్రవరి 25, మేజర్‌న్యూస్:** మారక ద్రవ్యాలకు, గంజాయి కి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ చేపట్టిన జన చైతన్య బైక్ యాత్ర బుధవారం తగరపువలస అంబేద్కర్ కూడలి కిచేరుకుంది. భీమిలి ట్రాఫిక్ ఎస్.ఐ. తిరుపతి రావు ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ మారక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువతను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామని గంజాయి,మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెల్పారు. డి. వై ఎఫ్ .ఐ. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు య.ఎస్.ఎన్.రాజు . కె మహేష్ మాట్లాడుతూ డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాల బారిన పడిన యువత విద్యార్థుల జీవితాలు నాశనం అవుతున్నయి అని తెల్పారు . బిడ్డలపై కోటి ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులకు ఆవేదన మిగులుతుందని పేర్కొన్నారు. ప్రశాంతమైన ఆహ్లాదకరంగా ఉండే ప్రాంతాలు అశాంతికి నిలయాలుగా మారుతున్న అని తెల్పారు . డ్రగ్స్ గంజాయి ని తమ వ్యాపారం గా మార్చుకున్న మాఫియా తమ అక్రమ సంపాదన కోసం యువత విద్యార్థుల జీవితాలను బలి తీసుకుంటున్నారని ఉపద్ఘాటించారు.మట్ట రవి మాట్లాడుతూ యువత విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడాలని విద్యాసంస్థల్లో మత్తుమందులను తరిమికొట్టాలని ఉద్దేశంతో డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలు వద్దు ఆరోగ్యం జీవితం ముద్దు అని చెప్పారు. డివైఎఫ్ఐ జనచైతన్య యాత్ర సభ్యులు అంబేద్కర్ జనక్షన్ నుండి బైపాస్ రోడ్డు వరకు ప్రజలను చైతన్య పరుస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రావణ్ రాము, జి.సూరిబాబు,ఉపేంద్ర, ఈశ్వరరావు,నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టడం ప్రతిఒక్కరి బాధ్యత

**– చట్టం పట్ల పూర్తి అవగాహన కల్పించడంతోనే ఫలితాలు సాధ్యం – విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ – అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ప్రారంభించిన – విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్**




**విశాఖపట్నం, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** బాల్యవివాహాలను అరికట్టి భావితరాల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపైనా వుందని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ పిలుపునిచ్చారు.. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ , అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో బాల్యవివాహాల నిషేధ చట్టం పై అవగహన కోసం ప్రచార రథాన్ని పార్లమెంటు సభ్యులు శ్రీభరత్ తన కార్యాలయం నుంచి ప్రారంభించారు..సంస్థ జిల్లా కోఆర్డినేటర్ జి. డేవిడ్ రాజుతో కలిసి కరపత్రాలను కూడా ఆవిష్కరించారు..ఈ సందర్భంగా విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీ భరత్ మాట్లాడుతూ అప్ హోల్డ్ స్వచ్ఛంద సంస్థ ఇప్పటివరకూ విశాఖ పరిసరప్రాంతాల్లో 32 బాల్య వివాహాలను అరికట్టగలిగిందని అయితే ప్రజల్లో మరింత అగాహన కోసం ఇటు వంటి ప్రచార రథాలు ఉపకరిస్తాయన్నారు....అట్టడుగుస్థాయిలోని ప్రజలను విద్యావంతుల్ని చేయడం,వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచే చర్యలతో ఇటు వంటి సామాజిక రుగ్మతలను అరికట్టవచ్చున్నారు...చట్టం పట్ల ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి బాల్య వివాహాల రహిత భారతదేశమే లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు..ఈ ప్రచార రథం మార్చి 8 మహిళా దినోత్సవం వరకూ ఎంపిక చేసిన హాట్ స్పాట్ లలో ప్రచారం చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

# చిట్టి చేతులతో గట్టి ప్రయోగాలు



**నరసన్నపేట ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** నరసన్నపేట పట్టణంలోని శ్రీ జ్ఞానజ్యోతి పాఠశాలలో వారోత్సవాలను 24వ తేదీ నుండి 28 తేదీ వరకు నిర్వహిస్తున్నారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 24వ తేదీ సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. బుధవారం 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు సైన్స్ ఎక్స్పోను ప్రదర్శించడం జరిగింది. సైన్స్ ఎక్స్పోను లీడ్ ప్రతినిధి కే. కన్నబాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు సుమారు 200 మంది పైగా హాజరై సైన్స్ ప్రదర్శనను తిలకించడం జరిగింది. చిన్నారుల రూపొందించిన బుల్లి ప్రాజెక్టులను, వివిధ రకాల మోడల్స్, సైన్సు మిళితం చేసి రూపొందించిన వివిధ ప్రయోగాలను తిలకించిన తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థులు ప్రయోగ వివరాలను వివరించే విధానం తల్లిదండ్రులను ఆకట్టుకుంది. విద్యార్థుల ఊహాశక్తికి పలువురు తల్లిదండ్రులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సైన్స్ టీచర్స్, మేనేజ్మెంట్ సభ్యులు వి. భాస్కరరావు, బి. రామారావు టి సత్యనారాయణ పి.లక్ష్మీ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# పట్టుదల తో కృషి చేస్తేనే విజయం



**- ఉల్లాసంగా... ఉత్సాహంగా కోడూరు ఉన్నత పాఠశాల వార్షికోత్సవం.**

**పోలాకి ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**పటిష్టమైన ప్రణాళిక, పట్టుదల తో కృషి చేస్తే విద్యార్థులు సులభంగా విజయతీరాలకు చేరుకొగలరని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోడూరు ప్రధానోపాధ్యాయులు జి.శాంతి అన్నారు. పాఠశాల వార్షికోత్సవం, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు గా పాల్గొన్న పైల మల్లేశ్వర రావు, చింతాడ ఉమా మహేశ్వరరావు , కరుకోల దుష్యంత రావు, కిల్లి లక్ష్మణ రావు మాట్లాడుతూ విద్యార్థులు తాము ఉన్న స్థాయి నుండి ఉన్నత స్థాయి కి చేరుకోవడానికి చదువు ఒక్కటే ఆయుధమని అన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు చింతాడ లక్ష్మణరావు, ఎమ్.వేణుగోపాల రావు, ఎమ్.లక్ష్మణ రావు మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో తొలి గమ్యం పదవ తరగతి అని, ప్రతి సబ్జెక్ట్ లో కీలక భావనలు అధ్యయనం చేయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చు నని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన అయి గిరి నందిత, కోలాటం వంటి శాస్త్రీయ నృత్యాలు, ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి వంటి భావోద్వేగ పాటలు, సందేశాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు జి.శాంతి, గ్రామ పెద్దలు పైల లక్ష్మణ రావు, చింతాడ ఉమా మహేశ్వర రావు, కరుకోల దుష్యంత రావు, కిల్లి లక్ష్మణ రావు, విద్యా కమిటీ వైస్ చైర్మన్ పి.సంధ్యా రాణి, సభ్యులు చింతాడ భారతి, పి.స్వాతి, ఉపాధ్యాయులు లక్ష్మణ రావు, మోహిని,వెంకట రమణ, నారాయణ రావు, శ్రీహరి,శాంతి,హేమ లత,జగన్,వేణుగోపాల రావు, బాడాన రాజు, రాజేశ్వర రావు, రఫీ, కళావతి, వసంత రావు, రాంబాబు, సూర్య కుమారి, రమణమ్మ, గణేష్, ధర్మేంద్ర, చంద్రయ్య, రాధ, వేణు బాబు, ఈశ్వర రావు మరియు పరిసర ప్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భామిని మండలం లో వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి



కొత్తూరు ఫిబ్రవరి 25(మేజర్ న్యూస్ ) మన్యం జిల్లా భామిని మండలం లో పలు గ్రామాల్లో జరిగిన వివాహ వేడుకల్లో పాలకొండ నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సతీమణి మాలతి పాల్గొని నూతన దంపతులను అస్వీరదించారు. గజపతి నగరం గ్రామానికి చెందిన విశ్వాసరాయి ప్రహ్లాద దొర కుమారుని వేడుకలు పాల్గొని నూతన దంపతులు గోపా లకృష్ణ తేజాకుమారి లను ఆమె ఆస్వీరదించారు. అదేవిధంగా పసికిడి గ్రామానికి చెందిన బి రవి నాయుడు తాలుక వివాహ రీసప్షన్ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎమ్మెల్యే మామయ్య రామ్మోహనరావు, ఎమ్మెల్యే అత్తగారు పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీమణి వెంట బామిని మండల నేతలు పాల్గొన్నారు.

# డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్,



**శ్రీకాకుళం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :**శ్రీకాకుళం నియోజకవర్గంలో డయేరియా వ్యాధితో బాధపడుతున్న ప్రజలను పరామర్శించేందుకు ఎమ్మెల్యే బుధవారం ఉదయం విస్తృత పర్యటన చేపట్టారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తూ, బాధితులకు ధైర్యం చెప్పారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా పాల్గొని పరిస్థితిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దమ్మలవీధిలోని సిమ్మన హాస్పిటల్, మంగువారి తోట ప్రాంతం, అలాగే రిమ్స్ హాస్పిటల్ను సందర్శించి చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్క రోగి వద్దకు వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటూ, ఎవరూ అధైర్య పడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, వారికి అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు.అదేవిధంగా వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్వయంగా పర్యటిస్తూ ప్రతి వీధిని పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రతి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్లిష్ట సమయంలో ప్రజలు భయపడవద్దని, ప్రభుత్వం ప్రజల పక్షాన నిలబడి అవసరమైన ప్రతి సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్తో కలిసి ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. వ్యాధి నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అదేవిధంగా మున్సిపల్ సిబ్బంది, అధికారులకు ఎమ్మెల్యే కీలక సూచనలు చేశారు. ప్రతి వీధిలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని, డ్రైనేజీ వ్యవస్థను శుభ్రపరచాలని, తాగునీటి సరఫరా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు.బాధితులకు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే స్వయంగా ఆస్పత్రులు, ఇంటింటికీ వెళ్లి బాధితులకు ధైర్యం చెప్పడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల కష్టసమయంలో ప్రజల మధ్యకు వచ్చి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటూ, వెంటనే చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే గొండు శంకర్ చర్యలు ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచాయి. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, వార్డ్ ఇన్చార్జిలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# విద్యుత్ శాఖ అధికారులకు సన్మానం



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 25. మేజర్ న్యూస్:**మెలియాపుట్టి విద్యుత్ శాఖ ఏఈ. శ్రీనివాసరావు కు చేపర గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానం చేశారు. వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖ ఏఈ చాపర గ్రామంలో జామియాత్ర సందర్భంగా ఎల్లమ్మ గుడికి, విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా చేసినందుకు గాను గ్రామస్తులు ఆయనకు, లైన్ మాన్ కు ఘనముగా సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో మజ్జి పోలినాయుడు, పడాల శ్రీను , కార్యదర్శి శ్వేత,జి .తిరుపతిరావు, కే .నాగభూషణం మనోజ్ తదితరులు ఉన్నారు.

# ఆయిల్ ఫామ్ తోటల పెంపకంతో రైతులకు ఆదాయం



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 25. మేజర్ న్యూస్:**ఆయిల్ పామ్ తోటల పెంపకముతో రైతులకు అధికాదాయం చేకూరుతుందని ఉద్యానవన శాఖ అధికారి మంగమ్మ,, ప్రియాంక ,ఆయిల్ ఫామ్ జనరల్ మేనేజర్ వీరబాబు అన్నారు.బుధవారం మెలియాపుట్టి ,హిరమండలం ,కొత్తూరు మండల రైతులకు పాలకొండ చిన్నమంగాపురం లో ఆయిల్ ఫామ్ పంటలు తోటలు చూపించి రైతులకు అవగాహన కల్పించారు.వారు మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంటలతో ఎకరాకు ఖర్చులు పోను లక్ష యాభై వేల రూపాయలు రైతులకు ఆదాయం చేకూరుతుందన్నారు.పంట సాగు చేయు విధానం ,పంటల చీడపీడల గురించి, నీటి యాజమాన్యం గురించి మార్కెట్ సదుపాయం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు మొక్కలు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ఉచితంగా మొక్కలు సరఫరా చేస్తారని తెలిపారు. పంట నాటిన తర్వాత మూడు సంవత్సరాల తరువాత ఆదాయం వస్తుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు షర్మిల ,శరత్ కుమార్ రెడ్డి, దివాకర్ , శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు ,రైతులు పాల్గొన్నారు

# అతిసారంపై అప్రమత్తం.. అవాస్తవాలు నమ్మవద్దు

- **అధికారికంగా ఒకరి మృతి.. రంగంలోకి 50కి పైగా వైద్య బృందాలు**
- **తప్పుదోవ పట్టించే ప్రచారాలు వద్దు: కలెక్టర్ స్వప్నిల్ దినకర్**
- **అతిసారంపై యుద్ధం.. ఇంటింటికీ సచివాలయ సిబ్బంది సర్వే**
- **క్షణక్షణ పర్యవేక్షణ..సాయంత్రానికి రానున్న నీటి నమూనాల నివేదిక**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్** :నగరంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రబలిన అతిసారంపై సామాజిక మాధ్యమాలు, ఇతర మార్గాల్లో వస్తున్న అవాస్తవాలను నమ్మవద్దని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ.. అతిసారం కారణంగా అధికారికంగా ఇప్పటివరకు ఒక్కరు మాత్రమే మృతి చెందినట్లు ధృవీకరించారు. మిగిలిన మరణాలకు గల ఇతర కారణాలను విశ్లేషిస్తున్నామని, పరిస్థితిని ప్రభుత్వం పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తోందని తెలిపారు.తక్షణమే స్పందించాం..నగరంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయన్న సమాచారం అందిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టిందని కలెక్టర్ వెల్లడించారు. మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్ఓలతో కలిసి స్వయంగా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. కేసుల వ్యాప్తిని అరికట్టేందుకు 50కి పైగా వైద్య బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.ఇంటింటి సర్వే.. సాయంత్రానికి ల్యాబ్ రిపోర్ట్వ్యాధి మూలాలను గుర్తించేందుకు సచివాలయ సిబ్బంది, ఆశా/ఏఎన్ఎంలతో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య స్థితిగతులను నమోదు చేస్తున్నాం. బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని ఆయన వివరించారు. కలుషిత నీటిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సేకరించిన నీటి నమూనాల తుది నివేదికలు ఈరోజు సాయంత్రానికి అందుబాటులోకి వస్తాయని, ఆ తర్వాత పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు. ప్రజలు భయాందోళనలకు గురికావద్దని, కేవలం కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగుతూ అధికారులకు సహకరించాలని కోరారు. ఇప్పటివరకు 15 మంది ఆయా ఆసుపత్రి నుంచి ఇళ్లకు డిస్చార్ అయ్యారని, పరిస్థితి అదుపులోనే ఉందని స్పష్టం చేశారు

# ఫండమెంటల్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ " పుస్తకావిష్కరణ



**నరసన్నపేట ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్ :**ఇటీవల విద్యా రంగంలో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) ప్రాధాన్యత వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, "ఫండమెంటల్స్ అఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్" అనే విలువైన పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ పుస్తకాన్ని ప్రముఖ అధ్యాపకులు, పరిశోధకులు డాక్టర్. పి. త్రినాథ రావు, డాక్టర్. జి. రామకృష్ణ,శ్రీధర్ డాక్టర్,ఎం.జయంతి రావు సంయుక్తంగా రచించారు.ఈ పుస్తకాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. పి. లత అన్ని విభాగాల అధ్యాపకుల సమక్షంలో అధికారికంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొనడంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. పి. లత మాట్లాడుతూ, "ప్రస్తుత యుగం కృత్రిమ మేధస్సు యుగం. ఏ ఐ లేకుండా భవిష్యత్తును ఊహించలేం. విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యవసాయం, సమాచార సాంకేతికత వంటి అనేక రంగాలలో ఏ ఐ కీలక పాత్ర పోషిస్తోంది. ఈ నేపథ్యంలో 'ఫండమెంటల్స్ అఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ' వంటి పుస్తకం విద్యార్థులకు మాత్రమే కాకుండా అధ్యాపకులకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది" అని తెలిపారు.ఈ పుస్తకం ఏ ఐ యొక్క మౌలిక సూత్రాలను సులభమైన భాషలో వివరించడం విశేషం. కృత్రిమ మేధస్సు అంటే ఏమిటి, దాని చరిత్ర, అభివృద్ధి దశలు, ముఖ్యమైన అల్గోరిథమ్స్, మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్‌వర్క్స్, డేటా అనలిటిక్స్ వంటి అంశాలను స్పష్టంగా వివరించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ మరియు కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉదాహరణలతో కూడిన వివరణలు ఈ పుస్తకానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.డా. పి. లత మాట్లాడుతూ, "నేటి విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తక జ్ఞానంతో సరిపెట్టుకోకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకోవాలి. ఏ ఐ వంటి అంశాలలో పట్టు సాధిస్తే, గ్లోబల్ స్థాయిలో అవకాశాలు మరింత విస్తరిస్తాయి. ఈ పుస్తకం విద్యార్థుల్లో ఆలోచనా విధానాన్ని పెంపొందించి, పరిశోధన దృక్పథాన్ని అభివృద్ధి చేస్తుంది" అని అన్నారు.ఈ సందర్భంగా రచయితల బృందాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ, డా. పి. లత గారు "డా. పి. త్రినాధ రావు మరియు వారి బృందం చేసిన ఈ కృషి ప్రశంసనీయం. విద్యా రంగానికి ఇలాంటి నాణ్యమైన పుస్తకాలు అందించడం నిజంగా అభినందించదగిన విషయం. ఈ పుస్తకం భవిష్యత్తులో అనేక మంది విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుంది" అని తెలిపారు.రచయితలు మాట్లాడుతూ, ఈ పుస్తకాన్ని విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించామని, ఏ ఐ యొక్క మౌలిక అంశాలపై స్పష్టమైన అవగాహన కలిగించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఆధునిక అంశాలపై కూడా పరిశోధనాత్మక పుస్తకాలు తీసుకురావాలనే ఉద్దేశం ఉందని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు కూడా ఈ పుస్తకం గురించి తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐ వంటి ఆధునిక సబ్జెక్టును సరళంగా, వ్యవస్థబద్ధంగా వివరించడం ఈ పుస్తకానికి ప్రధాన బలమని వారు అన్నారు. విద్యార్థులు స్వయంగా నేర్చుకునేలా రూపొందించబడిన ఈ పుస్తకం అకడమిక్, ప్రాక్టికల్ నాలెడ్జ్ మధ్య మంచి అనుసంధానాన్ని కల్పిస్తుందని అభిప్రాయపడ్డారు.మొత్తానికి, "ఫండమెంటల్స్ అఫ్ ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ " పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కృత్రిమ మేధస్సు రంగంలో ఆసక్తి ఉన్న ప్రతి విద్యార్థి మరియు అధ్యాపకుడు తప్పకుండా చదవాల్సిన పుస్తకంగా ఇది నిలుస్తుందని అందరూ ఏకగ్రీవంగా అభిప్రాయపడ్డారు. డా. పి. త్రినాధ రావు, బృందానికి కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# అయోమయంలో మత్స్యకారులు 10 సంవత్సరాల నుంచి ఎదురుచూపులు



**రణస్థలం, ఫిబ్రవరి 25,మేజర్ న్యూస్:** బుధవారం అసెంబ్లీలో ఎచ్చెర్ల నియోజకవర్గ మత్స్యకారుల తరపున హెచ్ ఎల్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్ ఈ ఆర్ అసెంబ్లీలో మాట్లాడారు.ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారు 25 వేల మంది మత్స్యకారులు జీవనం సాగిస్తున్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గంలో కొవ్వాడ పంచాయితీ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ కోసం పూర్తిగా భూసేకరణ చేశారు. 10 సంవత్సరాలు పూర్తయినా ఇప్పటికీ నిర్వాసితులకు ఆర్ ఆర్ కాలనీ ఇళ్లు ఇవ్వలేదు. ధర్మవరంలో కడతామని చెప్పినా అమలు కాలేదు.ఇల్లు లేక, పునరావాసం లేక అదే గ్రామంలో ఉండటంతో రోడ్లు లేవు. తాగునీటి సదుపాయం లేదు.ప్రభుత్వ పథకాలు అందుబాటులో లేవుపది సంవత్సరాలుగా శిక్ష అనుభవిస్తున్నట్లుగా జీవిస్తున్నారు. "ఎప్పుడూ ఆర్ ఆర్ కాలనీ కడతారు? ఎప్పుడూ తరలిస్తారు?" అని ఎదురు చూస్తున్నారు.ఎచ్చెర్ల నియోజకవర్గంలో సుమారు 30 కి.మీ మేర తీరప్రాంతం ఉంది. అక్కడ ఉన్న సైక్లోన్ సెంటర్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. వెంటనే మరమ్మత్తులు చేయాలి.మత్స్యకారుల పిల్లలు పేదరికం, అవగాహన లేమి కారణంగా చిన్న వయసులోనే చదువు ఆపి కుటుంబానికి దూరంగా పని చేయాల్సి వస్తోంది. కొందరు వ్యసనాలకు బానిసలు అవుతున్నారు.అందుకే గౌరవ విద్యాశాఖ మంత్రివర్యులను కోరుతున్నాను. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.నెట్స్ తయారీ, బోటు తయారీ ఒ మరమ్మత్తులపై శిక్షణ ఇవ్వాలి. చదువు మానేసిన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలిఅలాగే స్థానిక ఫార్మా కంపెనీలు వదిలే వ్యర్థాల వల్ల చేపల వేట కష్టమవుతోంది. కాబట్టి ఆ కంపెనీలలో స్థానిక మత్స్యకారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ప్రస్తావించారు.

# చివరి చూపు

## లేదనుకున్నారు. కేంద్ర మంత్రి చొరవ చూపారు



**- దుబాయ్ లో మరణించిన దేవునల్తాడ వాసి మోహనరావు.**

**- అన్నీ తానై నిలిచి చివరి చూపు చేరువ చేసిన రామ్మోహన్ నాయుడు.**

**- బుధవారం దేవునల్తాడలో జరిగిన అంత్యక్రియలు.**

**ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** పొట్టకూటి కోసం దుబాయ్ వలసపోయాడు.. అనారోగ్య కారణాలతో తనువు చాలించాడు.. రెక్కాడితే కాని.. డొక్కాడని ఆ కుటుంబం.. పెద్ద దిక్కు మరణంతో ఏమి తోచని సమయం.. కడ చూపు కూడా కరువవుతుంది అన్న భయం.. అలాంటి సమయంలో సమస్య కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు చేరడం.. ఆ కుటుంబానికి అన్నీ తానై నిలిచి భరోసా కల్పించారు. దుబాయ్ నుండి మృతదేహాన్ని తెప్పించి చివరి చూపును సైతం చేరువ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడ గ్రామానికి చెందిన బుడగట్ల మోహనరావు (42) రిగ్గర్ గా దుబాయ్ లో పనిచేస్తూ ఉన్నాడు. ఫిబ్రవరి తొమ్మిదవ తేదిన సహచరులు పనికి రమ్మంటే ఒంట్లో నలతగా ఉందని రూమ్ లోనే ఉండిపోయాడు.. తీరా వారు వచ్చి చూసేసరికి విగతజీవిగా పడి ఉన్నాడు. ఆ బాధలోనే దేవునల్తాడలో ఉన్న భార్య కుమారులు ధనలక్ష్మి, రాజేష్, నితిన్ లకు సమాచారం ఇచ్చారు. సమాచారాన్ని అయితే చేరవేశారు కానీ చివరి చూపు ఎలా అందివాల్లో అక్కడివారికి తెలియరాలేదు. తోడ్పాటు అందించాల్సిన కంపెని సైతం చేతులు ఎత్తెయ్యడంతో మోహనరావు కడచూపు తమకు దక్కదువేమో అని ఆందోళన చెందారు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన టిడిపి నేత అప్పోజీ సహకారంతో సమాచారాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చెంతకు చేరవేశారు. గత సోమవారం దీనిపై సమాచారం అందుకున్న రామ్మోహన్ నాయుడు కుటుంబానికి ధైర్యాన్ని ఇస్తూ.. బాధ్యతను తీసుకున్నారు. భారతదేశ విదేశాంగ శాఖ, దుబాయ్ ఎంబసి తో సంప్రదింపులు ముమ్మరం చేశారు. మృతదేహం తరలింపులో మోహనరావు కుటుంబానికి ఎటువంటి ఆర్థిక ఇబ్బంది లేకుండా అన్నీ తానై చూసుకున్నారు. ఈ నేపధ్యంలో దుబాయ్ నుండి డిల్లీ, డిల్లీ నుండి విశాఖ, బుధవారం నాడు విశాఖ నుండి దేవునల్తాడ వరకూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా మోహనరావు మృతదేహం చేరుకుంది. తమ కుటుంబ పెద్దదిక్కును కడసారిగా చూసుకుని.. తమ సంప్రదాయాల ప్రకారం అంతిమ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా దేవునల్తాడ గ్రామస్తులు, మోహనరావు కుటుంబీకులు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై

# మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి ధ్వజం

**- అసెంబ్లీ వేదికగా అబద్ధాల ప్రచారం**

**- ప్రజారోగ్యం గాలికొదిలేసిన ప్రభుత్వం**



**పాతపట్నం మేజర్ న్యూస్: ఫిబ్రవరి 25:**కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి అంటే ఏమాత్రం భయం, భక్తి లేకుండా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పవిత్రమైన అసెంబ్లీని అబద్ధాలకు వేదికగా మార్చుతోందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రస్థాయిలో విమర్శించారు.తిరుమల లడ్డులో నెయ్యి అంశంపై ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చర్చంతా కేవలం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై రాజకీయంగా బురద చల్లడానికేనని మండిపడ్డారు. దేవుడిని సైతం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం చంద్రబాబు నైజమని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి అసత్య ప్రచారాలకు తెరలేపారని విమర్శించారు.ప్రస్తుతం రాష్ట్రంలో కలుషిత నీటి కారణంగా డయేరియా (అతిసారం) ప్రబలి ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో డయేరియా (అతిసారం) ప్రబలి సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే, ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం మరియు జిల్లా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అత్యంత దారుణమన్నారు. ఇది ప్రకృతి వైపరీత్యం కాదు, ముమ్మాటికీ ప్రభుత్వ పాలనా వైఫల్యమే. పారిశుద్ధ్య నిర్వహణ లోపం, తాగునీటి క్లోరినేషన్ చేయకపోవడమే ఈ మరణాలకు కారణమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస మందులు, సిబ్బంది లేకపోవడంతో పేదలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పులపాలవుతున్నారు.వైఎస్ జగన్ హయాంలో ఆరోగ్య రంగం స్వర్ణయుగాన్ని చూసిందని గుర్తు చేశారు. గతంలో క్లిష్టంగా ఉన్న చికిత్సలను 3,000 పైచిలుకు పెంచి, సామాన్యుడికి కార్పొరేట్ వైద్యాన్ని చేరువ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం ఇంటి ముంగిటకే వచ్చేలా వినూత్న వ్యవస్థను నిర్మించారు. ఇంటింటికీ సర్వే చేసి, రోగ నిర్ధారణ చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసిన ఘనత జగన్ కే దక్కుతుంది.ప్రజలకు అందాల్సిన కనీస వైద్య సేవలు నేడు కూటమి ప్రభుత్వంలో "అందని ఆకాశం"గా మారాయన్నారు. తక్షణమే ప్రభుత్వం తన రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకొని, ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

## నియోజకవర్గ అభివృద్ధికి

# రూ 3, కోట్ల ఇరవై లక్షల నిధులు మంజూరు



**- ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశం**

**కోటబొమ్మాళి ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చొరవతో నియోజకవర్గ అభివృద్ధికి రూ 3 కోట్ల ఇరవై లక్షల నిధులు మంజూరు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మన్ ఛాంబర్ , మీటింగ్ హాల్ నిర్మాణానికి 55లక్షలు కేటాయించగా, ప్రహరీ గోడ నిర్మాణానికి, గేట్ల ఏర్పాటుకు కోటిన్నర రూపాయలు కేటాయించారు. కార్యాలయ భవనం ఆధునికీకరణకు 25 లక్షల రూపాయలు, అలానే కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ భవనం ఆధునికీకరణకు, చీపుర్లపాడు వద్ద మార్కెట్ యార్డు మంజూరుతో పాటు సంబంధిత మౌలిక వసతుల అభివృద్ధికి 90 లక్షలు మంజూరు చేశారు. మొత్తం మూడు కోట్ల ఇరవై లక్షల రూపాయలు కేటాయిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు ఇచ్చింది. వీటితో త్వరలో పనులు చేపట్టనున్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కృషి ఫలితంగానే నిధులు మంజూరు అయ్యాయని, ఆయన పదవి అందుకున్న నాటి నుంచి నేటి వరకూ టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు, నియోజకవర్గ స్థాయి కూటమి నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## పదివ తరగతి విద్యార్థుల "మేలు" కొలుపు



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:**మండలం కొత్తపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాల పరిధి ప్రాంతాలైన కొత్తపల్లి, చరణ్ దాస్ పురం, జలారి, మదనాపురం, చిన్నసాన, గుడివాడ, రామకృష్ణాపురం ప్రాంతాలలో గల పదవతరగతి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి మేల్కొలుపు నిర్వహించారు. అలాగే పదవతరగతి విద్యార్థులతో పాటు ఇతర తరగతులు చదువుతున్న విద్యార్థుల ఇండ్లకు కూడా రాత్రి వేళల్లో వెళ్లి వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించడమే కాకుండా వారి సందేహాలను నివృత్తి చేసారు. పదవ తరగతి విద్యార్థులకు మెలకువలు నేర్పించడంతో పాటు ఉదయం ఐదు గంటలకు వారి మరియు పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఎక్కువ మార్కులు పొందటానికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భనలో వచ్చే విద్యా సంవత్సరానికి నాలుగు క్రొత్త ప్రవేశాలను కూడా పొందినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంత కుమారి తెలిపారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషికి నాయకులు, గ్రామస్తులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జే గోవిందరావు, షణ్ముఖ, తిరుపతి ,లక్ష్మణ రావు, గోపి గంగులీలు పాల్గొన్నారు.

## స్వా మిత్ర సర్వే వేగవంతం చేయాలి



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 25. మేజర్ న్యూస్:**స్వా మిత్ర సర్వే వేగవంతం చేయాలని టెక్కలి డిడిఓ అలివేలుమంగా అన్నారు. బుధవారం మెలియాపుట్టి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ స్వామిత్ర సర్వే తో పాటు ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, పంచాయితీలకు ఆదాయం పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో శివాజీ ,మోహనరావు, జీవనరావు ,నాగమ్మ ,ఢిల్లీరావు ,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మెళియాపుట్టిలో వర్షం.. చల్లబడిన వాతావరణం



**మెలియాపుట్టి. ఫిబ్రవరి 25. మేజర్ న్యూస్:**మెళియాపుట్టిలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. వాతావరణంలో మార్పు చోటుచేసుకొని ఒక్కసారిగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా పగటిపూట ఉష్ణోగ్రతలు కాస్త అధికంగా నమోదు అవుతూ ఉక్కపోత వాతావరణం నెలకొనగా.. బుధవారం కురిసిన వర్షంతో మెళియాపుట్టి పరిసర ప్రాంతాలు చల్లబడ్డాయి. మండలంలో పలు గ్రామాలలో తేలిక పాట వర్షం కురిసింది. ఈ ఏడాది వేసవి ప్రారంభ దశలోనే ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

## నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శిరీష నిరంతర కృషి



**- పలాస నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే తీరు అద్భుతం.**

**- కేంద్ర,రాష్ట్ర మంత్రుల సహాయం ఎనలేనిది.**

**- శరవేగంగా పలాస రైల్వే స్టేషన్ ముస్తాబు.**

**- నిరుద్యోగ యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలకు కార్గో ఎయిర్పోర్ట్ శుభపరిణామం.**

**- మాజీ మంత్రి అప్పలరాజు అనాలోచిత నిర్ణయాలక యువత బలి.**

**- బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు ధ్వజం.**

**పలాస, ఫిబ్రవరి 15, మేజర్ న్యూస్:**పలాస నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి ఎమ్మెల్యే గౌతు శిరీష విశేష కృషి చేస్తున్నారని,గత వైసీపీ పాలనలో రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు..అప్పటి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు ఈ నియోజవర్గానికి అందించిన ఎంపీ ల్యాడ్స్ నిధులను ఖర్చు చేయకుండా అడ్డుకుని అభివృద్ధి నిరోధకులుగా మారారని రాష్ట్ర బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావు ధ్వజమెత్తారు.పలాస రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడి,కూటమి ప్రభుత్వం వైపు మొగ్గు చూపడంతో పలాస ఎమ్మెల్యేగా గౌతు శిరీషను 42 వేల పైచిలుకు ఓట్ల మెజార్టీ సాధించారని గుర్తు చేసారు.అయితే ఆ బాధ్యతలను చిత్తశుద్ధితో ఆమె నెరవేరుస్తూ ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పధాన నడిపిస్తున్నారని పేర్కొన్నారు.అయితే గతంలో కుర్చీల నాయుడు అంటూ వెకిలి చేష్టలకు పాల్పడిన అప్పలరాజుకు పలాస రైల్వే స్టేషనులో జరుగుతున్న అభివృద్ధి ఓ చెంప పెట్టు అని అభిప్రాయపడ్డారు.ఈ స్టేషన్ అభివృద్ధికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష,కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విశేష కృషి చేసారని కొనియాడారు.గత ఐదేళ్లలో ఈ ప్రాంతాభివృద్ధికి అప్పలరాజు చేసిందేమిటని ప్రశ్నించారు. శిలాఫకాలు ఆవిష్కరణకు తప్ప అయన చేసిన ప్రారంభోత్సవాలేమిటని చురకలంటించారు.అయితే పని చేస్తున్న నాయకత్వానికి ప్రజలు వెన్నంటే ఉంటె మరింత బలం చేకూరుతుందన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతాభివృద్ధిపై యువనాయకుడు నారా లోకేష్ బాబు దృష్టి సారించినట్లు చెప్పారు.గడచిన ఇరవై నెలల్లో ఒక ఆడపిల్ల సుపరిపాలన అందిస్తున్న తీరు చూస్తే ముచ్చట వేస్తుందన్నారు.ఏడుకొండల వెంకటేశ్వర స్వామికి అపరాధం చేసి వైసీపీ నాయకులు బూటకపు కబుర్లు ఆడుతూ మరింత పాపాన్ని మూట గట్టు కుంటున్నారని అసహనం వ్యక్తం చేసారు. తప్పు ఒప్పుకుంటే ఆ భగవంతుడు మన్నిస్తాడనున్నారు.నిన్న అసెంబ్లీ లో ఈ అంశంపై అనర్గళంగా ప్రసంగించిన శిరీషను కొనియాడారు.ఎయిర్ పోర్టుతో ఉపాధి అవకాశాలు,కార్గో ఎయిర్ పోర్టుతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఆయన చెప్పారు. ఈ ఎయిర్ పోర్టు ను ఏర్పాటు చేసి, అనుబంధ పరిశ్రమలతో ఈ ప్రాంత ప్రజలు మరింత ఆదాయ వనరులు సమకూర్చుకునే అవకాశం ఉందన్నారు.ఈయనతో పాటు కూటమి నాయకులు దడియాల నరసింహులు, గోపాల్ తదితరులు ఉన్నారు.

## "సాగర ఘోష" గోడ పత్రిక ఆవిష్కరణ



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్ :** మార్చి 1న విశాఖపట్నంలో తలపెట్టిన సీపీఎస్ ఉద్యోగుల సాగర ఘోషను విజయవంతం చేయాలి అని సంఘ ప్రధానకార్యదర్శి కరిమి.రాజేశ్వరరావు, మండల పరిషత్ పరిపాలన అధికారి నారాయణరావులు అన్నారు. వారు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ అవరణలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులు పెద్దఎత్తున సాగర ఘోష ద్వారా ప్రభుత్వానికి మన సమస్యలను, మన వాణి వినిపించడానికి అందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమములో పంచాయతీ కార్యదర్శులు బోకర నరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీళ్ళపేట మత్స్యకారుల వెతలపై గళం విప్పిన ఎమ్మెల్యే

**- మినీ జెట్టి కోసం మంత్రికి నేరుగా వినతి.**

**- ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవతో గ్రామ పెద్దలు,మత్స్యకారులతో కలిసి మంత్రి అచ్చెన్నాయుడుకు లేఖ సమర్పణ.**



**పలాస, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్శ్రీ** కాకుళం జిల్లా,వజ్రపుకొత్తూరు మండలం,మంచినీళ్ళపేట గ్రామ మత్స్యకారుల'మినీ జెట్టి'డిమాండ్ పై శాసనసభ వేదికగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష బలంగా వినిపించారు.పలాస నియోజకవర్గ శాసన సభ్యురాలు గౌతు శిరీష,మంచినీళ్ళపేట గ్రామ ప్రజలు--మత్స్యకారులతో కలిసి రాష్ట్ర మత్స్య,పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ని అసెంబ్లీలో కలిసి గ్రామస్థులు అందించిన వినతిపత్రాన్ని నేరుగా సమర్పించారు.సుమారు 5 వేల జనాభా గల మంచినీళ్ళపేటలో 100 ఇంజిన్ బోట్లు, 100 కట్ల తెప్పలతో మత్స్యకారులు జీవనం సాగిస్తున్నప్పటికీ,ఫిషింగ్ జెట్టి లేకపోవడం వల్ల ప్రతి ఏటా కెరటాలు,తుఫాన్ల సమయంలో ప్రాణనష్టం,ఆస్తినష్టం జరుగుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.జెట్టి లేకపోవడంతో వలలు,ఇంజిన్లు,బోట్లు ధ్వంసమై లక్షలాది రూపాయలు నష్టం వస్తోందని,పని లేక ఏటా సుమారు 500 మంది గుజరాత్,గోవా,బొంబాయి, కర్ణాటక,మంగుళూరు వంటి ప్రాంతాలకు వలస వెళ్లి అక్కడ కూడా ప్రమాదాల బారిన పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.గ్రామ మాజీ సర్పంచ్ గుల్ల చిన్నారావు తదితర గ్రామ పెద్దలు, మత్స్యకారులు స్వయంగా మంత్రికి తమ సమస్యను వివరించడంతో పరిస్థితి తీవ్రతను మంత్రి అచ్చెన్నాయుడు తెలుసుకుని సానుకూలంగా స్పందించారు.ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని,వీలైనంత త్వరగా సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు.గ్రామ ప్రజలు మా గోడును అసెంబ్లీ స్థాయిలో వినిపించి,మంత్రివర్యులను నేరుగా కలిపిన ఎమ్మెల్యే శిరీష మమకారం మాకు ధైర్యాన్ని ఇచ్చింది అంటూ కృతజ్ఞతలు తెలిపారు.మత్స్యకార కుటుంబాలకు భద్రత,జీవనోపాధి స్థిరత్వం కలిగించేలా మినీ జెట్టి మంజూరు కోసం తమ ప్రయత్నం కొనసాగుతుందని ఎమ్మెల్యే శిరీష స్పష్టం చేశారు.

## బాధితులను పరామర్శించిన మంత్రి నారాయణ



**శ్రీకాకుళం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**శ్రీకాకుళం నగరంలో అతిసారం ప్రబలిన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించేందుకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో పర్యటించారు. మంత్రి తొలుత మంగు వారి తోట (రాంనగర్ )వీధికి చేరుకుని డయేరియాతో మృతి చెందిన మండల సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అక్కడే క్షేత్రస్థాయిలో పర్యటించారు.

## ఘనంగా సిరుల పోతన్న జాతర





**హిరమండలం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**హిరమండలంలోని పెరికి వీధిలో కొలువైన సిరుల పోతన్నకు అత్యంత ఘనంగా జాతరను నిర్వహించారు ఈ కార్యక్రమానికి మండల పరిధిలోని అన్ని గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# పారిశుధ్యంపై అధికారుల నిర్లక్ష్యం



**కోటబొమ్మాళి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** మండలంచిన్నసాన గ్రామంలో పారిశుధ్య లోపంతో ప్రధాన వీధి దుర్వాసనతో ఉన్నప్పటికీ సదరు పంచాయతీ అధికారి నిర్లక్ష్యం తేటతెల్లం అవుతుంది. మ కుట్టినట్టైనా అవడం లేదు. స్థానిక స్కూలు ఎదురుగా ఉన్న రహదారి పక్కన కాలువలు నెలలు తొరబడి శానిటైజేషన్ చేయకపోవడంతో, చెత్త పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ప్రతిరోజూ ఈ మార్గం గుండా పాఠశాలకు వెళ్లే చిన్నారులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాలువల్లో నీరు నిల్వ ఉండడంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. పాఠశాల సమీపంలోనే ఈ దుర్వాసన వ్యాపించడం, రోడ్డు వద్ద చిన్నపిల్లలు ఆడుకుంటుండటంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా దోమలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల పరిసరాల్లోనే పరిశుభ్రత లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు. పాఠశాలకు వెళ్లే చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వెంటనే కాలువలను శుభ్రపరచి నిల్వ నీరు తొలగించి శాశ్వత పారిశుధ్య చర్యలు చేపట్టాలని గ్రామస్తులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# పలాసలో ఎయిర్ పోర్టు షురూ

**- ఏపీ ఎయిర్పోర్ట్స్ యం.డి తో ఎమ్మెల్యే గౌతు శిరీష భేటీ.**

**- ఉడాన్ లో భాగంగా పలాసలో ఏర్పాటు.**

**- ప్రయాణ రద్దీని అధిగమించేందుకు దేశంలోని ప్రముఖ పట్టణాలతో కనెక్టివిటీ.**



**పలాస, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** పలాస నియోజకవర్గంలో ఎయిర్ పోర్టు నిర్మించేందుకు ప్రక్రియ వేగవంతమైనట్టు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. ఈ మేరకు మంగళిగిరిలోని ఏపీ ఎయిర్ పోర్టు డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ యం.డి ప్రవీణ్ ఆదిత్య తో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష మాట్లాడుతూ పలాసలో కార్గో ఎయిర్ పోర్టు నిర్మిస్తున్నారనే అపోహలు వ్యాప్తి చెందాయన్నారు.కానీ పలాసలో నిర్మించేది పౌరులు ప్రయాణించేందుకు వీలున్న ఎయిర్ పోర్టు అని,పౌర విమానయనానికే అని స్పష్టం చేసారు. దేశంలోని రైలు ప్రయాణ రద్దీని తగ్గిస్తూ అదే సమయంలో సామాన్యులకు అందుబాటులో ప్రయాణ సదుపాయాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. ఉడాన్ పథకంలో భాగంగా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వి.జి.ఎఫ్) విధానంలో రెండేళ్లపాటు నేరుగా కేంద్ర ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపడు తుందన్నారు.పలాస ప్రాంతం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే సెకండ్ ఏసీ రైలు ప్రయాణికుల వివరాలను సేకరించినట్టు చెప్పారు.అయితే ఈ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే దేశంలోని ప్రముఖ నగరాలైన చెన్నై,బెంగుళూరు,ముంబై, హైదరాబాద్,ఢిల్లీ వంటి నగరాలకు విమానాలు నడిపే అవకాశం ఉందన్నారు.అయితే ఈ ఎయిర్ పోర్టు నిర్మాణంలో నిర్వాసితులకు కూడా ప్రభుత్వం పరిహారం అందిస్తుందని వెల్లడించారు.త్వరలో అధికారుల బృందం సర్వే చేపడుతుందన్నారు.ఆ ప్రాంతంలోని నిరుద్యోగులకు కూడా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు.పదో తరగతి చదివిన వ్యక్తికి కూడా ఎయిర్పోర్టులో ఉపాధి కల్పించే దిశగా అడుగులు వేస్తున్నామని ఇందుకు సంబంధించిన వివరాలను త్వరలో పూర్తిస్థాయిలో ప్రకటిస్తామని ఎమ్మెల్యే శిరీష స్పష్టం చేశారు.

# కెవిటి లను ఓబిసి జాబితా లో చేర్పించాలి



**పలాస, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** పలాస నియోజకవర్గం వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన కెవిటి కులస్తులను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఒబిసి జాబితాలో చేర్పించాలని పలాస జిల్లా కేంద్ర సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ (బాబా) కోరారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ వజ్రపుకొత్తూరు మండలంలోని నువ్వలరేవు గ్రామం అతిపెద్ద గ్రామమని, సుమారు పదివేల జనాభా కలిగి 4,850 ఓట్లు కలిగిన ఈ గ్రామం మొత్తం కేవిటి కులానికి చెందిన వారే అని అన్నారు.ఈ వర్గం రాష్ట్రస్థాయిలో బీసీలుగా గుర్తింపు పొందినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఓబిసి జాబితాలో చేర్పించకపోవడం బాధాకరమని,దీనివల్ల గ్రామ విద్యార్థులు,యువతకు రాజ్యాంగం హామీ ఇచ్చిన రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడం లేదని అన్నారు.ఇది పరిపాలన లోపం మాత్రమే కాదని రాజ్యాంగ హక్కుల నిరాకరణ అని ఆయన ఆరోపించారు.కనుక కెవిటి కులస్థులను వెంటనే కేంద్ర ప్రభుత్వం ఓబీసీ లో జాబితాలో చేర్పించాలని శ్రీధర్ కోరారు.

## ఎంజేపురం హైస్కూల్ విద్యార్థినికి కాంస్య పతకం



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** ఇటీవలే తమిళనాడు జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో గత ఆదివారం జరిగిన జాతీయస్థాయి రగ్బీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు కాంస్య పతకాన్ని సాధించింది. అయితే ఈ విజయంలో అచ్యుతాపురం మండలం ఎంజేపురం ఉన్నతపాఠశాల 10వ తరగతి చదువుతున్న బి. ఇందు కీలక పాత్ర పోషించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రాజా రత్నకుమార్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిభ కనబరిచిన ఇందు జట్టు కాంస్య పతకం సాధించడానికి ముఖ్య కారకురాలైంది. అలాగే ఏపీ జట్టుకు 48 వేల రూపాయల నగదు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందం, గ్రామ సర్పంచ్ కర్రెడ్ల బుల్లెమ్మ, మాజీ సర్పంచ్ సూర్య ప్రకాష్, ఎస్ఎంసీ చైర్పర్సన్ యు. ఉష, గ్రామస్తులు, ఫిజికల్ డైరెక్టర్ రాజు, రబ్బీ జిల్లా కోచ్ కె. వెంకట్ ఇందునుఅభినందించారు. ప్రత్యేకంగా, జెవీహెచ్ఎన్ఎం ఎంజేపురం హైస్కూల్ స్థాపన నుంచి రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో ప్రతిభచూపిన మొదటి విద్యార్థిగా ఇందు చరిత్ర సృష్టించిందని గ్రామవాస్తులు అందరూ ఆనందం వ్యక్తం చేస్తూ అభినందలు తెలిపారు.

# ఎర్రవరంలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** మండలంలో ఎర్రవరం గ్రామంలో స్థానిక కూటమి నాయకులు సహకారంతో రూ.10 లక్షల విలువైన సిసి రోడ్డు నిర్మాణ పనులను కూటమి నాయకులు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆర్ అండ్ బి రోడ్డు నుండి చెరువుగట్టు వరకు ప్రజల కు ఉపయోగపడే రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్గాల భాస్కరరావు, హనుమంతరావు, గూడేల కనకారావు, నర్మాల కోటి బాబు, కొల్లాటి బాబురావు, సంజీవరావు కలం ప్రసాద్, కోట సుధాకర్, గంట కొండలరావు, పీలా శివ, గంగిరెడ్డి గౌరీ అప్పలరాజు, మడక శివ, రీసా శ్రీను పండు తదితరులు పాల్గొన్నారు.

## 26న నల్లమారమ్మ అమ్మవారి పండగకు ఏర్పాట్లు పూర్తి



**అచ్యుతాపురం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** మండలంలో గొర్రె ధర్మవరం శ్రీ నల్ల మాదమ్మ తల్లి అమ్మవారి పండుగ ఈనెల 26న గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేశామని సర్పంచ్ గొర్రె ఆశ్వని నూకరాజు తెలిపారు. ఈ సందర్భముగా సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గురువారం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించబడును కావున భక్తులు, చుట్టూ ప్రక్కల గ్రామాల పురజనులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అమ్మ వారి తీర్థ ప్రసాదములు స్వీకరించి అమ్మవారి యొక్క కృపా కటాక్షములకు పాత్రులు కాగలరని కోరారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. అదే రోజు మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల బండి పోటీలు నిర్వహిస్తున్నామని ఈ పోటీలకు నగదు బహుమతితో పాటు సీల్డ్ అందజేస్తున్నామన్నారు. సాయంత్రం 5 గంటల భారీ మందు గుండు, తీన్మార్ డప్పులు, కాంతార వేషాలు, అఘోర వ్యాసాలు కాళీమాత నాట్యం, బిందెల డాన్స్, గుడి వద్ద డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ఏర్పాటు చేశామని, భక్తులందరూ వచ్చి ఈ కార్యక్రమములను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాలకు సహకరిస్తున్న గ్రామ పెద్దలు ప్రజలు భక్తులందరికీ శ్రీ సల్ల మారమ్మ అమ్మవారి ఆశీస్సులు కృపాకటాక్షములు చల్లని దీవెనలు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

# జోరుగా జనసేన సభ్యత్వాలలో జన సైనికులు ముందుకు రావాలి



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 25:మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమ సభ్యత్వాల నమోదు కార్యక్రమం 26 నుంచి ప్రారంభం కానున్నట్లు అచ్యుతాపురం జనసేన పార్టీ జనరల్ సెక్రటరీ పవన్ విజయ్ తెలిపారు. గ్రామ స్థాయిలో విస్తృతంగా సభ్యత్వాల నమోదు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలు, వార్డులు, కాలనీల్లో ప్రత్యేక బృందాలను నియమించి ఇంటింటికీ వెళ్లి సభ్యత్వాలు నమోదు చేయనున్నట్లు చెప్పారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు అధిక సంఖ్యలో సభ్యత్వాలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు. ఈసారి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఉధృతంగా నిర్వహించి గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పెద్ద ఎత్తున సభ్యత్వాలు నమోదు అవుతాయని పవన్ విజయ్ ఆశాభావం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని పవన విజయ్ పిలుపునిచ్చారు.

## రాజుగారు బీడులో సిసి రోడ్ నిర్మాణ పనులు ప్రారంభం



**పాయకరావుపేట ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:** పట్టణంలోని రాజుగారు బీడులో రూ.10 లక్షలతో సీసీ రోడ్ నిర్మాణానికి బుధవారం కూటమి నాయకులు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు యాళ్ళ వరహాల బాబు మాట్లాడుతూ పట్టణంలోని 14 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎన్ ఆర్ జి ఎస్ గ్రాంట్ రూ.93 లక్షలు శాంక్షన్ అయినట్టు తెలిపారు.మార్చ్ 15, 16 వ తేదీల కల్లా ఈ సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తికానున్నట్లు తెలిపారు.రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకు ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు,బొంది కాశీ విశ్వనాథ్, పెదిరెడ్డి శ్రీను,మజ్జూరి నారాయణరావు,జూరెడ్డి ప్రసాద్,మండల యూత్ అధ్యక్షుడు గొల్లపల్లి నాగు,నారపురెడ్డి పద్మావతి,మలిపెద్ది వెంకటరమణ,గుల్లా నాగరాజు,శ్రీదేవి,సాదు శ్రీను,శివలంక నాగమల్లి,చిరుకూరి పేర్రాజు,వేములపూడి అప్పారావు,దువ్వ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నాటి కల ఎట్టకేలకు సాకారం గండిబోయిన కాలనీ సిమెంట్ రోడ్డు



**అచ్యుతాపురం, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**మండలంలోని మడుతూరు గ్రామంలోని గండిబోయినవారి కాలనీలో ఏళ్ల కల ఎట్టకేలకు సాకారమైంది. ఎన్నో ఏళ్లగా ఎదురుచూస్తున్న సిమెంట్ రోడ్డు పనులకు బుధవారం భూమి పూజ చేశారు. జాతీయ. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో రూ.14 లక్షల వ్యయంతో 308 మీటర్ల పొడవున రోడ్డు నిర్మించనున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి మోటూరు శ్రీవేణి ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. ఎన్నో ఎన్నికల సమయంలో రోడ్డు హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు అమలు కాలేదని కాలనీవాసులు తెలిపారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన తమ కల నెరవేరుతున్నందుకు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. ఇన్ని సంవత్సరాల తరువాత తమ కాలనీకి రోడ్డు నిర్మాణం జరుగుతుండటంహర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాల సంఘం మాజీఅధ్యక్షులు మోటూరు నాగేశ్వరరావు, శనివాడ ఆనందరావు, నారాయణరావు, బలిరెడ్డి శ్రీనివాసరావు, వేలంశెట్టి శశిరావు, కర్రి త్రినాథ్, కర్రి కొండయ్య, గండిబోయిన అప్పలరాజు, నీరుకొండ సంతోష్, నీరుకొండ నాగమణి, దేశంశెట్టి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

## ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



**అచ్యుతాపురం,, ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**మండలం పూడిమడక, రాజుకోడూరులో మంజూరైన గృహ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేయాలని హౌసింగ్ శాఖ అధికారులు లబ్దిదారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టంచేస్తూ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. ఉమాశంకర్ హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. శ్రీనివాస్, హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మమత లబ్దిదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు గృహ కల్పనకు ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటికే మంజూరైన ఇళ్లను ఆలస్యం చేయకుండా వెంటనే పనులు ప్రారంభించి నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని కోరారు. లబ్దిదారులు సానుకూలంగా స్పందిస్తూ వచ్చే నెల 19 నాటికి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## అవంతి విద్యార్థులు అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్



**మాకవరపాలెం,ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:**స్థానిక మాకవరపాలెం అవంతి ఇంజనీరింగ్ కళాశాల చెందిన 23 విద్యార్థులు తగరరపు వలస అవంతి ఇంజనీరింగ్ కాలేజీ లో నిర్వహించినజె యన్ టియూ జివి ఇంటర్ యూనివర్సిటీ సెలెక్షన్స్ ట్రయల్స్ తైకొండో , కరాటే విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచి మొదటిస్థానం సాధించారు. మార్చి నెలలో జరగబోయే అల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్ కరాటే ,తైకొందో పోటీల కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. సి మోహనరావు తెలిపారు. ఎంపికైన విజేతలను అవంతి విద్యాసంస్థల అధినేత ముత్తంశెట్టి శ్రీనివాసరావు అభినదించారు.

## అంగన్వాడీలకు కనీస వేతనం 26000 డిమాండ్



**అచ్చుతాపురం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**అంగనవాడి టీచర్లకు,కనీస వేతనం 26000, ఆయాలకు, 20000 పెంచాలని, పెండింగ్ఉన్న 1810 మినీ వర్కర్లకు క్వాలిఫికేషన్ రిలాక్స్ చేసి మెయిన్ సెంటర్ గా మార్చాలని, చట్టబద్ధమైన గ్రాట్యూటీ అమలు చేయాలని, పెండింగ్లో ఉన్న 164 సూపర్వైజర్ పోస్టులు భర్తీ చేయాలని హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ అంగనవాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యంలో యలమంచిలి అంగన్వాడి ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు రిలే దీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి దేవుడి నాయుడు, అంగనవాడి ఎలమంచిలి ప్రాజెక్ట్ లీడర్ బి శశికళ, కే ఎం ఎస్ జయ మాట్లాడుతూ నేటి కూటమి ప్రభుత్వం మేము అధికారంలోకి వస్తే అంగన్వాడీల సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు విస్మరించి అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోగా యాప్ల భారంతో పని ఒత్తిడిని పెంచుతున్నాయని 24 గంటలు యాప్స్ తోనే సరిపోతుంటే ఎప్పుడు పిల్లలకి చదువు చెప్పాలని ప్రశ్నించారు ధరల విపరీతంగా పెరుగుతున్నప్పటికీ అంగన్వాడీల జీతాలు మాత్రం పెంచడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిఐటియు అచ్చుతాపురం రాంబల్లి మండల కన్వీనర్లు కె సోము నాయుడు సిహెచ్ రామకృష్ణ పి అంజలి ఏ అన్నపూర్ణ బి సంతోష్ వై యమునా కే విజయలక్ష్మి కె కుసుమకుమార్ ఆర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## ‘బ్లూ జెట్ ఫార్మా కంపెనీ “ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న పూడిమడక మత్స్యకారులు.



**అచ్చుతాపురం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**అత్యంత ప్రమాదకరమైన ఫార్మా కంపెనీ ఏర్పాటు చేయటం వల్ల,విడుదలయ్యే వాయు జల కాలుష్యం తో సమీపంలో ఉన్న మత్స్యకార గ్రామమైన 20వేల పూడిమడక ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలకు గురై ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుంది.ఇప్పటికే సెజ్ లో ఏర్పాటు అయిన వందలాది ఫార్మా కంపెనీల వల్ల,వాటి పైపు లైన్లు వలన, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో పాటు మత్స్య సంపద నశించి జీవన ఉపాధిని కోల్పోయాం ఈ నెల 28 వ తేదిన కంపెనీ శంకుస్థాపన చేయడానికి విచ్చేస్తున్నటువంటి గౌరవ మంత్రివర్యులు “నారా లోకేష్ కి విజ్ఞప్తి చేస్తున్నాము, మీరు శంకుస్థాపన చేయబోతున్న ఫార్మా కంపెనీ ఏర్పాటుపై ఎటువంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదు,అందుచే అభిప్రాయ సేకరణ చేపట్టే వరకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలుపుదల చేయండి.లేని పక్షంలో పార్టీలకు అతీతంగా ప్రజలందరినీ ఐక్యం చేసి ప్రజా పోరాటం చేపడుతామని హెచ్చరిస్తున్నాము.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మత్స్యకార నాయకులుచోడిపల్లి అప్పారావు వాసుపల్లి శ్రీనుఉమ్మిడి అప్పారావు ఉమ్మిడి జగన్ మేరుగు అప్పలరాజు ఏరిపిల్లి ముత్యాలు ఏరిపిల్లి పైడియ్య ఏరిపిల్లి భాను) గణగాళ్ల దేముడు ఉమ్మిడి సత్తిబాబుమైలపల్లి పోలరాజు ) గణగాళ్ల

## శ్రీవారి హుండీ లెక్కింపు

**అనకాపల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** పట్టణంలోని దేమునిగుమ్మం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి హుండీ ఆదాయం 50 రోజులకు రూ.4,26,767/- హుండీ ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో కె చంద్ర తేజ, బి మురళీకృష్ణ తెలిపారు. విశాఖపట్నం నుండి విచ్చేసిన శ్రీవారి భక్తులతో పర్యవేక్షణలో లెక్కించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అర్చకులు పులకడం గిరిబాబ తదితరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ భరోసా సంఘం అధ్యక్షురాలు



**అచ్చుతాపురం ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**మన సమాజంలో ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న మహిళలను నాయకురాళ్ళుగా తయారు చేయడానికి, వారి ఆర్థిక అభివృద్ధికి, సంక్షేమానికి, భద్రతకి “భరోసా” ఇవ్వడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ భరోసా సంఘం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా తెరువుపల్లి గ్రామంలో 8-3-2026 న మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనండిఈ వేడుకలు మనకోసం ,మన అభివృద్ధికి ,సంక్షేమానికి, భద్రతకి మార్గం చూపించుటకు 24ఐ7 “భరోసా” ఉంటుందిమనమందరం ఐక్యతతో నిజాయితీగా ఉంటే ఏదైనా సాధించగలం ఈ వేదిక ను వినియోగించుకుని ప్రతి మహిళ ఈ భరోసా సంఘం లో సభ్యత్వం తీసుకొని మీ గ్రామాలలో, మీ వార్డులలో సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ భరోసా కన్వీనర్లుగా మంచి సమాజం నిర్మించుట కొరకు స్వచ్ఛందంగా బాధ్యతలు నిర్వహించేందుకు మేము సైతం అంటూ ముందుకు రండిమీరు మహిళా నాయకురాళ్ళుగా అభివృద్ధి చెందుటకు మీకు కావలసిన నైపుణ్యాలు ప్రతివారం ఉచిత శిక్షణ ద్వారా మీకు సమాజంలో మంచి గౌరవం ఏర్పడడానికి ఈ వేదికను ఉపయోగించుకోండిఈ యొక్క అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా వచ్చేవారు (మెరుగైన సౌకర్యాలు కల్పన కొరకు) ముందుగా తమ పేర్లను 9110356182- 8500635995 కు కాల్ చేసి నమోదు చేసుకోవలెనుఉత్తమ మహిళలకు గౌరవ అతిథులచే సన్మానాలు ఆటలు, పాటలు పోటీలు గ్రామ ,వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా కన్వీనర్ల నియామకం అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం తదితర కార్యక్రమాలు ఉంటాయి మరిన్ని వివరాలకు సంప్రదించండిసావిత్రి భాయ్ పూలే మహిళా సంక్షేమ భరోసా సంఘం అధ్యక్షురాలు కే వాణిశ్రీ తెలిపారు

## పంచదార్ల అసైన్డ్ భూమి రైతులు న్యాయం కోరుతూ ఎస్ సి కమిషన్ సభ్యునికి వినతి పత్రం



**అచ్చుతాపురం రాంబిల్లి ఫిబ్రవరి 25 మేజర్ న్యూస్:**మండలంలోని పంచదార్ల గ్రామ సమీపంలో అసైన్డ్ భూమి దళిత రైతులు న్యాయం కోరుతూ మంగళవారం రాష్ట్ర ఎస్ సి కమిషన్ సభ్యులు రావాడ సీతారామును కలిసివినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. 1978 వ సంవత్సరంలో దళిత రైతుజ ఒక్కొక్కరికి 2 ఎకరాల 75 సెంట్లు చొప్పున సుమారు 50 ఎకరాల కొండా ఫోరం బోకు ను దళితులకు డి ఫామ్ పట్టా గా కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు. సదర స్థలంలో నాటి నుండి నేటి వరకు దళితులు జీడి, మామిడి, కొబ్బరి తదితర మొక్కలు పంపకం చేస్తూ స్థానిక నివాసం ఉంటూ సాగు చేసుకుంటూ జీవనాధారం సాగిస్తున్నామని పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా న్యాయం కోరుతూ దళిత రైతులు చేస్తున్న కార్యక్రమానికి ప్రభుత్వ న్యాయం చేయాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో గూటాల నాగప్పారావు, కొల్లి సురేష్ తెరపెల్లి నారాయణ ప్రసాద్, గూటాల కనకరత్నం, గుడబండి సాయమ్మ, అనంతరపు జయమ్మ, జల్లూరు దుర్గాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపథమంగా అనకాపల్లికి “మహిళా కీర్తి రత్న అవార్డు”.



**అనకాపల్లి, ఫిబ్రవరి 25, మేజర్ న్యూస్:** ఈ నెల 8వ తేదీన అంతర్జాతీయ మహిళాదినోత్సరం సంధర్భంగా స్థానిక అల్లాడ బాల సౌజన్య కుమారి తెలుగు ఆచార్యులకు చిన్న వయస్సులోనే అధ్యాత్మికవేత్త, ప్రవచనా కర్తగా ఎదిగి అందరి మన్ననలు పొందుతున్న సంధర్భంగా “సవ్యసాచి గ్రూప్స్ ఆఫ్ ఇండియా”, శ్రీశ్రీ కళా వేదిక అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వేడుకలకు “మహిళా కీర్తి రత్న అవార్డు-2016”కు, “ఉమెన్ ఎక్స్ లెన్స్ అవార్డుకు ఎంపిక చేసినందుకు హర్షం వ్యక్తం చేసారు. మార్చి 3వ తేదీన విజయవాడలో అవార్డు తీసుకునే అవకాశం కల్పించినందుకు ఆమె ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. “సమాజంలో మహిళలు ఆదర్శంగా నిలవాలని, ఉతమమైన సమాజం ఏర్పడాలి అంటే మహిళలు ప్రధాన పాత్ర పోషించాలి అని, బాల్యం నుండి పిల్లలలకు సనాతన ధర్మం, మంచి సంస్కృతితో కూడిన నడవడిక అవలంబిస్తే ఉన్నత వ్యక్తులుగా సమాజానికి నిలుస్తారని ఆమె ఈ సందర్భంగా తెలియజేసారు.